www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బిహార్‌లో తొలి విడత పోలింగ్ నేడే

121 అసెంబ్లీ స్థానాలు.. బరిలో 1,314 మంది అభ్యర్థులు
తేజస్వి, తేజ్‌ప్రతాప్, సామ్రాట్ చౌధురి సహా కీలక నేతలు
3.75 కోట్ల మంది ఓటర్ల చేతిలో నేతల భవితవ్యం
పోలింగ్ కేంద్రాలు 45,341.. కొత్త ఓటర్లు 10.72 లక్షలు
'సర్' తర్వాత తొలి ఎన్నికలివే!

2

ఎన్‌డీఏ వైపే బిహార్ మొగ్గు.. మూడు సర్వేల్లో వెల్లడి



పోలింగ్ విధులకు వెళ్తున్న సిబ్బంది

గురువారం | 6-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 218 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి మ.2:55 తదుపరి విదియ; నక్షత్రం: భరణి ఉ.6:34; కృత్తిక తె.3:28, వర్జ్యం: సా.5:01-6:24; దుర్ముహూర్తం: ఉ.10:05-10:50, మ.2:37-3:22; అమృతఘడియలు: రా.1:22-2:46; రాహుకాలం: మ.1:30-3:00; సూర్యోదయం: 6:19, సూర్యాస్తమయం: 5:37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎక్సైజ్ శాఖకు డబుల్ కిక్కు!

ఒక్క నెలలోనే రూ.6,348 కోట్ల ఆదాయం

- మద్యం అమ్మకాలతో అక్టోబరులో రూ. 3,168 కోట్లు
- కొత్త దరఖాస్తులు, లైసెన్స్ ఫీజుల ద్వారా 3,180 కోట్లు
- ప్రభుత్వ ఖజానాకు భారీ ఉపశమనం



హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు ఒక్క నెలలోనే భారీగా ఆదాయం సమకూరింది. ఏకంగా రూ.6,348 కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమ అయ్యాయి. కొత్త మద్యం పాలసీలో భాగంగా అందిన దరఖాస్తుల ఫీజులు, లైసెన్స్ ఫీజుల రూపంలో ఏకంగా రూ.3,180 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. అక్టోబరు నెలలో వరుస పండుగలు రావడంతో మద్యం అమ్మకాల ద్వారా రికార్డు స్థాయిలో రూ.3,168 కోట్ల ఆదాయం సమకూరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రెట్టింపు స్థాయిలో ఆదాయం రావడం ఎక్సైజ్ శాఖ అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. రాష్ట్రంలోని 2,620 మద్యం దుకాణాలకు రెండేళ్ల కాలపరిమితికి కొత్త లైసెన్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. కొత్త పాలసీలో మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజును రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచింది. రెండేళ్ల క్రితం 1.32లక్షల మంది దరఖాస్తు చేయగా.. రూ.2,645 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సారి దరఖాస్తు ఫీజు పెంచినప్పటికీ మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి 95,628 మంది పోటీపడ్డారు. ఫలితంగా కేవలం దరఖాస్తుల విక్రయం ద్వారానే ఎక్సైజ్ శాఖకు రూ.2,868.8 కోట్ల ఆదాయం వచ్చింది. లాటరీలో మద్యం షాపులను దక్కించుకున్న వ్యాపారులు మొదటి విడతలో లైసెన్స్ ఫీజులో ఆరో వంతు మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించడంతో అదనంగా మరో రూ.313 కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమ అయ్యాయి. మరో వైపు.. అక్టోబరు నెలలో పండుగలు, జాతరల కారణంగా మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. గత ఏడాది అక్టోబరులో మద్యం అమ్మకాల ద్వారా రూ.2,987కోట్ల ఆదాయం రాగా.. ఈ సారి రూ.3,168 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో మొత్తం ఆదాయం నెల రోజుల్లోనే రూ.6,348 కోట్ల మార్కును దాటింది. ఎక్సైజ్‌శాఖకు భారీగా ఆదాయం వచ్చిన నేపథ్యంలో పెండింగ్ బిల్లులు మంజూరవుతాయని మద్యం సరఫరాదారులు, కాంట్రాక్టర్లు ఆశిస్తున్నారు. ఏదేమైనా భారీ ఆదాయంతో ప్రభుత్వ ఖజానాకు ఉపశమనం కలిగింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆటో డ్రైవర్ ఆత్మహత్య

3

కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద సీఎం కార్నర్ మీటింగ్‌కు భారీగా హాజరైన జనం; షేక్‌పేటలో సీఎం రేవంత్ ప్రచారం





ఆ పార్టీలు ముస్లింల రిజర్వేషన్‌ను ఎత్తేస్తాయ్

బీజేపీ, బీఆర్ఎస్ కలిసే ప్రయత్నం చేస్తున్నాయి
హిందూ, ముస్లిం.. కాంగ్రెస్‌కు రెండు కళ్లు
కిషన్‌రెడ్డి నాకు సవాళ్లు విసరడం కాదు..
కేసీఆర్, కేటీఆర్‌ల అరెస్టుకు ఢిల్లీలో కొట్లాడాలి
జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ తెప్పించగలరా?
సవాల్ చేసి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటే
బీఆర్ఎస్, బీజేపీల వల్లే జూబ్లీహిల్స్‌లో సమస్యలు
ఉప ఎన్నిక ప్రచార రోడ్ షోలో సీఎం రేవంత్
కారు గుర్తుకు ఓటువేస్తే కమలానికి వేసినట్లే
మోదీకి మద్దతిస్తున్న కేసీఆర్ ప్రమాదకరం
క్రైస్తవ సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ/హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు హిందూ, ముస్లిం మతాలు రెండూ.. రెండు కళ్ల లాంటివని, తాము దేనినీ తక్కువ చేయబోమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌ను వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని గుర్తు చేశారు. అయితే బీఆర్ఎస్, బీజేపీ ఆ రిజర్వేషన్‌ను ఎత్తేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. ముస్లింల రిజర్వేషన్‌ను 12 శాతానికి పెంచుతామన్న కేసీఆర్.. పదేళ్లలో ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి షేక్‌పేట డివిజన్‌లోని పారామౌంట్ కాలనీ గేట్-3 నుంచి

మిగతా 13వ పేజీలో...

'పక్కా లెక్క'లతో బెట్టింగ్!

11

జూబ్లీహిల్స్‌లో గెలుపుపై ప్రత్యేక సర్వేలు
స్థానిక బంధువులకు ఏపీ వాసుల ఫోన్లు
500కోట్ల మేర బెట్టింగ్ జరిగినట్టు అంచనా
ఫలితాల నాటికి 1200 కోట్లకు పెరిగే చాన్స్



చెత్త ఎవరిదో.. సత్తా ఎవరిదో తేలిపోవాలి

13

- హైదరాబాద్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్
- దమ్ముంటే తనని అరెస్టు చేయాలని వ్యాఖ్య

కాంగ్రెస్‌కు హిందువులు ఇజ్జత్ కాదా?

13

మజ్లి‌స్‌ను రేవంత్ భుజాలమీద వేసుకుని తిరుగుతున్నారు: కిషన్ రెడ్డి





హైదరాబాద్‌లో వరల్డ్ క్లాస్
ఫిలిం సిటీ

13

కాంగ్రెస్ హయాంలోనే సినీ రంగానికి మేలు
స్టూడియోలకు స్థలాలిచ్చాం
సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి సర్కారు సిద్ధం
సినీ రంగ ప్రముఖులు, కార్మిక సంఘ నేతలతో భేటీలో భట్టి

యూజ్‌లెస్ శ్రీదేవసేన

విద్యారంగంపై అవగాహన లేదు.. ఆమెను బదిలీ చేయాలి
ముఖ్యమంత్రికి సరైన సలహాలిచ్చే అధికారులే లేరు
8న లక్ష మందితో సభ

14

50శాతం బకాయిలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగిస్తాం
ప్రైవేటు కాలేజీల ప్రతినిధులు

ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా
సుదర్శన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

పథకాల అమలుపై నిరంతరం సమీక్షిస్తామని వ్యాఖ్య

3

న్యూయార్క్ మేయర్‌గా
మమ్దానీ

డెమొక్రాట్ అభ్యర్థి ఘన విజయం

భారత అమెరికన్ దర్శకురాలు మీరానాయర్ కుమారుడే
మరో 2 చోట్లా భారతసంతతి వ్యక్తుల గెలుపు
వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హష్మి
హైదరాబాద్‌లో పుట్టి.. నాలుగున్నరేళ్ల వయస్సులో యూఎస్ వెళ్లిన గజాలా
సిన్సినాటి పట్టణ మేయర్‌గా పంజాబీ ఆఫ్తాబ్
మమ్దానీ గెలుపుతో ట్రంప్‌కు ఎదురుదెబ్బ
స్థానిక ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ ఆధిపత్యం
బ్యాలెట్ పేపర్‌పై నా ఫొటో లేకే ఓటమి: ట్రంప్
'ట్రంప్.. సౌండ్ పెంచుకుని చూడు' అంటూ మమ్దానీ ప్రసంగం



జోహ్రాన్ మమ్దానీ

గజాలా హష్మి

న్యూయార్క్/వాషింగ్టన్, నవంబరు 5: అమెరికాలోని న్యూయార్క్ నగర మేయర్‌గా భారత సంతతి అమెరికన్ జోహ్రాన్ మమ్దానీ ఘన విజయం సాధించారు. డెమొక్రాట్ పార్టీ అభ్యర్థి అయిన మమ్దానీని ఓడించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోవడం గమనార్హం. 34 ఏళ్ల మమ్దానీ న్యూయార్క్ నగర మేయర్ అయిన అతిపిన్న

మిగతా 2వ పేజీలో...

హరియాణాలోనూ ఓట్ చోరీ

25 లక్షల నకిలీ ఓట్లతో బీజేపీ మా గెలుపును దొంగిలించింది

'ఆపరేషన్ సర్కార్ చోరీ'లో మోదీ, అమిత్ షాలతో సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కుమ్మక్కయ్యారు
ఓటరు జాబితాలో బ్రెజిల్ మోడల్ ఫొటోతో 22 ఓట్లు
ఒక నియోజకవర్గంలో ఒక్క స్త్రీ ఫొటోతో 100 ఓట్లు
హెచ్ ఫైల్స్ పేరిట.. 'హైడ్రోజన్ బాంబ్' పేల్చిన రాహుల్
రాహుల్‌వి తప్పుడు ఆరోపణలని కొట్టిపారేసిన బీజేపీ

న్యూఢిల్లీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): "బీజేపీ నేతల్లారా సిద్ధంగా ఉండండి.. ఆటంబాంబు తర్వాత హైడ్రోజన్ బాంబు రాబోతోంది. మీ ఓట్ల చోరీ బండారాన్ని దేశప్రజల ముందు బయటపెడతాం".. అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈ ఏడాది సెప్టెంబరు 1న బిహార్‌లో 'ఓటర్ అధికార్ ర్యాలీ'లో ప్రకటించిన సంగతి గుర్తుందా? ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూసిన

మిగతా 2వ పేజీలో...



విలేకరుల సమావేశంలో రాహుల్

దైవదర్శనానికి వెళ్లి వస్తూ..

3

రోడ్డు ప్రమాదంలో నలుగురు నారాయణ ఖేడ్ వాసుల దుర్మరణం
కర్ణాటకలోని బీదర్ జిల్లాలో ఘటన.. బాధితుల కారును ఢీకొట్టిన బొలెరో వాహనం



ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తిని ఆరబెడుతున్న రైతులు

పత్తిని అమ్ముకునేదెలా?

మద్దతు ధర రూ.8,110 హుళక్కే.. తేమ నిబంధనలతో ధరల్లో కోత
8% లోపు ఉంటే మద్దతు ధర.. ఆపై ప్రతి పాయింటుకు రూ.81 కోత
12% మించి ఉంటే కొనుగోళ్లకు నో.. చాలాచోట్ల 15-30% దాకా తేమ
కొనుగోళ్లపై పరిమితి.. ఎకరాకు 7 క్వింటాళ్లే.. ప్రైవేటులో రైతుల అమ్మకం
ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధన ఎత్తేయాలని జిన్నింగ్ మిల్లర్ల డిమాండ్
నేటి నుంచి కొనుగోళ్లు బంద్.. రాష్ట్ర కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ ప్రకటన
ప్రభుత్వం చర్చల దరిమిలా బంద్ వాయిదా.. కొనుగోళ్లు యథాతథం

ఆదిలాబాద్, వరంగల్ వ్యవసాయం, హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షాలతో దిగుబడులు పడిపోయిన స్థితిలో పత్తిరైతులకు మరో కష్టం వచ్చిపడింది. పెట్టుబడుల కోసం ఎక్కడెక్కడో అప్పులు తెచ్చి ఆరుగాలం కష్టపడి పండిస్తే.. ఇప్పుడు వారికి పత్తి పంటను అమ్ముకోవడమే గగనమవుతోంది. అంతంతమాత్రంగా వస్తున్న దిగుబడులను అమ్ముకొని పెట్టుబడి ఖర్చులైనా మిగుల్చుకోవాలని ఆరాటపడుతున్న రైతులు పంటను విక్రయించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. దీనికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠిన

మిగతా 3వ పేజీలో...



నమో.. నారీ శక్తి

వన్డే ప్రపంచకప్‌లో విజేతలుగా నిలిచిన భారత మహిళా క్రికెటర్లు బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ కౌర్ బృందాన్ని అభినందించిన మోదీ.. ట్రోఫీ పట్టుకొని జట్టు సభ్యులతో ఫొటోలు దిగారు. అనంతరం క్రికెటర్లు తమ సంతకాలతో కూడిన 'నమో' పేరుమీదున్న జెర్సీని మోదీకి అందజేశారు

రూ. 4000కోట్ల ఢిల్లీ హౌసింగ్ సొసైటీ స్కాం కేసు..

మాజీ ఐఏఎస్‌కు 5 ఏళ్ల జైలుశిక్ష

» మరో 12మందికి శిక్షలు ఖరారు

న్యూఢిల్లీ, నవంబరు 5: దాదాపు నాలుగు వేల కోట్ల ఢిల్లీ హౌసింగ్ సొసైటీ కుంభకోణంలో.. మాజీ ఐఏఎస్ సహా 13 మంది నిందితులకు ఢిల్లీ కోర్టు శిక్షలు ఖరారు చేసింది. వీరికి ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్షలు విధించినట్లు ప్రకటించింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు 2006లో సీబీఐ ఈ కేసు విచారణ ప్రారంభించగా, దాదాపు 25సంవత్సరాల తర్వాత ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ప్రశాంత్ వర్మ అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద నిందితులకు శిక్షలు విధించారు. తీర్పు సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, అవినీతిని ఉక్కుపాదంతో అణిచివేయాలన్నారు. అవినీతిని సమాజ ఆరోగ్యానికి ముప్పును కలిగించే క్యాన్సర్‌తో పోల్చిన ఆయన, నయం చేయడానికి కీమోథెరపీ వంటి కఠినమైన చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. కేసు నేపథ్యాన్ని పరిశీలిస్తే, 1999లోనే మూతపడిన సఫ్దర్‌గంజ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీని కొందరు అధికారులు పునరుద్ధరించి, ప్రభుత్వం నుంచి తక్కువ ధరకే భూమిని కాజేయడానికి ప్రయత్నించారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. ఈ స్కాంలో అప్పటి ఐఏఎస్ నరేందర్ కుమార్‌కు కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. నకిలీ పత్రాలు సృష్టించడంతోపాటు చనిపోయిన వారిని బతికున్నట్లుగా చూపించి అక్రమాలకు పాల్పడ్డారని విచారణలో తేలింది.

పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తూ..

రైలు కింద పడి ఆరుగురి దుర్మరణం

» యూపీలోని చునార్ రైల్వే స్టేషన్‌లో ఘటన

మిర్జాపూర్, నవంబరు 5: ఉత్తరప్రదేశ్‌లో ఘోరం జరిగింది. రైల్లోంచి దిగిన ప్రయాణికుల్లో కొందరు, రాంగ్ సైడ్ నుంచి పట్టాలను దాటేందుకు ప్రయత్నిస్తూ ఆ వైపు దూసుకొచ్చిన మరో రైలు కింద నలిగిపోయారు. మిర్జాపూర్ జిల్లాలోని చునార్ జంక్షన్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. మృతులంతా మహిళలే! వారిలో ఇద్దరు బాలికలున్నారు. ఉదయం 9:30కు స్టేషన్‌లోని నాలుగో నంబరు ప్లాట్‌ఫాంపై చోపన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగింది. చునార్ సమీపంలోని గంగానదిలో కార్తీక స్నానాలు చేసేందుకు మీర్జాపూర్ నుంచి బయలుదేరిన యాత్రికులు ఆ రైల్లోంచి కిందకు దిగారు. అక్కడి నుంచి బయటకొచ్చేందుకు ప్రయాణికుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి అందుబాటులో ఉన్నా కొందరు నేరుగా పట్టాలు దాటేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో హౌరా నుంచి కల్కాజీ వెళుతున్న నేతాజీ ఎక్స్‌ప్రెస్ రైలు యాత్రికుల మీద నుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సవిత (28), సాధన (16), శివకుమారి (12), అంజూదేవి (20) సుశీలాదేవి (60), కళావతి (50) మృతిచెందారు.

మెక్సికో అధ్యక్షురాలికి లైంగిక వేధింపులు!



మెక్సికో సిటీ, నవంబరు 5: మెక్సికో దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌కు మంగళవారం షాకింగ్ ఘటన ఎదురైంది. ఆమెపై ఓ వ్యక్తి పట్టపగలు బహిరంగంగా లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. షీన్‌బామ్ దేశ రాజధాని మెక్సికో సిటీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా రోడ్డుపక్కన ఉన్నవారిని కలిసి ముచ్చటిస్తుండగా.. ఓ వ్యక్తి ఆమె వెనక నుంచి వచ్చి ఆమెను పట్టుకొని ముద్దు పెట్టేందుకు ప్రయత్నించాడు. ఆమెను అసభ్యంగా తాకేందుకూ యత్నించాడు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి దుండగుడిని వెనక్కి లాగినా.. అతడు అధ్యక్షురాలికి సమీపంగా వెళ్లేదాకా నిర్లక్ష్యం వహించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అయింది.

ఢిల్లీలో కాలుష్య నియంత్రణకు సాయం: చైనా

న్యూఢిల్లీ, నవంబరు 5: దేశ రాజధాని న్యూఢిల్లీని కాలుష్యం కోరల్లో నుంచి తప్పించేందుకు అవసరమైన సాయం చేస్తామంటూ చైనా ముందుకొచ్చింది. బీజింగ్, షాంఘై నగరాల్లో కాలుష్యం సమస్యను విజయవంతంగా ఎదుర్కొన్న తాము తమ అనుభవాన్ని భారత్‌తో పంచుకొని, కాలుష్య నియంత్రణకు సహకరిస్తామని భారత్‌లోని చైనా ఎంబసీ అధికారి యూజింగ్ ఎక్స్‌లో బుధవారం ఓ పోస్టు చేశారు. న్యూఢిల్లీలో క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ చేపట్టి వారం రోజులు అవుతుండగా.. బుధవారం ఉదయం తొమ్మిది గంటలప్పుడు గాలి నాణ్యత సూచి(ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) 228గా ఉంది. గతంతో పోలిస్తే గాలి నాణ్యత మెరుగైనప్పటికీ గాలి నాణ్యత ఇంకా ప్రమాదకర స్థాయిలోనే ఉంది. న్యూఢిల్లీ తరహా పరిస్థితులనే గతంలో బీజింగ్‌లో ఎదుర్కొన్న చైనా.. 2013లో కాలుష్యంపై యుద్ధం ప్రకటించింది. వివిధ చర్యలతో బీజింగ్ కాలుష్యం బారి నుంచి దాదాపుగా బయటపడింది.

రూ.1.68 లక్షల కోట్ల మహిళా పథకాలు

» ప్రస్తుత బడ్జెట్‌లో 12 రాష్ట్రాలు చేయనున్న భారీ ఖర్చు ఇది

» మహిళల సంక్షేమ ఖర్చే అత్యధికం.. అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 5: మహిళలు కేంద్రంగా అమలు చేస్తున్న నగదు బదిలీ (యూసీటీ) పథకాలతో రాష్ట్రాల ఆర్థికవ్యవస్థలు కుదేలవుతున్నాయని, మిగులులో ఉండే రాష్ట్రాల రెవెన్యూ కాస్తా లోటులోకి జారిపోతోందని ఓ అధ్యయనంలో తేలింది. మూడేళ్ల క్రితం రెండు రాష్ట్రాలకే పరిమితమైన ఈ తరహా పథకాల అమలు ఇప్పుడు 12 రాష్ట్రాలకు విస్తరించిందని, ప్రస్తుత బడ్జెట్‌లో ఈ రాష్ట్రాలు మొత్తం రూ.1.68 లక్షల కోట్లు (1.68 ట్రిలియన్లు) దీనికోసం వెచ్చించనున్నాయని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అనే సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ పథకాలను అమలుచేస్తున్నవాటిలో ఆరు రాష్ట్రాలు ఈ ఏడాది రెవెన్యూలోటును నమోదు చేశాయని చెబుతూ.. పెరిగిన యూసీటీల విస్తృతి ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా మారిందనేందుకు ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించింది.

లంచావతారులపై వేటు

» 'తండ్రి ఆవేదన'పై స్పందించిన బెంగళూరు సీపీ

» ఇప్పటికే ఓ ఎస్సై, కానిస్టేబుల్‌పై చర్యలు

» తాజాగా బెళ్లందూరు ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

బెంగళూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కుమార్తెను పోగొట్టుకుని దుఃఖంలో ఉన్న తండ్రి నుంచి లంచం డిమాండ్ చేసి, వేధించిన ఉద్యోగులపై చర్యలు కొనసాగుతున్నాయి. ముంబైకి చెందిన అక్షయ(34) అనే యువతి సెప్టెంబరు 18న అనారోగ్యంతో బెంగళూరులో మృతి చెందగా.. ఆమె మృతదేహాన్ని ఇచ్చే క్రమంలో తన నుంచి లంచం డిమాండ్ చేసి వేధించారని ఆమె తండ్రి, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ చీఫ్ ఫైనాన్స్ అధికారి శివకుమార్ తనకు ఎదురైన చేదు అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకున్న విషయం విదితమే. పోలీసులు, బెంగళూరు పాలికె, ఆస్పత్రి పోస్టుమార్టం ఉద్యోగులు.. ఇలా ప్రతి ఒక్కరూ వేధించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నగర పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే సబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, కానిస్టేబుల్ గోరక్‌నాథ్ సస్పెండ్ అయ్యారు. లంచం తీసుకున్నట్టు నిర్ధారణ కావడంతో బెళ్లందూరు ఇన్‌స్పెక్టర్ రమేశ్ రొట్టిని బుధవారం సస్పెండ్ చేశారు.

న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ



తల్లిదండ్రులు, భార్యతో జోహ్రాన్ మమ్దానీ

(మొదటి పేజీ తరువాయి)

వయస్కుడిగా, తొలి భారతీయ అమెరికన్ ముస్లింగా, తొలి దక్షిణాసియా సంతతి వ్యక్తిగా రికార్డులు సృష్టించారు. జనవరి 1న మేయర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. మరో భారతీయ అమెరికన్ ముస్లిం గజాలా హష్మి వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా, భారతీయ అమెరికన్ పంజాబీ ఆఫ్తాబ్ కర్మ సింగ్ పురేవల్ సిన్సినాటి పట్టణ మేయర్‌గా విజయం సాధించారు. ముగ్గురూ డెమొక్రాట్ పార్టీ తరఫునే గెలవడం విశేషం. న్యూయార్క్‌తోపాటు న్యూజెర్సీ, వర్జీనియా, సిన్సినాటిలలో జరిగిన ఎన్నికల్లో డెమొక్రాట్లే విజయం సాధించడంపై ఆ పార్టీకి చెందిన అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, ఒబామా హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పెద్ద విజయాలు సాధిస్తామని ప్రకటించారు.

ట్రంప్‌ను ఎండగడుతూ..

జోహ్రాన్ మమ్దానీ తల్లి ప్రముఖ భారతీయ అమెరికన్ దర్శకురాలు మీరా నాయర్, తండ్రి ఉగాండాలో స్థిరపడిన గుజరాతీ ముస్లిం మహమ్మద్ మమ్దానీ. ఉగాండాలోనే 1991లో జన్మించిన జోహ్రాన్ మమ్దానీ తల్లిదండ్రులతో కలిసి ఏడేళ్ల వయసులో అమెరికాకు వచ్చారు. సామ్యవాదాన్ని అనుసరిస్తానని చెప్పే జోహ్రాన్ మమ్దానీ.. న్యూయార్క్ నగరంలో పేద, మధ్య తరగతి వర్గాల సంక్షేమమే లక్ష్యమని ప్రకటించారు. న్యూయార్క్ నగరంలో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తానని ప్రకటించారు. నెలల పిల్లల నుంచి ఐదేళ్ల వయస్సు ఉన్న పిల్లల ఆలనాపాలనా చూసుకునేందుకు ఉచిత చైల్డ్ డే కేర్ సెంటర్లు ప్రారంభిస్తానని మరో హామీ ఇచ్చారు. సంపన్నులపై, కార్పొరేట్ సంస్థలపై పన్నులు పెంచుతానని.. ఇళ్ల అద్దెలపై నియంత్రణ విధిస్తానని హామీనిచ్చి పేదలను ఆకట్టుకున్నారు. అదే సమయంలో ట్రంప్ అమలు చేస్తున్న వలస వ్యతిరేక విధానాలను జోహ్రాన్ విపరీతంగా ఎండగట్టారు.

నిధులు ఇవ్వనని ట్రంప్ బెదిరించినా..

న్యూయార్క్‌లో డెమొక్రాట్ పార్టీకి బలం ఎక్కువగా ఉండటంతో.. మమ్దానీ గెలిచే అవకాశం ఉందని ముందునుంచే అంచనాలు వెలువడ్డాయి. దీనితో న్యూయార్క్‌కు చెందిన ట్రంప్ స్వయంగా రంగంలోకి దిగి, రిపబ్లికన్ అభ్యర్థి కర్టిస్ స్లివా తరఫున ప్రచారం చేశారు. మమ్దానీ గెలిస్తే న్యూయార్క్ నగరానికి అందే ఫెడరల్ (కేంద్ర) నిధుల్లో కోత పెడతానని హెచ్చరించారు. గతంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఖండించిన మమ్దానీని యూదు వ్యతిరేకుడని ట్రంప్ ప్రచారం చేశారు. న్యూయార్క్‌లో యూదు జనాభా గణనీయంగా ఉన్న నేపథ్యంలో.. మమ్దానీకి మద్దతు ఇచ్చే యూదులు మూర్ఖులని వ్యాఖ్యానించారు. అయినా మమ్దానీకే మద్దతు లభించింది. కాగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులు ఓడిపోవడంపై ట్రంప్ స్పందించారు. బ్యాలెట్ పేపర్‌పై తన ఫొటో లేకపోవడం, బడ్జెట్ ఆమోదం పొందక ప్రభుత్వ ప్రతిష్టంభన కొనసాగుతుండటమే ఓటమికి కారణాలని పేర్కొన్నారు.

నెహ్రూ సూక్తులు.. ట్రంప్‌కు సవాళ్లు!

న్యూయార్క్ మేయర్‌గా విజయం సాధించిన తర్వాత జోహ్రాన్ మమ్దానీ ఆవేశంగా, ఉద్వేగంగా ప్రసంగించారు. తన భార్య రమా దువాజీ, తల్లిదండ్రులు పక్కన ఉండగా, వేదికపై 25 నిమిషాల పాటు మాట్లాడారు. న్యూయార్క్ ఎన్నిక ఫలితాలు కొత్త తరహా రాజకీయాలకు నాంది పలికాయని చెప్పారు. భారత ప్రథమ ప్రధాని నెహ్రూ మాటలను గుర్తుచేసుకుంటూ.. "చరిత్రలో అరుదుగా ఇలాంటి సందర్భాలు వస్తాయి. ఒక శకం ముగిసినప్పుడు.. పాతశకాన్ని వదిలి కొత్త శకాన్ని అనుసరించినప్పుడు.. సుదీర్ఘంగా అణచివేతకు గురైన జాతి గళం విప్పినప్పుడు.. ఇలాంటి క్షణాలు వస్తాయి. ఇప్పుడు మనం ఒక నవ శకంలోకి అడుగుపెడుతున్నాం" అని పేర్కొన్నారు. వలసవాదులకు తాను అండగా నిలిచిపోరాడుతానని ప్రకటించారు. అదే సమయంలో అధ్యక్షుడు ట్రంప్‌కు సవాళ్లు విసిరారు. "ట్రంప్.. మీరు ఇది చూస్తున్నారని నాకు తెలుసు. సౌండ్ పెంచుకుని నా మాటలు వినండి. దేశాన్ని వంచించిన ట్రంప్‌ను ఎలా ఓడించాలన్న దానిని ఆయన పెరిగిన న్యూయార్క్ చేసి చూపించింది. ఒక నియంతను అతనికి అధికారాన్ని అందించిన పరిస్థితులను మార్చడంతోనే భయపెట్టగలం. ఇది ట్రంప్‌ను ఆపేందుకు మాత్రమే కాదు. ఆయనలా తర్వాత వచ్చే వారిని ఆపేందుకు కూడా.. ట్రంప్ వంటి బిలియనీర్లు పన్నులను తప్పించుకునేందుకు, రాయితీలను అక్రమంగా పొందేందుకు వీలు కల్పించే అవినీతి సంస్కృతికి ముగింపు పలుకుతాం. వలసదారులకు, కార్మికులకు అండగా నిలుస్తాం. వలసవాదులు నిర్మించిన, వలసదారులు నడిపిస్తున్న నగరంగా న్యూయార్క్ ఉంటుంది. మీరు వలసదారులు కావొచ్చు, ట్రంప్ ఉద్యోగాల్లోంచి తొలగించిన నల్లజాతి మహిళలైనా, కనీస అవసరాలు తీర్చుకునేందుకు అల్లాడుతున్న తోడులేని తల్లి అయినా.. మీ సమస్య ఇప్పుడు మా సమస్య కూడా. ఇకపై ఇది ఇస్లామోఫోబియాను రాజకీయ ఆయుధంగా వాడుకునేవారి ప్రాంతం కాదు. పది లక్షలకుపైగా ముస్లింలు ఉన్న ఈ ప్రాంతం పాలనలోనూ వారికి చోటు ఉందని తెలుసుకుంటారు. అధ్యక్షుడు ట్రంప్ శ్రద్ధగా వినండి. మీరు మాలో ఎవరినైనా ఏమైనా చేయాలి అంటే.. ముందు మా అందరినీ దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది" అని జోహ్రాన్ మమ్దానీ పేర్కొన్నారు. స్థానికులతోపాటు దేశ విదేశాల నుంచి వచ్చిన వలసదారులకు ధన్యవాదాలు తెలిపారు.

టిబెట్ తల్లి.. పంజాబీ తండ్రి..



ఆఫ్తాబ్ కర్మసింగ్ పురేవాల్ కూడా చిన్న వయసులో తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వచ్చినవారే. ఆయన తల్లి చైనా ఆక్రమణ సమయంలో టిబెట్ నుంచి భారత్‌కు శరణార్థిగా వచ్చారు. భారత్‌లోనే చదువుకున్నారు. పంజాబీ వ్యక్తి పురేవాల్‌ను వివాహం చేసుకున్నారు. కర్మసింగ్ జన్మించిన తర్వా త కొన్నేళ్లకు ఆ కుటుంబం అమెరికాలోని ఓహియోకు వెళ్లి స్థిరపడింది. అమెరికాలో తమ కుమారుడి జీవితం ఉజ్వలంగా ఉండాలన్న ఆకాంక్షతో ఆఫ్తాబ్ అని పేరుపెట్టారు. పర్షియన్‌లో ఆ పదానికి 'సూర్య కాంతి' అని అర్థం. పొలిటికల్ సైన్స్, న్యాయశాస్త్రం చదివిన ఆఫ్తాబ్ పురేవాల్.. 2021లోనే సిన్సినాటి పట్టణ మేయర్‌గా ఎన్నికయ్యారు. తాజాగా రిపబ్లికన్ అభ్యర్థి కోరీ బోమాన్‌పై విజయం సాధించారు.

లోకం తీరు



హైదరాబాద్ పుట్టి అమెరికాలో చరిత్ర సృష్టించి..

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికైన గజాలా ఫిర్దౌస్ హష్మి హైదరాబాద్‌లో జన్మించారు. నాలుగేళ్ల పాటు మలక్‌పేటలోని అమ్మమ్మ, తాత వద్ద పెరిగారు. తర్వాత కుటుంబంతో పాటు అమెరికాకు వెళ్లారు. ఆమె తాత రాష్ట్ర ఫైనాన్స్ శాఖలో పనిచేసేవారు. తండ్రి జియా హష్మీ అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి పీహెచ్‌డీ కోసం అమెరికాలో వెళ్లి సౌత్ కరోలినా యూనివర్సిటీలో చేరారు. పూర్తయ్యాక అక్కడే అధ్యాపకుడిగా చేరారు. జార్జియా సదరన్ యూనివర్సిటీ డైరెక్టర్ పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. తల్లి తన్వీర్ హష్మి ఉస్మానియా యూనివర్సిటీ విమెన్స్ కాలేజీ (నేటి కోఠి మహిళా యూనివర్సిటీ)లో డబుల్ డిగ్రీ చదివారు. గజాలా హష్మి అమెరికాలోని జార్జియా సదరన్ వర్సిటీలో బీఏ హానర్స్, అమెరికా సాహిత్యంపై పీహెచ్‌డీ చేశారు. రిచ్‌మండ్ యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా పనిచేశారు. ప్రస్తుతం గజాలా ఫిర్దౌస్ హష్మి వయసు 61 ఏళ్లు.

ప్రఖ్యాత దర్శకురాలు మీరా నాయర్ కుమారుడే..

న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ తల్లి ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్. 1957లో ఒడిసాలో అమృత్‌లాల్ నాయర్ (ఐఏఎస్), ప్రవీణ్ నాయర్ దంపతులకు జన్మించారు. పాఠశాల విద్య ఇక్కడే చదివిన ఆమె.. అమెరికాలోని హార్వర్డ్ వర్సిటీలో స్కాలర్‌షిప్ సాధించి 'విజువల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. 1977లో ఫొటోగ్రాఫర్ మిచ్ ఎప్‌స్టెన్‌తో వివాహమైనా, కొన్నాళ్లకే విడాకులు తీసుకున్నారు. తర్వాత భారత్‌లో జన్మించి ఉగాండాలో స్థిరపడిన మహ్మద్ మమ్దానీని పెళ్లి చేసుకున్నారు. వారికి 1991లో జోహ్రాన్ పుట్టారు. మీరా నాయర్ తొలి చిత్రం 'సలామ్ బాంబే' 1988లో విడుదలైంది. వీధి బాలల జీవితాన్ని హృద్యంగా ఆవిష్కరించిన ఆ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అయింది కూడా. ఆ తర్వాత 1991లో ఇండో అమెరికన్ అమ్మాయి, ఆఫ్రికన్ అబ్బాయి ప్రేమకథతో 'మిస్సిస్సిప్పీ మసాలా' చిత్రం తీశారు. 2001లో ఆమె రూ పొందించిన 'మాన్‌సూన్ వెడ్డింగ్' చిత్రం అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు, అవార్డులు దక్కించుకుంది. మమ్దానీ న్యూయార్క్ మేయర్ అయ్యారని తెలియగానే హాలీవుడ్, బాలీవుడ్ సినీ ప్రముఖుల నుంచి ఆమెకు అభినందనలు వెల్లువెత్తాయి.

'మిథిలాంచల్' సవాల్!

» 7 జిల్లాల్లో 40 అసెంబ్లీ స్థానాలు

» గత ఎన్నికల్లో 26 చోట్ల గెలిచిన ఎన్డీఏ

» 7 చోట్ల బరిలోకి దిగిన ఎంఐఎం

పట్నా, నవంబరు 5: బిహార్ ఎన్నికల్లో 'మిథిలాంచల్' ప్రాంతం అటు పాలక ఎన్డీఏకి, ఇటు ప్రతిపక్ష 'మహాగఠ్‌బంధన్'కు, ప్రశాంత్ కిశోర్ సారథ్యంలోని జన్ సురాజ్ పార్టీకి కీలకంగా మారింది. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతంలో ఏడు జిల్లాల్లో 40 అసెంబ్లీ స్థానాలున్నాయి. గత ఐదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం దీని అభివృద్ధిపై దృష్టి సారించింది. మధుబని కళకు ప్రాచుర్యం కల్పించింది. మఖానా పంటకు మిథిలాంచల్ పేరొందడంతో మద్దతు ధర పెంచింది. ఏకంగా మఖానా బోర్డునే ఏర్పాటుచేసింది. 2020 ఎన్నికల్లో ఇక్కడున్న 40 స్థానాలకు గాను ఎన్డీఏ 26 చోట్ల గెలిచింది. ఇందులో బీజేపీ వాటా 18 సీట్లు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఈప్రాంతంలోని ఏడు లోక్‌సభ స్థానాల్లోనూ ఎన్డీఏనే గెలుచుకుంది. అయితే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ సారథ్యంలోని మహాగఠ్‌బంధన్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. జన్‌సురాజ్ పార్టీ, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం కూడా బరిలో దిగడంతో రాజకీయ వేడి పెరిగింది. 2020 ఎన్నికల్లో ముస్లిం జనాభా ఉన్న సీమాంచల్‌లో ఎంఐఎం ఏకంగా ఐదు చోట్ల గెలిచింది. మొత్తంగా కనీసం 16 చోట్ల ఆర్జేడీ, జేడీయూ విజయావకాశాలను దెబ్బతీసింది. దీనివల్ల మహాగఠ్‌బంధన్ అధికారానికి అడుగు దూరాన ఉండిపోయింది. మిథిలాంచల్‌లో మైథిలి బ్రాహ్మణులు, యాదవులు, మత్స్యకారులు సహా అత్యంత వెనుకబడిన కులాలు(ఈబీసీ), దళితులు, ముస్లింలు కీల క సామాజిక వర్గాలు. ముస్లింలు దర్భంగా జిల్లాలో 22%, మధుబని జిల్లాలో 18.25% చొప్పున ఉన్నారు. ఈ వర్గం ఓట్లను సంఘటితం చేసి తన వైపు తిప్పుకోవాలని ఒవైసీ కొద్దినెలలుగా తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నారు. ఆజాద్ సమాజ్ పార్టీ, అప్నా జనతా పార్టీలతో జట్టుకట్టి గ్రాండ్ డెమోక్రాటిక్ అలయెన్స్ (జీడీఏ)ను ఏర్పాటుచేశారు. ఎంఐఎం మిథిలాంచల్‌లో ఏడు చోట్ల పోటీచేస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చి.. బీజేపీని గెలిపించేందుకే ఒవైసీ అభ్యర్థులను నిలిపారని ఆర్జేడీ, కాంగ్రెస్ ఆరోపిస్తు న్నాయి.. దీనిని ఒవైసీ తోసిపుచ్చారు. ప్రజలకు మూడో ప్రత్యామ్నాయం అవసరమని స్పష్టంచేశారు.

- సెంట్రల్ డెస్క్.

హరియాణాలోనూ ఓట్ చోరీ

(మొదటి పేజీ తరువాయి)

ఆ హైడ్రోజన్ బాంబును ఆయన.. బిహార్‌లో ఎన్నికలకు ఒక్కరోజు ముందు.. బుధవారం ఇక్కడ 'ద హెచ్ ఫైల్స్' పేరిట నిర్వహించిన మీడియా సమావేశంలో పేల్చారు. గత ఏడాది జరిగిన హరియాణా శాసనసభ ఎన్నికల్లో 25 లక్షల నకిలీ ఓట్లతో బీజేపీ గెలిచిందని.. ఆ ఎన్నికను చోరీ చేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. హరియాణాలో కాంగ్రెస్‌కు దక్కాల్సిన ఘనవిజయాన్ని ఓటమిగా మార్చడం కోసం చేపట్టిన 'ఆపరేషన్ సర్కార్ చోరీ'కి.. ఈసీ కూడా సహకరించిందని.. ప్రధాని మోదీ, అమిత్‌షాలతో, బీజేపీతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. హరియాణా ఓటరు జాబితాలో 25,41,144 మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. 5,21,619 డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని.. 93,174 మంది ఓటర్ల చిరునామాలు తప్పుగా ఉన్నాయని.. 1,24,177 నకిలీ ఫొటోలు ఓటర్ ఐడీల్లో ఉన్నాయని పేర్కొన్నారు. "హరియాణాలో ఓటర్ల సంఖ్య 2 కోట్లు. 25 లక్షల నకిలీ ఓట్లంటే.. ప్రతి 8 మంది ఓటర్లలో ఒకరు నకిలీ ఓటరు. మొత్తం ఓటర్ల సంఖ్యలో 12.5 శాతం" అని ఆయన ధ్వజమెత్తారు. ఆ రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన వెంటనే.. "ఏదో తేడా జరిగింది" అని చాలా మంది కాంగ్రెస్ అభ్యర్థులు తనతో అన్నారని పేర్కొన్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ఎగ్జిట్ పోల్స్ చెప్పినప్పటికీ.. చివరికి బీజేపీ గెలిచిందని గుర్తుచేశారు. బీజేపీ ఆ ఎన్నికల్లో ఓట్లచోరీకి పాల్పడిందనడానికి నిదర్శనంగా.. "ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. బీజేపీ గెలవబోతోంది" అంటూ బీజేపీ నేత, హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ చేసిన వ్యాఖ్యల వీడియోను రాహుల్ ప్రదర్శించారు. "అందరూ కాంగ్రెస్ గెలుస్తుందంటున్న సమయం అది. కానీ ఈ పెద్ద మనిషి (నాయబ్‌సింగ్ సైనీ) మాత్రం గెలుపుపై నమ్మకంతో ఉన్నారు. బీజేపీ ఏర్పాట్లు చేసిందని నవ్వుతూ చెప్పారు" అని మండిపడ్డారు. పోస్టల్ ఓటింగ్ ఫలితాలు అసలు ఫలితాలకు భిన్నంగా ఉండడం హరియాణా చరిత్రలోనే తొలిసారి అని పేర్కొన్నారు. 100శాతం రుజువులతో తాను ఈ ఆరోపణలు చేస్తున్నానని.. కాంగ్రెస్ దక్కాల్సిన ఘన విజయాన్ని నష్టంగా మార్చడానికి ఒక ప్రణాళికను అమలు చేశారని దుయ్యబట్టారు. 8 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అత్యంత స్వల్ప తేడాతో ఓడిపోయిందని.. ఒకచోట 32ఓట్ల తేడాతో పరాజయంపాలైందని.. కేవలం 22,779 ఓట్ల తేడాతో మొత్తంగా హరియాణా ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

ఇంతకీ ఎవరా మోడల్?

మీడియా సమావేశంలో రాహుల్ ప్రస్తావించిన బ్రెజిలియన్ మోడల్ ఎవరా అని చాలా మంది ఆరా తీశారు. రాహుల్ చూపిన ఫొటోలో 'మాథ్యూస్ ఫెర్రెరో' అనే పేరు ఉండడంతో.. ఆ పేరుతో గూగుల్‌లో శోధించగా ఆయన ఒక ఫొటోగ్రాఫర్ అని తేలింది. ఆయన పోర్ట్‌ఫోలియోలో ఈ మోడల్ ఫొటో కూడా ఉందిగానీ.. ఆమె పేరు మాత్రం లేదు.

ఒకే మహిళ.. పేర్లు వేరే..

రాహుల్ తన ఆరోపణలకు ఆధారంగా.. రాయ్ అసెంబ్లీ నియోజకవర్గం ఓటరు జాబితాలో ఒకే మహిళ ఫొటోతో ఉన్న 22 ఎంట్రీలను చూపించారు. "ఇది బ్రెజిల్‌కు చెందిన ఒక మోడల్ ఫొటో. ఏదో వెబ్‌సైట్ నుంచి ఈ ఫొటోను ఉచితంగా డౌన్‌లోడ్ చేసి ఉంటారు. ఓటరు జాబితాలో ఈ ఫొటో స్వీటీ, సీమ, సరస్వతి, రష్మి, విమల.. ఇలా వేర్వేరు పేర్లతో 22సార్లు కనిపించింది" అని రాహుల్ మండిపడ్డారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 పోలింగ్ బూత్‌ల్లో ఆ మహిళ ఓటు వేసిందని, ఆమె ఓట్లు వేసిన స్థానాల్లో తమ పార్టీ ఓడిపోయిందన్నారు. అలాగే.. ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకే మహిళ ఫొటోతో 100 ఓటర్ కార్డులు ఉన్న విషయాన్నీ రాహుల్ ప్రజల దృష్టికి తెచ్చారు. "ఈ మహిళ.. కావాలంటే హరియాణాలో 100సార్లు ఓటు వేయొచ్చు. బీజేపీవాళ్లు ఇతర రాష్ట్రాల నుంచి సైతం వచ్చి ఓటు వేసే అవకాశం కల్పించడానికే ఇలా చేశారు. మరో మహిళ ఫొటో రెండు పోలింగ్ బూత్‌ల పరిధిలో ఏకంగా 223సార్లు కనిపించింది"అని రాహుల్ పేర్కొన్నారు. హోడల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌కు చెందిన ఇంట్లో 66మంది ఓటర్లున్నారని, అదే నియోజకవర్గంలో ఒక ఇంట్లో 501 మందికి ఓటు హక్కు ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన అనేక మందికి హరియాణాలోనూ ఓటు హక్కు ఉందని తెలిపారు. ఇళ్లులేని వాళ్లకు ఇంటి నంబరుగా జీరోను కేటాయిస్తామని దేశ ప్రజలకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అబద్ధాలు చెబుతున్నారని, ఆ ఇళ్ల పేరుతో ఏం జరుగుతోందో ఇప్పుడు అందరికీ తెలిసిపోయిందన్నారు. "డూప్లికేట్ ఓట్లను ఎన్నికల కమిషన్ ఒక్క సెకనులో తీసేయగలదు. కానీ వాళ్లు అలా ఎందుకు చేయట్లేదు? కారణం.. వారు బీజేపీకి సహాయం చేస్తున్నారు"అని రాహుల్ అన్నారు. ఎన్నికలకు ముందు 3.5 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కాగా హరియాణా ఎన్నికల్లో తమ పార్టీ అక్రమాలకు పాల్పడిందంటూ రాహుల్ చేసిన ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ ఎలాంటి ఆధారాలూ లేని తప్పుడు ఆరోపణలని కొట్టిపారేసింది. రాహుల్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, దేశ ప్రజాస్వామ్యాన్ని అపఖ్యాతిపాలు చేయడానికి ఎన్నికల కమిషన్‌పై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని కేంద్రమంత్రి కిరెన్ రిజిజు మండిపడ్డారు.

బిహార్‌లో ఎన్డీఏదే విజయం

మూడు సర్వేల్లో వెల్లడి

పట్నా, నవంబరు 5: బిహార్లో ఓటర్ల నాడిని తెలుసుకోవడానికి ప్రయత్నించిన మూడు సంస్థలు, తొలిదశ పోలింగ్ ప్రారంభానికి కొద్ది గంటల ముందు తమ సర్వే వివరాలను ప్రకటించాయి. ఐఏఎన్ఎస్-మ్యాట్రిజ్, పోల్‌స్ట్రాట్, చాణక్య ఈ మూడు సంస్థలు దాదుపు ఒకే రకమైన అంచనాలను వెల్లడించాయి. వీటి ప్రకారం.. బిహార్‌లో మళ్లీ ఎన్డీఏ కూటమే అధికారంలోకి రాబోతోంది. ఆర్జేడీ-కాంగ్రెస్‌లతో కూడిన మహాగఠ్‌బంధన్ ఆశలు గల్లంతయ్యే సూచనలు ఉన్నాయి. కాగా, బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి.

సర్వే సంస్థ	ఎన్డీఏ సీట్లు	మహాగఠ్‌బంధన్	ఇతరులు
ఐఏఎన్ఎస్-మ్యాట్రిజ్	153-164	76-87	2-9
పోల్‌స్ట్రాట్	133-143	93-102	2-6
చాణక్య	128-134	102-108	5-9

బిహార్లో తొలి విడత పోలింగ్ నేడే

పట్నా, నవంబరు 5: బిహార్ శాసనసభ ఎన్నికల్లో గురువారం మొదటి దశ పోలింగ్ జరుగనుంది. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను 121 సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్డీఏ, ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్‌సురాజ్ పార్టీ సహా వివిధ పార్టీల నుంచి 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వి (రాఘోపూర్), బీజేపీకి చెందిన ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధురి (తారాపూర్), విజయకుమార్ సిన్హా (లఖీసరాయ్), మంత్రులు మంగళ్ పాండే (శివన్), నితిన్ నవీన్ (బంకీపూర్), సంజయ్‌సరోగి (దర్భంగా), జీవేశ్‌కుమార్ (జాలే), కేదార్‌ప్రసాద్ గుప్తా (కుర్హని), జేడీయూ మంత్రులు శ్రావణ్‌కుమార్ (నలంద), విజయకుమార్ చౌదరి (సరాయ్‌రంజన్), మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ పెద్దకుమారుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్‌ప్రతాప్ యాదవ్ (మహువా) తదితరుల భవితవ్యాన్ని 3.7 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్నారు. రాఘోపూర్‌లో గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని తేజస్వి భావిస్తున్నారు. ఆయనపై బీజేపీకి చెందిన సతీశ్‌కుమార్ పోటీచేస్తున్నారు. ఈయన 2010 ఎన్నికల్లో తేజస్వి తల్లి, మాజీ సీఎం రాబ్రీదేవిని ఓడించారు. ఇక్కడి నుంచే బరిలోకి దిగుతానని ప్రశాంత్ కిశోర్ గతంలో ప్రకటించారు. అయితే రాష్ట్రమంతా ప్రచారం చేయాల్సి ఉన్నందున ఎన్నికల్లో పోటీచేయకూడదని ఆయన నిర్ణయించుకున్నారు. చంచల్ సింగ్ అనే నేతకు ఇక్కడ టికెట్ ఇచ్చారు. యువ జానపద గాయని మైథిలి ఠాకూర్ బీజేపీ తరఫున అలీగంజ్ నుంచి.. భోజ్‌పురీ సూపర్‌స్టార్లు ఖేసరిలాల్ యాదవ్ (ఛాప్రా-ఆర్జేడీ), రితేశ్ పాండే (కార్గాహర్-జన్‌సురాజ్) కూడా బరిలో ఉన్నారు. జనసురాజ్ కార్యకర్త హత్య కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న అనంత్‌సింగ్ (జేడీయూ) మొకామా నుంచి పోటీచేస్తున్నారు. ఆయనపై మరో గ్యాంగ్‌స్టర్ సూరజ్‌భాన్ భార్య వీణాదేవి ఆర్జేడీ తరఫున బరిలో ఉన్నారు. తొలి విడతలో 45,341 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 36,733 ఉన్నాయి. ఈ 121 స్థానాల్లో జనాభా 6.60 కోట్ల మంది కాగా.. ఓటర్లు 3.75 కోట్ల మంది. వీరిలో కొత్త ఓటర్లు 10.72 లక్షల మంది అని ఈసీ వెల్లడించింది. 18-19 ఏళ్ల వయసున్న ఓటర్లు 7.38 లక్షల మంది. రాష్ట్రంలో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నికలివే.



తొలి దశ ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- కుషాయిగూడ ట్రాఫిక్ పీఎస్ ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం


సింగిరెడ్డి మీన్‌రెడ్డి

మల్కాజిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులకు చిక్కిన ఓ ఆటో డ్రైవర్ పోలీస్‌స్టేషన్ ఎదుటే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని గాంధీ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం రాత్రి జరిగింది. జవహర్‌నగర్ జమ్మిగడ్డ ప్రాంతానికి చెందిన సింగిరెడ్డి మీన్‌రెడ్డి(32) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జవహర్‌నగర్‌కు చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తి వద్ద ఆటోను అద్దెకు తీసుకున్నాడు. మీన్‌రెడ్డి మంగళవారం రాత్రి ఆటోలో వస్తుండగా కాప్రా పరిధిలోని ఓ స్కూల్ వద్ద రాత్రి 10.30 గంటల ప్రాంతంలో కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్నారు. అటుగా వస్తున్న మీన్‌రెడ్డి ఆటోను ఆపి డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేయగా మద్యం తాగినట్లు తేలడంతో ఆటోను ట్రాఫిక్ పీఎస్‌కు తీసుకెళ్లారు. మీన్‌రెడ్డి మద్యం తాగి ఉండటంతో అతని తరఫున ఎవరినైనా తీసుకుని వస్తే వారికి ఆటో ఇస్తామని పోలీసులు తెలిపారు. మీన్‌రెడ్డి తన యజమానికి విషయం చెప్పగా నాలుగు రోజుల నుంచి ఆటో అద్దె డబ్బులు ఇవ్వకపోగా ఆటోను పోలీస్‌స్టేషన్‌కు పట్టుకెళ్లడంపై గట్టిగా ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో కొద్దిసేపటికే మళ్లీ కుషాయిగూడ ట్రాఫిక్ పీఎస్‌కు వచ్చిన మీన్‌రెడ్డి తన వెంటతెచ్చుకున్న పెట్రోల్‌ను మీదపోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు ట్రాఫిక్ పోలీసులకు తెలుపగా వారు మల్కాజిగిరి పోలీసులకు సమాచారమిచ్చారు. తీవ్రంగా గాయపడ్డ మీన్‌రెడ్డిని చికిత్స నిమిత్తం గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం అతను మరణించినట్లు తెలిపారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

- నలుగురు నారాయణ ఖేడ్ వాసుల దుర్మరణం


దైవ దర్శనం అనంతరం తీసుకున్న ఫొటో

నారాయణఖేడ్/బెంగళూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ వాసులు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. బీదర్ జిల్లా హలికేడు సమీపంలోని కాదర్‌పూర్ వద్ద బుధవారం ఉదయం కారు, బొలెరో వ్యాన్ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. సంగారెడ్డి జిల్లాకు చెందిన బిరాదర్ రాచప్ప(45), కాశీనాథ్(60), నవీన్(30), బిరాదర్ ప్రతాప్(32), నాగరాజు(40)లు కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగళవారం గానుగాపూర్ దత్తాత్రేయస్వామి దర్శనానికి వెళ్లి.. అనంతరం తిరుగు ప్రయాణం అయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న బొలేరో బలంగా ఢీ కొట్టడంతో.. రాచప్ప, నవీన్, నాగరాజు అక్కడికక్కడే మృతి చెందగా, కాశీనాథ్ బీదర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. బొలేరో వాహనం డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద విషయం తెలియగానే నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి.. బీదర్ ఎమ్మెల్యే, ఆ రాష్ట్ర మంత్రి రహీక్‌ఖాన్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. శవ పరీక్ష అనంతరం మృతదేహాలను బీదర్ పోలీసులు వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. బుధవారం సాయంత్రం వారి అంత్యక్రియలు పూర్తయ్యాయి. జిల్లాలో రోడ్డు ప్రమాద బాధితుల రోదనలు మిన్నంటాయి. స్వస్థలాలకు చేరుకున్న తమ వారి మృతదేహాలను చూసుకుని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రభుత్వ ముఖ్య సలహాదారుడిగా సుదర్శన్‌రెడ్డి బాధ్యతలు

శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

- పథకాల అమలుతీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తాం
- అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం
- బాధ్యతల స్వీకరణ వేళ సుదర్శన్‌రెడ్డి వెల్లడి


రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పి. సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడిగా బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు వేదపండితుల ఆశీర్వచనం అనంతరం ఫైలుపై సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారుడు కె. కేశవరావు, మహ్మద్ షబ్బీర్ అలీ, ఖమ్మం ఎంపీ ఆర్. రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్, వెడ్మ బొజ్జు, కె. వెంకటరమణారెడ్డి, కె. మదన్‌మోహన్‌రావు, పైడి రాకేష్‌రెడ్డి, కె. జయవీర్‌రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, సుంకెట అన్వేష్‌రెడ్డి, ఈరవత్రి అనిల్ కుమార్, గుత్తా అమిత్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కె. జానారెడ్డి, కొండపల్లి దయాసాగర్, మునిపల్లి సాయిరెడ్డి, అరికెల నర్సారెడ్డి, నరాల రత్నాకర్, ఏబీ శ్రీనివాస్, సూదిని పద్మారెడ్డి, ఆకుల లలిత, కాటిపల్లి నగేష్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా నేతలతో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సుదర్శన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

సుమారు రెండేళ్ల ప్రజాపాలనలో ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు పి. సుదర్శన్‌రెడ్డి చెప్పారు. సెక్రటేరియట్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 18 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించామని, రెండేళ్లలో 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి రూ.7 వేల కోట్లు చెల్లించిందన్నారు. మహాలక్ష్మి పథకంలో పేద కుటుంబాలకు రూ. 500 చొప్పున గ్యాస్‌సిలిండర్ పంపిణీ చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ పథకంలో ఉచిత వైద్యం పరిమితిని రూ. 10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకంలో ప్రతి నెల 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే కుటుంబాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఇండ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. రైతుల సంక్షేమానికి రెండేళ్లలో రూ. 1.13 లక్షల కోట్ల నిధులు ఖర్చుచేశామని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలుతీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తామని, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యమని సుదర్శన్‌రెడ్డి చెప్పారు.

సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టుల మృతి?

వాజేడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవులు తుపాకుల మోతతో దద్దరిల్లాయి. అన్నారం- మరిమళ్ల అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో బుధవారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డీఆర్‌జీ బలగాలు అడవులకు ఇరువైపులా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాల్పులు జరిగాయి. ఈ నేపథ్యంలో డీఆర్‌జీ బలగాలకు ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఆయుధాలు కూడా లభ్యమైనట్లు తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌ను ఛత్తీస్‌గఢ్ పోలీసులు ధ్రువీకరించలేదు. కానీ ఛత్తీస్‌గఢ్‌లోని మద్దేడు ఏరియా మావోయిస్టు కమిటీకి చెందిన సభ్యులు మృతి చెందినట్లు తెలుస్తోంది.

భూపాలపల్లి జిల్లాలో సుడిగాలుల బీభత్సం!

- వందల సంఖ్యలో నేలకొరిగిన చెట్లు
- 30 ఎకరాల్లో పంటలకు నష్టం
- లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో ఘటన


బండ్లవాగు సమీపంలో నేలకొరిగిన చెట్లు

మహదేవపూర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భారీ సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో వందల సంఖ్యలో చెట్లు నేలకూలగా.. దాదాపు 30 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పలిమెల మండలంలోని లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మొబైల్ టవర్ ఎత్తులో ఓ భారీ సుడిగాలి సంభవించి గోదావరి వైపు నుంచి మహాముత్తారం వైపు అడవుల్లోకి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. లెంకలగడ్డ శివారు గోదావరి నదీ ప్రాంతంలో ప్రారంభమైన సుడిగాలి బండలవాగు వెంబడి పత్తి, మిర్చి, వరి పంటల మీదుగా మహాముత్తారం వైపు వీచిందన్నారు. దీంతో వందల సంఖ్యలో చెట్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. పలువురు రైతులకు చెందిన పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. కూలీలంతా ఇంటికి వెళ్లే సమయంలో ఈ ఘటన సంభవించగా.. లెంకలగడ్డ వద్ద చేలల్లో సుమారు 10 మంది కూలీలు సుడిగాలి తాకిడికి ఇబ్బంది పడినట్లు తెలిసింది. అయితే వారెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీనిపై పలిమెల రేంజ్ అధికారిని సంప్రదించగా.. పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. కాగా, గతేడాది ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లోనూ ఇదే రకమైన పెద్ద విపత్తు చోటుచేసుకొని వందల ఎకరాల్లో వేలాది చెట్లు నేలకూలిన సంగతి తెలిసిందే.

పత్తిని అమ్ముకునేదెలా?

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలే కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాలు, మబ్బు పట్టిన వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ పరంగా ఉన్న నిబంధనలతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. పత్తి అమ్మకాల్లో పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన 'కపాస్ కిసాన్ యాప్'తో ఇబ్బందులు తప్పడం లేదు. మూడుసార్లకన్నా ఎక్కువగా స్లాట్లు బుక్ చేస్తే వివరాలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఈసారి 33 లక్షల క్వింటాళ్ల మేర పత్తి మార్కెట్‌కు వస్తుందని తొలుత అంచనా వేశారు. వర్షాల కారణంగా దిగుబడులు బాగా తగ్గిపోవడంతో 6 నుంచి 8 క్వింటాళ్ల మేర మాత్రమే వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. సీసీఐ నిబంధనల ప్రకారం.. తేమ 8 నుంచి 12లోపు ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. సాధారణంగా నవంబరు, డిసెంబరు నెలల్లో పత్తిలో తేమ 15 నుంచి 30శాతం వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఎనిమిది శాతంకన్నా ఎక్కువ తేమ ఉంటే.. ఎక్కువగా ఉన్న ప్రతి శాతానికి రూ.81 మేర కోత విధిస్తున్నారు. 12శాతానికి మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఫలితంగా తేమశాతం ఎక్కువగా ఉన్న రైతులు పంటను తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సీసీఐ 412 మంది రైతుల నుంచి 7,961 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసింది. ఇందులో క్వింటా పత్తికి సర్కారు నిర్ణయించిన మద్దతు ధర రూ.8,110 దక్కింది కేవలం 52 మంది రైతులకే! పైగా కొనుగోళ్లపైనా పరిమితులు విధించడం రైతులకు ప్రతిబంధకంగా మారింది. గత ఏడాది ఎకరానికి గరిష్ఠంగా 12 క్వింటాళ్ల వరకు పత్తిని కొనుగోలు చేస్తే, ఈసారి 7 క్వింటాళ్ల వరకే కొంటున్నారు. ఇక సీసీఐ కఠిన నిబంధనలకు జిన్నింగ్ మిల్లర్లూ ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధనలు ఎత్తివేయాలని కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్న రాష్ట్ర కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ గురువారం నుంచి కొనుగోళ్లను నిలిపివేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 322 మిల్లులకు సీసీఐ జాబ్ వర్క్ అలాట్‌మెంట్ చేస్తామని చెప్పి కొన్ని మిల్లులకు మాత్రమే చేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయని అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అసోసియేషన్ ప్రతినిధులతో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో కొనుగోళ్ల బంద్‌ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కొనుగోళ్లు యథాతథంగా సాగుతాయని చెప్పారు.

జిన్నింగ్ మిల్లుల యజమానులకూ సమస్యలే

ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధనలతో సంబంధం లేకుండా జిన్నింగ్ మిల్లులన్నింటికీ సమానంగా పత్తిని సరఫరా చేయాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులు ఉండగా సీసీఐ నిబంధనలతో ఇప్పటి వరకు 6 జిన్నింగ్ మిల్లులకే పత్తిని సరఫరా చేశారు. మిగతా జిన్నింగ్ మిల్లులకు క్వింటా పత్తి కూడా చేరలేదు. కొనుగోళ్ల పరంగా విధించిన నిబంధనల పరంగా పత్తి రాకపోవడంతో విద్యుత్తు బిల్లులు, కార్మికుల వేతనాల రూపంలో తమకు నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని.. కొనుగోళ్ల పరంగా తమకు అవకాశం వచ్చే సరికి సీజన్ ముగిసిపోతే నిండా మునుగుతామని మిగతా జిన్నింగ్ మిల్లుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనేవారు లేక 20 క్వింటాళ్ల పత్తి ఇంట్లోనే



ఈ రైతుపేరు ఆడే బన్సిలాల్. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం పట్‌పడి గ్రామం. ఈ రైతు ఏడెకరాల్లో పత్తి సాగు చేశాడు. ఇప్పటి వరకు 20 క్వింటాళ్లకు పైగా పంట దిగుబడి చేతికొచ్చింది. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకపోవడంతో అమ్ముకునేందుకు అవకాశమే లేకుండా పోయింది. ఇంట్లో పంటను నిల్వ చేసుకోవడానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్నాడు. కూలీలకు డబ్బులు చెల్లించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక కొంత పంటను దళారులకు అమ్ముకున్నాడు. సీసీఐ కొనుగోళ్లపై విధించిన పరిమితి, తేమ, ఇతర కారణాలతో మరింత ఆందోళనకు గురవుతున్నాడు.

వరంగల్‌లో తడిసిన పత్తి కొనుగోలు

మంత్రి తుమ్మలకు విచారణ నివేదిక అందజేత

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఇటీవల వర్షం కారణంగా పత్తి సంచులు తడిసిన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి సూచనలతో రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మార్కెట్‌లో విచారణ నిర్వహించారు. లక్ష్మీబాయి ఆ నివేదికను బుధవారం మంత్రి తుమ్మలకు అందజేశారు. దాని ఆధారంగా.. ఆ రోజు 59 బస్తాలు మాత్రమే వర్షం కారణంగా తడిసినట్లు అధికారులు గుర్తించారు. తడిసిన పత్తిని మార్కెట్ సిబ్బంది తక్షణమే ఆరబెట్టారు. అదే రోజున కొనుగోలు ప్రక్రియ పూర్తిచేశారు.

ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయండి

- స్థానిక ప్రజల మనోగతాన్ని గుర్తించాలి
- కేంద్రం, ఇరు రాష్ట్రాల సీఎంలకు మంత్రి తుమ్మల లేఖ

భద్రాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు అక్కడి ప్రభుత్వం చర్యలు చేపడుతున్న క్రమంలో తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లోని భద్రాచలాన్ని ఆనుకుని ఉన్న ఐదు పంచాయతీల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. యటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తమపట్నం, గుండాల గ్రామాలను ఏపీలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో మినహాయించాలని అభ్యర్థిస్తూ.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. తమ గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని స్థానిక ప్రజలు దశాబ్ద కాలంగా వినతిపత్రాలు అందిస్తూ, శాంతియుత నిరసనలు చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భద్రాద్రి రామాలయం తెలంగాణలో ఉంటే.. రామయ్య భూములు ఆంధ్రాలోని పురుషోత్తమపట్నంలో ఉన్నాయని, దీంతో పాలనాపరంగా సమస్యలు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. భద్రాచలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వ స్థలం లేకపోవడం కూడా ఇబ్బందిగా మారిందన్నారు. సమాఖ్యవాద స్ఫూర్తితో ప్రజల దీర్ఘకాల అభ్యర్థనను కేంద్రం, ఏపీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని తుమ్మల లేఖలో కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


కాంతిరేఖ.. మమ్దానీ

బాలీవుడ్ దర్శకురాలు మీరా నాయర్ (నయ్యర్) పుత్రరత్నం న్యూయార్క్ మహానగరం మేయర్ అయ్యాడు. ముప్పైనాలుగేళ్ళ జోహ్రాన్ క్వామే మమ్దానీ నూటముప్పైయేళ్ళలో ఆ మహానగరం తొలిపౌరుడిగా ఎన్నికైన పిన్నవయస్కుడే కాదు, తొలి ముస్లిం, దక్షిణాసియామూలాలున్న తొలివ్యక్తి కూడా. మమ్దానీ తన విజయోత్సవ ప్రసంగంలో మార్పు మొదలైందని గర్జించాడు. తదనుగుణంగా జవాహర్‌లాల్ నెహ్రూ చరిత్రాత్మక 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' నుంచి కొన్ని వాక్యాలను ఉటంకించాడు. రెండు చేతులా నమస్కరిస్తూ వేదికమీదకు చీరకట్టులో వచ్చిన పంజాబీ తల్లినీ, గుజరాతీ మూలాలున్న తండ్రినీ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నాడు. పాత వదిలి కొత్తలోకి అడుగుపెడుతున్న ఈ ఘట్టాన్ని ట్రంప్ వింటున్నారు, కంటున్నారంటూ హెచ్చరికలు చేసిన మమ్దానీ, తన విజయదుందుభి ట్రంప్ చెవుల్లో మారుమోగాలని కాబోలు, బాలీవుడ్ గీతం 'ధూమ్ మచాలే'ని ఈ వేడుకకు నేపథ్యగీతం చేశాడు. మిగతా ప్రపంచాన్ని పలు రకాలుగా బెదిరిస్తూ, వీరంగాలు వేస్తున్న డోనాల్డ్ ట్రంప్‌కు జోహ్రాన్ మమ్దానీ విజయం నైతికంగా పెద్ద ఎదురుదెబ్బ, రాజకీయంగా ఘాటైన హెచ్చరిక.

ట్రంప్ రెండోరాకడ తరువాత జరిగిన ఈ అతిపెద్ద ఎన్నికల ఫలితాలు డెమొక్రాట్లకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చాయి. న్యూయార్క్‌ను మమ్దానీ గెలుచుకోవడంతో పాటు, న్యూజెర్సీ, వర్జీనియా గవర్నర్లుగా డెమొక్రటిక్ పార్టీకి చెందినవారే గెలవడం విశేషం. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా హైదరాబాద్‌లో జన్మించిన గజాలా హష్మీ చక్కని మెజారిటీతో ఎన్నికైనారు. భారతీయ సంతతికి చెందిన అఫ్తాబ్ పూరేవాల్ అమెరికా ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ సోదరుడిని ఓడించి, సిన్సినాటి మేయర్‌గా మారోమారు విజయం సాధించడం విశేషమైన పరిణామం. ట్రంప్ పార్టీ, ఆయన బృందం, మతవాదులూ మితవాదులు కలసికట్టుగా ముస్లిం వ్యతిరేకతను ఎంతగా రేపినప్పటికీ మమ్దానీ, హష్మీల విజయం ఓటర్ల రాజకీయ పరిణతికీ, మతసహనానికీ నిదర్శనం. మమ్దానీకి యూదులు అత్యధికంగా ఓటుచేశారన్న విశ్లేషణలు మరింత ఆశ్చర్యం కలిగిస్తాయి. గాజా ఊచకోతలను ఘాటుగా విమర్శిస్తూ, నెతాన్యాహూను చీల్చిచెండాడడంలో మమ్దానీ ఎన్నడూ ఏ మాత్రం తగ్గలేదు. యూదువ్యతిరేకిగా మమ్దానీని ఎంతగా చిత్రీకరించినా, అతడికి ఓటుచేయడంలో యూదులు ముందంజలో ఉన్నందుకు ట్రంప్ ఇప్పుడు వారిని తిట్టిపోస్తున్నారు. ఆఫ్రో అమెరికన్లు, ఆసియన్లు సహా ఇతర శ్వేతజాతేతరుల ఓట్లు మమ్దానీకి అధికంగా పడతాయన్నది ఊహించిందే.

డెమొక్రాటిక్ పార్టీ తరఫున నగర మేయర్ అభ్యర్థిత్వానికి పోటీపడిన పదకొండుమందిని వెనక్కునెట్టి జూన్ 24న మమ్దానీ ఎన్నికకావడం మిగతా ప్రపంచాన్ని ఆకర్షించింది, ట్రంప్‌ను భయపెట్టింది. అతని విజయం ఖాయమని అర్థం అవుతున్నకొద్దీ ట్రంప్ దాడిహెచ్చింది, దూకుడు పెరిగింది. ఓటర్లకు మమ్దానీ మత, సైద్ధాంతిక మూలాలను ట్రంప్ పదేపదే గుర్తుచేస్తూ, ఈ కమ్యూనిస్టు ఏలుబడిలో నగరం నాశనమైపోతుందని హెచ్చరించారు. వెయ్యేళ్ళ విఫలకమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలోకితెచ్చి ఆర్థికంగా, సామాజికంగా నగరాన్ని భ్రష్టుపట్టిస్తాడన్నారు. మమ్దానీని ఎన్నుకుంటే నిధులివ్వకుండా నగరాన్ని నిలువునా మాడ్చేస్తానని కూడా పౌరులను ట్రంప్ బెదిరించారు. డెమొక్రాట్ బెర్నీ శాండర్స్ బాటలో తనను సోషలిస్టుగా ప్రకటించుకున్న మమ్దానీ కనుక గెలిస్తే తమ పెట్టుబడిదారీ సమాజం మీద ఆ ప్రభావం అధికంగా ఉంటుందని ట్రంప్ భయం. పునాదిలోనే దానిని చిదిమేయడానికి తన పార్టీని ఈ ఎన్నికల్లో పోటీచేయనివ్వకుండా, డెమొక్రాటిక్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆండ్రూ కుమోకు మద్దతు ప్రకటించారు. కమ్యూనిస్టు కంటే ఒక చెత్త డెమొక్రాట్ ఉత్తమమంటూ తన ఓటర్లను సైతం అటు మళ్ళించాడు. డెమొక్రాటిక్ పార్టీ ప్రస్తుత మేయర్ ఎరిక్ ఆడమ్స్ కూడా కుమోకు మద్దతు ఇచ్చారు. ఇలా రెండుపార్టీలనుంచీ మమ్దానీని బలహీనపరిచే ప్రయత్నాలు బలంగా సాగాయి. మతఛాందసులు, పార్టీలకు అతీతంగా ఒక్కటైన పెట్టుబడిదారులు, ఆయన మతాన్నే కాదు, ఆహారపు అలవాట్లను సైతం ఎగతాళి చేస్తూ విషం చిమ్మిన ట్రంప్ అనుకూల మీడియా ఎంత ప్రయత్నించినా, సామాన్యులు, కార్మికులు మమ్దానీ పక్షాన నిలిచి గెలిపించారు. డెమొక్రాటిక్ పార్టీ భవిష్యత్తును నిర్ణయించేది దాని నాయకత్వం కాదు, కార్మికవర్గమేనని బెర్నీశాండర్స్ మరోమారు గుర్తుచేస్తున్నారు. తన విజయాన్ని కారు చీకటిలో కాంతిరేఖగా మమ్దానీ అభివర్ణించడం సముచితం. రెండుపార్టీల మధ్యా పెద్ద తేడాలేకుండా ఘనీభవించిపోయిన అమెరికాలో సామాన్యుల సంక్షేమానికీ, శ్రేయస్సుకూ హామీపడుతున్న ఎజెండాతో కొత్త రాజకీయానికి మమ్దానీ తెరదీశారని అనేకుల ఆశ. ఇస్లామోఫోబియా హెచ్చుతూ, వలసదారులను తరిమేస్తున్న రాజ్యంలో ఒక ముస్లిం, అదీ వలసదారుల సంతానం విజయం సాధించినందుకు సంతోషించవలసిందే.

బిహార్ ఓటర్లు కోరుతున్న మార్పు ఏమిటి?



'బద్లావ్ తో హోనా ఛాహియే' (ఒక మార్పు రావాలి) అని తనను తాను 'నాయీ'గా స్వయంగా చెప్పుకున్న ఒక పెద్ద మనిషి అన్నాడు. ఆ వ్యాఖ్యకు ప్రతిస్పందనగా కర్పూరీ ఠాకూర్ గురించి నేను ప్రస్తావించాను. ఆయన ముఖంలో ఆనందరేఖలు విరిశాయి. అయితే తాను, తన కుటుంబంలోని 20 మంది ఓటర్లు ఓటు వేసేందుకు ప్రేరణ అయ్యే మార్పు ఏమిటో ఆయన విడమరిచి చెప్పలేదు. 'అబ్ ఆప్ సమ్ఝ జాయియే' (మీరు మీ అభిప్రాయానికి రావచ్చు) అని ఆయన నిష్కర్షగా అన్నాడు.

మార్పు ఏమిటి? ప్రభుత్వం మారడం, పాలనా వ్యవస్థలో మార్పు సంభవించడమే మార్పు అని నేను విశ్వసిస్తున్నాను. బిహార్‌కే కాదు, దేశానికీ ఇటువంటి మార్పు అత్యవసరమని, జరూరుగా జరగాలని భావిస్తున్నాను. అయితే బిహార్ ఓటర్లు ఆకాంక్షిస్తున్న మార్పు బహు విధాలుగా ఉండడంతో పాటు అస్పష్టంగా ఉన్నది. ఉత్తర బిహార్‌లో పక్షం రోజుల పర్యటనతో ఈ వాస్తవం నాకు తెలిసివచ్చింది. మార్పు బహుళత్వం, అస్పష్టత గురించి నా పర్యటనానుభవాలు నన్ను జాగరూకుడిని చేశాయి. సాధారణ ఓటర్ల (అత్యధికులు పురుషులే)తో మాటా మంతీ ద్వారా బిహారీలు బహుళ మార్పులు కోరుతున్నారని, అవి ఒక దానితో ఒకటి పోటీ పడడమే కాకుండా ఘర్షణ పడుతున్నాయని కూడా నాకు విశదమయింది. అనేక పరివర్తనలను సాధించవలసిన బృహత్తర బాధ్యతను సున్నిత ప్రజాస్వామిక సాధనమైన ఓటు నిర్వహిస్తోంది. ఆ పరివర్తనలను సంపూర్ణంగా సాధించడంలో ఇప్పటికే చాలా జాప్యం చోటుచేసుకున్నది.



■ యోగేంద్ర యాదవ్

మొదటి మార్పు సామాజిక న్యాయం. అగ్ర కులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాధించవలసిన సామాజిక విప్లవం. బిహార్ జనాభాలో 11 శాతం కంటే తక్కువగా ఉన్న అగ్ర కులాలవారు సమాజం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలపై సంపూర్ణ పెత్తనం చెలాయిస్తున్నారు. పేదలు, నిరుపేదలను సంఘటితపరచడం ద్వారా కుల వ్యవస్థ వెన్ను విరచడాన్ని లక్ష్యంగా చేసుకున్న మండల్ ఉద్యమానికి లాలూప్రసాద్ యాదవ్ నాయకత్వం వహించారు. అయితే ముఖ్యమంత్రి పదవిని ఆయన రెండు పర్యాయాలు నిర్వహించిన తరువాత ఆ సామాజిక విప్లవం నిలిచిపోయింది. పరిపాలన పట్ల అశ్రద్ధ, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఉదాసీనత, అధికారాన్ని ఒక కులం చుట్టూ కేంద్రీకృతం చేసి, కుటుంబ పాలన చేయడంతో లాలూ మూడో పర్యాయం పదవీ కాలం ముగించేనాటికి ప్రభుత్వం మారితీరవలసిన అనివార్యత ఏర్పడింది. సామాజికంగా వెనుకబడిన కులాల, ఆర్థికంగా వెనుకబడిన కులాల, మహా దళితుల మద్దతుతో అగ్ర కులాల ఆధిపత్యం మళ్లీ రాజ్యాధికారాన్ని సాధించుకున్నది. క్రింది స్థాయి సామాజిక శ్రేణులలో ఐక్యత యాదవ్- ముస్లిం సంకీర్ణంగా సంకోచించింది (ఇటీవలి కుల గణన ప్రకారం బిహార్ జనాభాలో యాదవులు 14.2శాతం కాగా ముస్లింలు 17.7శాతంగా ఉన్నారు). అగ్ర కులాల/ వెనుకబడిన కులాల విభజన మధ్యలో నితీశ్ కుమార్ నిలబడ్డారు. తద్వారా బిహార్ రాజకీయాలలో ఒక కీలక నాయకుడుగా ఆయన ప్రభవించారు. సామాజిక విప్లవం తిరోగమనానికి ఆయన తోడ్పడ్డారు!

ప్రస్తుత ఎన్నికలలో ప్రతిపక్ష కూటమి మహాఘట్‌బంధన్ తన సామాజిక సంకీర్ణాన్ని ముస్లిం-యాదవ్ సమీకరణ పరిధి నుంచి విస్తృతం చేసేందుకు ప్రయత్నించింది. మల్లాహ్ కులస్తులకు (బిహార్ జనాభాలో 2.6శాతం) ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖేశ్ సహాని నాయకత్వంలోని వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీని; చౌరాసియా, బరాయీ, తంబోలి సామాజిక వర్గాలకు (బిహార్ జనాభాలో 1.7శాతం) ప్రాతినిధ్యం వహిస్తున్న ఐపీ గుప్తా నేతృత్వంలోని ఇండియన్ ఇన్‌క్లూజివ్ పార్టీ (ఐఐపీ)కి మహాఘట్‌బంధన్‌లో స్థానం కల్పించారు. బిహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా రవిదాసి వర్గానికి (బిహార్ జనాభాలో 5.6 శాతం) చెందిన నాయకుడిని నియమించడం ద్వారా కోల్పోయిన దళిత్ ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముస్లిం ఓటర్లను సంఘటితపరచడం ద్వారా లబ్ధి పొందేందుకు కూడా ప్రతిపక్ష కూటమి ప్రయత్నిస్తోంది. అయితే ఈ ప్రయత్నాల ద్వారా గత లోక్‌సభ ఎన్నికలలో ఎన్డీఏకు లభించిన 8శాతం ఓట్ల ఆధిక్యాన్ని తగ్గించటం లేదా స్వాయత్తం చేసుకోవటంలో మహాఘట్‌బంధన్ సఫలమవుతుందా అనేది వేచి చూడాలి.

> బిహార్ ఓటర్లు ఆకాంక్షిస్తున్న మార్పు బహు విధాలుగా ఉండడంతో పాటు అస్పష్టంగా ఉన్నది. సాధారణ ఓటర్లతో మాటా మంతీ ద్వారా బిహారీలు బహుళ మార్పులు కోరుతున్నారని, అవి ఒక దానితో ఒకటి పోటీ పడడమే కాకుండా ఘర్షణపడుతున్నాయని కూడా నాకు విశదమయింది.

ఇక నిలిచిపోయిన రెండో పరివర్తన సుశాసన్ (సుపరిపాలన). అభివృద్ధి సాధనలో నాణ్యమైన ఫలితాలను సాధించవలసిన అవసరం మరే రాష్ట్రంలో కంటే బిహార్‌లోనే అత్యధికంగా ఉన్నది. నితీశ్‌కుమార్ మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సుపరిపాలనకు శ్రీకారం చుట్టారు. పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్విఘ్నంగా అమలుపరిచారు. రహదారుల నాణ్యతలో గణనీయమైన మెరుగుదలను సాధించారు. అయితే ఆ సుపరిపాలనా వెలుగులు ఎంతో కాలం నిలవలేదు. మసకబారిపోయాయి. ప్రజల మద్దతును నిలుపుకునేందుకు నితీశ్ ప్రభుత్వం అనేక గిమ్మిక్‌లు చేసింది. ప్రజల మద్దతును నిలబెట్టుకోగలిగింది గానీ సుపరిపాలనను కొనసాగించడంలో విఫలమయింది. నితీశ్ ప్రభుత్వం పదిహేను సంవత్సరాల క్రితం మంచిరోడ్లను నిర్మించిన విషయాన్ని బిహారీలు ఇప్పటికీ గుర్తు చేసుకొంటున్నారు. నితీశ్ రాక ముందు అన్నీ గతుకుల రోడ్లే కదా అని ఒక వృద్ధుడు వ్యాఖ్యానించాడు. నితీశ్ ప్రభుత్వం మద్యపానాన్ని నిషేధించింది. అయితే దీనికి ప్రజల మద్దతు సంపూర్ణంగా లభించలేదు. కల్తీ మద్యం విక్రయాలు పెరిగిపోయాయి. ఆ కల్తీ మద్యంతో సంభవిస్తున్న మరణాల సంఖ్య పెరిగిపోతూనే ఉన్నది. దీనికి తోడు మాదకద్రవ్యాల బెడద పెచ్చరిల్లింది.

లాలూప్రసాద్ యాదవ్ పాలన 'జంగిల్‌రాజ్' అన్న అపప్రథ నితీశ్ పాలన కొనసాగేందుకు ఊతమిస్తోంది. అయితే ఆ జంగిల్‌రాజ్ అన్న నింద పాక్షికంగా మాత్రమే సత్యం. ఇంకా ఓటుహక్కుకు అర్హుడుకాని యువకుడు ఒకరు తాను పుట్టక ముందు ఉన్న పరిస్థితులను గుర్తు చేసుకుంటూ చీకటిపడిన తరువాత ఎవరూ బయటకు వెళ్లే పరిస్థితి ఉండేదికాదట అని అన్నాడు. ఇటీవలికాలంలో పట్టపగలే అనేక నేరాలు, ఘోరాలు జరుగుతున్నా ఆ జంగిల్‌రాజ్ అన్న అపప్రథ ప్రభావం కొనసాగుతూనే ఉన్నది. ఉద్యోగాల సృష్టి, ఉపాధి కల్పన విషయమై పలు హామీలు ఇవ్వడం ద్వారా ఓటర్ల మద్దతును సాధించుకునేందుకు మహాఘట్ బంధన్ ప్రయత్నిస్తోంది. ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన స్వల్పకాలంలో అనేక మందికి ప్రభుత్వ ఉద్యోగాలనిచ్చిన మంచి పేరు తేజస్వి యాదవ్‌కు ఉన్నది. ఇది తమకు ఈ ఎన్నికలలో తప్పక మేలు చేస్తుందని ప్రతిపక్ష కూటమి విశ్వసిస్తోంది. అయితే కొత్తగా రంగప్రవేశం చేసిన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సూరజ్ విద్య, వైద్యం మొదలైన అభివృద్ధి అంశాలపై ముమ్మర ప్రచారం చేస్తోంది. ప్రశాంత్ కిశోర్ గ్రామ గ్రామాన పర్యటించారు. ఆయన ప్రసంగాలు అన్ని వర్గాల వారినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రజల పిచ్చాపాటీలో ఆయన వ్యాఖ్యలు పదే పదే ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే ఈ ప్రభావశీలత ఎంతవరకు ఓట్లుగా పరిణమిస్తుందో వేచి చూడాలి. మహిళా ఓటర్ల మద్దతును పొందేందుకు నితీశ్ ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో మహిళకు పదివేలరూపాయలు సంక్షేమ కానుకగా అందించింది. తాము అధికారంలోకి వస్తే వచ్చే సంక్రాంతినాటికి ఒక్కో మహిళకు రూ.30 వేలు ఇస్తామని తేజస్వి పదే పదే ప్రకటిస్తున్నాడు.

అంతిమంగా బిహార్ ఎన్నికలు కొన్ని బృహత్తర బాధ్యతల నిర్వహణ భారాన్ని వహిస్తున్నాయి. ఆ కర్తవ్యపాలనలు: భారత రాజ్యాంగ పరిరక్షణ, 2024 లోక్‌సభ ఎన్నికలు నిర్దేశించిన ప్రజాస్వామిక పాలన పునరుద్ధరణ దిశగా పరివర్తన మొదలైనవి. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆ బాధ్యతల నిర్వహణకు దిగ్భ్రాంతికరంగా అంతరాయం కలిగించాయి. ఇప్పుడు ఆ బాధ్యతల నిర్వహణ కొనసాగింపును బిహార్ ఓటర్ల తీర్పు ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. ఆ దృష్ట్యా బిహార్ ఎన్నికల ప్రచారం అనివార్యంగా ఎన్నికల నైతికతను కాపాడేందుకు లేదా 'ఓట్ చోరీ'ని నిరోధించేందుకే పరిమితమయింది. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ సైతం ఈ ఎన్నికల పోరులో ఒక రాజకీయ అస్త్రం కాలేదు. అయినప్పటికీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల సామర్థ్యం ముగిసిన ఆ సవరణ ప్రక్రియకు ఉన్నది. ప్రత్యేక సమగ్ర సవరణతో బిహార్ ఓటర్ల జాబితా 47 లక్షల మేరకు తగ్గిపోయింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రతి ఒక్క నియోజకవర్గం (మొత్తం సంఖ్య 243)లోను దాదాపు 20 వేలమంది ఓటర్లు తగ్గిపోయారు. ఓటర్ జాబితాలలో చోటుచేసుకోని వారిలో నాలుగింట మూడు వంతుల మంది తొలగింపు న్యాయబద్ధమైన చర్యే అని అనుకున్నా ప్రతి నియోజకవర్గంలోను ఇంచుమించు 5000 ఓట్లు మినహాయింపునకు గురయ్యాయనే వాస్తవాన్ని గుర్తించాలి. ఇది, డజన్ల కొద్దీ నియోజకవర్గాలలో ఎన్నికల ఫలితాన్ని నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. పల్లీల విక్రేత అయిన ఒక వృద్ధ ఓటర్ నిర్లిప్తంగా కనిపించాడు. ఓటర్ల జాబితాలో ఆ వృద్ధుడి పేరు ఉన్నదిగానీ ఆయన భార్య పేరు లేదు! ఆమె పేరు ఎందుకు తొలగించారో ఆయనకు తెలియదు. 'క్యా ఫారక్ పడ్తా హై హమేస్?' అని వ్యాఖ్యానించాడు. ఆ వృద్ధుడి గళంలో ఉదాసీనత ధ్వనించింది. అయితే వెన్వెంటనే ఆయన ముఖ వైఖరి మారిపోయింది. 'లేకిన్ ఏక్ ఓట్ సే జీత్ హార్ మే బాదల్ శక్తి హై' (ఓటమి, నష్టం మధ్య తేడాను ఒక ఓటు నిర్ణయిస్తుంది). ఆ వృద్ధ ఓటర్ ఉదాసీనత, దృఢ నిశ్చయం మధ్య సంభావ్య మార్పు దోబూచులాడడం లేదూ?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

> పావనమూర్తి తన అసమాన కార్యాచరణతో మూడుతరాల నాయకులను, మేధావులను కార్యకర్తలను, రచయితలను ప్రభావితం చేశాడు. ఫాసిజం విస్తరిస్తున్న ఈనాటి సంక్లిష్ట సందర్భంలో పావనమూర్తి చాటిచెప్పిన అంబేడ్కర్ ఆశయాలను, తథాగతుని తత్త్వాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజాసమూహాల్లో విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఉంది.

భీమైక జీవనస్ఫూర్తి!

ఒక మహావృక్షం ఒరిగిపోతూ విత్తనాల గింజల్ని వాగ్దానం చేసినట్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనంతమైన 'భీమ' ఎరుకను కలిగించి, సామాజిక ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన చింతకాయల పావనమూర్తి సెలవంటూ వెళ్లిపోయాడు. మూర్తీభవించిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఆశయంలా, బుద్ధుని ధమ్మపథ సూత్రంలా నడయాడిన పావనమూర్తి మాష్టారు (93) అక్టోబర్ 27 ఉదయం విశాఖపట్నంలో పరినిర్వాణం చెందాడు. తొలితరం అంబేడ్కరిస్టుగా, దళిత ఉద్యమయోధుడిగా, ప్రజాస్వామ్యవాదిగా, మేధావిగా పావనమూర్తి చెరగని ముద్రవేశాడు.

చింతకాయల పావనమూర్తి 1932 మార్చి 28న ఫ్రెంచ్ ప్రభుత్వ ఏలుబడిలో ఉన్న యానాం పెదమాలపల్లి (అంబేడ్కర్ నగర్)లో జన్మించాడు. యానాం, తాళ్ళరేవు పాఠశాలల్లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. కాకినాడ పి.ఆర్ కళాశాలలో ఇంటర్, విశాఖపట్నం ఏవీయన్ కళాశాలలో డిగ్రీ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ చదివాడు. యానాంలో సెంట్రల్ బాయ్స్ స్కూల్‌లో ఒక సంవత్సరం ఆంగ్ల ఉపాధ్యాయుడిగా, ఏవీయన్ కళాశాలలో అధ్యాపకుడిగా, రైల్వే మెయిల్ సర్వీస్‌లో ఉద్యోగిగా కొంతకాలం సేవలు అందించాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగా సుదీర్ఘకాలం పాఠాలు బోధించి వందలాది మంది శిష్యుల భవితకు బాటలు వేసి 1995లో పదవీ విరమణ చేశాడు.



దీన పోషక సమాజం, బ్రహ్మ సమాజం, కోనసీమ ప్రాంతంలోని ఆది ఆంధ్ర ఉద్యమ కార్యక్రమాల వెలుగుల్లో పావనమూర్తి బాల్యం చిగురించింది. ఫ్రెంచ్ పాలనలో ఉన్న యానాం ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి దడాల రమణయ్య నేతృత్వంలో జరిగిన పోరాటంలో పావనమూర్తి క్రియాశీలకంగా పాల్గొన్నాడు. రైల్వే మెయిల్ సర్వీస్ మద్రాస్‌లో తన సహోద్యోగి యెండ్లూరి చిన్నయ్యతో కలిసి ఉద్యోగులను సంఘటితపరిచాడు. భారతదేశంలో అంబేడ్కర్ సాగించే సాంఘిక, రాజకీయ పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకొని ఆ బాటలో మడమ తిప్పకుండా పయనించాడు.

అంటరానితనం కారణంగా అంత పెద్ద విశాఖపట్నంలో ఒక చిన్న అద్దె ఇల్లు దొరక్కపోవడంతో పావనమూర్తి హృదయంలో వేదనా తుఫాన్ రగిలింది. సమాజంలో సమస్త అధిపత్యాలకు అంకురార్పణ చేసిన మనుస్మృతిని జగదాంబ సెంటర్ సాక్షిగా దహనం చేసి, వైజాగ్ గుండెల్లో సమానత్వ భావాలను పండించాడు. ఉపకులాల వర్గాల నడుమ ఉన్న వైషమ్యాలను తొలగించటానికి వారందరికీ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి, వారి మధ్య సయోధ్య కుదర్చడానికి బృహత్తర ప్రయత్నం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రాన్ని బోధిస్తూనే మరోవైపు కులనిర్మూలనా చైతన్యాన్ని ప్రబోధించాడు. ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షునిగా, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ కార్యదర్శిగా, భారతీయ బౌద్ధమహాసభ జిల్లా కార్యదర్శిగా, 'భీమ్‌దళ్' అధినేతగా పావనమూర్తి కృషి అనితర సాధ్యమైనది. అణగారిన దళిత ఉన్నతోద్యోగుల కార్యాచరణ ఏ విధంగా ఉండాలని అంబేడ్కర్ అభిలషించాడో, ఆ విధమైన కార్యాచరణతో తన జీవనశైలిని పావనమూర్తి తీర్చిదిద్దుకున్నాడు. అంబేడ్కర్‌ను శ్వాసగా, ధ్యాసగా తలచి ఆయన ప్రతిపాదించిన నవయాన బౌద్ధాన్ని స్వీకరించి తదనుగుణమైన నిబద్ధతతో జీవించాడు. పావనమూర్తిది ముక్కుసూటి వ్యక్తిత్వం, రాజీపడని తత్త్వం. పార్లమెంటు సభ్యునిగా, శాసనసభ్యునిగా పోటీ చేయాలని వివిధ రాజకీయ పార్టీలు కోరినా తిరస్కరించాడు. ఆత్మగౌరవానికి భంగం కలిగితే పెద్ద పదవినైనా వదులుకోవడానికి ఆయన వెనుకాడలేదు. భావజాలపరమైన పాలనాగతమైన అభిప్రాయభేదంతో హైదరాబాద్‌లోని అంబేడ్కర్ కళాశాల ప్రిన్సిపాల్ పదవికి సైతం రాజీనామా చేశాడు. పావనమూర్తి తన అసమాన కార్యాచరణతో మూడుతరాల నాయకులను, మేధావులను కార్యకర్తలను, రచయితలను ప్రభావితం చేశాడు. ఫాసిజం విస్తరిస్తున్న ఈనాటి సంక్లిష్ట సందర్భంలో పావనమూర్తి చాటిచెప్పిన అంబేడ్కర్ ఆశయాలను, తథాగతుని తత్త్వాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజాసమూహాల్లో విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఉంది.

• కోయి కోటేశ్వరరావు

జెండర్ స్టడీస్ విద్యార్థులను అర్హులుగా గుర్తించాలి

తెలంగాణలో గతంలో కాకతీయ యూనివర్సిటీ, ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలు 'ఎంఏ జెండర్ స్టడీస్' కోర్సును నాణ్యతతో బోధిస్తున్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ప్రస్తుతం ఉద్యోగ రహితులుగా ఉన్నారు. కారణం ఆయా నియామకాలలో ఈ కోర్సు పేరు లేకపోవడమే. ఈ విద్యార్థులందరూ ప్రభుత్వ ప్రాజెక్టులు, మహిళా కమిషన్‌లు, ఉమెన్ సేఫ్టీ వింగ్‌లలో పనిచేసే అవకాశం కోరుతున్నారు. ఇది కేవలం ఉద్యోగ రహిత సమస్య మాత్రమే కాదు; ఇది విద్యా సమానత్వానికి విరుద్ధమైన అంశం. ప్రభుత్వం దీనిని గమనించి ఉమెన్ సేఫ్టీ వింగ్స్, షీ టీమ్స్, 181 ఉమెన్ హెల్ప్‌లైన్ వంటి విభాగాల్లో కౌన్సిలర్ పోస్టులకు జెండర్ స్టడీస్ విద్యార్థులను కూడా అర్హులుగా గుర్తించాలి. పైగా వీరు ఫీల్డ్ ట్రైనింగ్ పొంది, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన అనుభవం ఉన్నవారు. ఇటువంటి వ్యక్తులు బాధితురాళ్లతో మాట్లాడినప్పుడు వారు కేవలం సలహాదార్లుగా కాకుండా, ఒక మానవీయ ఆధారంగా నిలుస్తారు.

ఈ మార్పు కేవలం ఉద్యోగ అవకాశాల పరిమితిలోనే ఉండదు. జెండర్ స్టడీస్ విద్యార్థులు వ్యవస్థలో చేరడం ద్వారా పోలీస్ వ్యవస్థలో జెండర్ సెన్సిటివిటీ పెరుగుతుంది. మహిళా భద్రతా విధానాలు మరింత మానవీయంగా మారతాయి. చట్టపరమైన వ్యవహారాల్లో కూడా సానుభూతి ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత ప్రపంచంలో మహిళా భద్రత అంటే కేవలం రక్షణ చర్యలు మాత్రమే కాదు; అది మానసిక, సామాజిక, భావోద్వేగ స్థిరత్వాన్ని పునరుద్ధరించే ప్రక్రియ. ఈ ప్రక్రియలో జెండర్ స్టడీస్ విద్యార్థులు ముందుండాలి. వారు మహిళా హక్కుల ఉద్యమానికి శాస్త్రీయ దృష్టికోణం తీసుకురాగలరు. కాబట్టి, ప్రభుత్వం ఈ కోర్సు విద్యార్థులను కూడా ఉమెన్ సేఫ్టీ వింగ్ కౌన్సిలర్ పోస్టులకు అర్హులుగా గుర్తించి, ప్రత్యేక నోటిఫికేషన్లు ఇవ్వాలి. ఇది కేవలం విద్యార్థుల భవిష్యత్తు పరిరక్షణ మాత్రమే కాదు, మహిళా భద్రతా వ్యవస్థను మరింత సున్నితమైన, సమర్థవంతమైన, మానవీయ దిశగా నడిపించే ఒక ప్రగతిశీల అడుగు.

– సోరుపాక అనిల్‌కుమార్

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మన జీవన ప్రయాణంలో రోడ్డు, రవాణా అనేవి అత్యంత కీలకమైనవి. రోడ్డు భద్రత అనేది ప్రభుత్వం ఒక్కటే భరించే బాధ్యత కాదు, ప్రతి పౌరుడి వ్యక్తిగత ధర్మం కూడా. మన దేశంలో ప్రతిరోజూ వందలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వేలాది కుటుంబాలు శాశ్వత దుఃఖంలో మునిగిపోతున్నాయి. ఈ ప్రమాదాల వల్ల వ్యక్తిగత నష్టం మాత్రమే జరగడం లేదు. కుటుంబాల ఆర్థిక వెన్నెముకలు తెగిపోతున్నాయి, సామాజిక స్థిరత్వం దెబ్బతింటున్నది, తద్వారా దేశ అభివృద్ధి కుంటుపడుతున్నది. అతివేగం, రెడ్ సిగ్నల్ దాటడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి నిర్లక్ష్యాలు యువకుల జీవితాలను, వారి కుటుంబాలను నాశనం చేస్తున్నాయి. మన జీవితాలు మన బాధ్యత. మనందరి సమష్టి బాధ్యత! తెలంగాణ ప్రభుత్వం రోడ్డు భద్రతను అత్యంత ప్రాధాన్యం గల అంశంగా తీసుకుంటోంది.

"ఆగండి... జీవితం కొనసాగేందుకు!" అన్నది ప్రభుత్వం నినాదం. ఈ నినాదం మాటలకే పరిమితం కాకుండా, రోజువారీ జీవితంలో ఒక అలవాటుగా మారాలి. ప్రతి రోడ్డు ప్రయాణం ఒక సంతోషకరమైన అనుభవంగా మారాలి. మనం సురక్షితంగా ఇంటికి చేరుకుంటే, మన కుటుంబాలు సంతోషంగా ఉంటాయి. సమాజం బలంగా నిలుస్తుంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంలో రవాణాశాఖ రోడ్డు భద్రతను బలోపేతం చేస్తోంది. టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో అత్యాధునిక సాంకేతికతను ప్రవేశపెట్టాం. డ్రైవర్ అలిసిపోయినప్పుడు హెచ్చరించే వ్యవస్థలు, సీసీ కెమెరాలు, జీపీఎస్ ట్రాకింగ్, వేగ నియంత్రణ పరికరాలు.. మొదలైన వాటి ఏర్పాటు ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తోంది. ప్రతి డ్రైవర్‌కు, కండక్టర్‌కు సురక్షిత డ్రైవింగ్, ఫస్ట్ ఎయిడ్, అత్యవసర సహాయంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రమాద సమయంలో తక్షణ చర్యలు సాధ్యం అవుతున్నాయి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, సిగ్నల్ లైట్లు, రోడ్డు సైనేజీ, రంప్‌లు ఏర్పాటు చేస్తున్నాం. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో 'రోడ్డు భద్రతా వారోత్సవాలు' నిర్వహించడం లాంటి అవగాహన కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ప్రజల్లో, ముఖ్యంగా యువతలో భద్రతా భావనను నాటుతున్నాం. ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే 'గోల్డెన్ అవర్ రెస్పాన్స్'లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు, ఫైర్ సర్వీసెస్, ఆరోగ్య శాఖల సమన్వయంతో ప్రాణరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ఇలాంటి అనేక చర్యలు ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయి. కానీ ఇవన్నీ సఫలం కావాలంటే ప్రజల సహకారం అవసరం. ప్రభుత్వ చర్యలు– ప్రజల బాధ్యతలు కలిస్తేనే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. సురక్షిత ప్రయాణాలు సాధ్యమవుతాయి.

> రోడ్డు అనేది మనందరం పంచుకునే స్థలం, అంతేగానీ పోటీ మైదానం కాదు. రోడ్డు మీద 'నాకు మాత్రమే అర్జెంట్ పని ఉంది' అనే ఆలోచనను వదిలేయాలి. క్రమశిక్షణ, సహనం, ఇతరుల భద్రత పట్ల గౌరవం ఇవ్వడం లాంటివే రోడ్డు భద్రతకు మూలస్తంభాలు.



చట్టాలు, సదుపాయాలు ఎన్ని ఉన్నా మనలో బాధ్యత లేకపోతే మార్పు రాదు. ప్రతి వాహనదారుడు రోడ్డు మీద ఉన్న ప్రతి ఒక్కరి ప్రాణానికీ బాధ్యత వహించాలి. తాగి వాహనం నడపడాన్ని మానుకోవాలి. మన ప్రాణాలను కాపాడే హెల్మెట్, సీటుబెల్టులను తప్పనిసరిగా ధరించాలి. తలకు గాయాలవ్వడం వల్లనే 70శాతం మరణాలు జరుగుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. ప్రయాణ సందర్భంలో ఫోన్‌లను ఉపయోగించకండి, వేగాన్ని తగ్గించండి. అతివేగం 60శాతం ప్రమాదాలకు కారణమవుతున్నది. ఒక్క క్షణం ఏమారినా మనకు, మన కుటుంబాలకు శాశ్వత నష్టం జరుగుతుందనే వాస్తవాన్ని గుర్తెరగండి. రోడ్డు మనందరిది– పాదచారులకు, సైకిలిస్టులకు ప్రాధాన్యం ఇవ్వండి. ఓవర్ లోడింగ్ విషయంలోను, రాత్రి ప్రయాణాల సమయంలోను జాగ్రత్తలు తీసుకోండి. ఈ సామాజిక బాధ్యతలు మనలో సానుకూల మార్పును తెస్తాయి. మన సమాజాన్ని మరింత బలంగా, సంతోషంగా నిర్మిస్తాయి. ప్రతి చిన్న అడుగు కూడా ఒక పెద్ద మార్పునకు దారి తీస్తుంది.

రోడ్డు అనేది మనందరం పంచుకునే స్థలం, అంతేగానీ పోటీ మైదానం కాదు. రోడ్డు మీద 'నాకు మాత్రమే అర్జెంట్ పని ఉంది' అనే ఆలోచనను వదిలేయాలి. క్రమశిక్షణ, సహనం, ఇతరుల భద్రత పట్ల గౌరవం ఇవ్వడం లాంటివే రోడ్డు భద్రతకు మూలస్తంభాలు. ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలి. ప్రతి ఆగడం జీవితాన్ని కొనసాగించే మొదటి అడుగు కావాలి. మనమందరం కలిసి నడిస్తేనే సురక్షిత రోడ్డు, రక్షిత ప్రయాణం మన సొంతం! ఈ సంస్కృతి మన రోజువారీ జీవితంలో సానుకూల శక్తిని నింపుతుంది. మన పిల్లలకు మంచి భవిష్యత్తును అందిస్తుంది. సురక్షిత రోడ్డు మన సమాజాన్ని మరింత ఐక్యంగా, సంతోషంగా చేస్తుంది. తెలంగాణ రవాణా శాఖ తరఫున నేను ప్రతి పౌరునికీ ఈ పిలుపునిస్తున్నాను: మనమంతా రోడ్డు భద్రతా రాయబారులుగా మారుదాం!



■ పొన్నం ప్రభాకర్
రాష్ట్ర రవాణాశాఖ మంత్రి

విలీన గ్రామాలకూ సాదాబైనామా వర్తింపజేయాలి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎల్లాపూర్, అల్లీపూర్, నక్కలపల్లి, ధర్మారం సహా 42 పరిసర గ్రామాలను 2015లో నాటి ప్రభుత్వం వరంగల్ కార్పొరేషన్‌లో విలీనం చేసింది. భూమి పాస్‌బుక్‌లు లేని వారికి, సాదాబైనామాల ద్వారా భూ కొనుగోళ్లు చేసినవారికి ధరణి ద్వారా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇస్తామని 2020లో నాటి ప్రభుత్వం తెలిపింది. దీంతో ఈ నలభైరెండు గ్రామాల్లోని వేల మంది రైతులు పట్టాదారు పాస్‌బుక్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని ఈ భూములకు సంబంధించిన విషయమై గతంలో కోర్టు స్టే విధించింది. దాంతో ఈ సాదాబైనామా కింద రైతులు చేసిన దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ప్రస్తుతం కోర్టు స్టే ఎత్తివేసినప్పటికీ 'కార్పొరేషన్ పరిధిలోని రైతుల భూములకు సాదాబైనామా వర్తించదు' అని చెబుతూ ఇప్పుడు కూడా రైతుల దరఖాస్తులను రెవెన్యూ అధికారులు తిరస్కరిస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరంగల్ కార్పొరేషన్‌లో విలీనమైన 42 గ్రామాల్లోని వ్యవసాయ భూములకూ సాదాబైనామా వర్తింపజేయాలని, పట్టాదారు పాస్‌బుక్‌లు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

– బీరం రాములు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



భద్రకాళి ఆలయంలో జ్వాల తోరణాన్ని వెలిగిస్తున్న అర్చకులు

వెల్లివిరిసిన కార్తీక శోభ

నగరంలోని ఆలయాల్లో అభిషేకాలు, దీపోత్సవాలు

- ఇంటింటా ఉసిరి దీపాలు వెలిగించిన మహిళలు
- వేయిస్తంభాల గుడిలో నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం
- రోజంతా గుబాళించిన ఆధ్యాత్మిక సౌరభం

7

వేయిస్తంభాల ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ముఖం చూపిస్తేనే పింఛన్

- నూతన సాంకేతిక విధానం అమల్లోకి తెచ్చిన సర్కారు
- వేలి ముద్రల సమస్యలకు పరిష్కారం
- తొలగనున్న లబ్ధిదారుల కష్టాలు



వరంగల్ కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేయూత పింఛన్లు అందించడంలో ప్రభుత్వం నూతన విధానాన్ని అమలులోకి తెచ్చింది. లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను తొలగించడంతో పాటు అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి చేయూత పింఛన్లను ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నేషన్) ద్వారా అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ విధానం అమలులోకి రావడంతో బోగస్ పింఛన్లకు తెర పడనుంది. దీని కోసం సెర్ప్ అధికారులు కొత్త యాప్ రూపొందించారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, తపాల సిబ్బందికి, పోస్టు మాస్టర్లకు, బిల్ కలెక్టర్లకు యాప్ విధానంపై శిక్షణ ఇచ్చారు. గతంలో బయోమెట్రిక్ విధానం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, గీత కార్మికులు, వితంతు తదితర పింఛన్లు పంపిణీ చేసేవారు. అయితేప కొందరు లబ్ధిదారుల వేలి ముద్రలు సరిగా పడకపోవడంతో ఇబ్బందులు తలెత్తేవి.

యాప్‌లో ఫొటోలు

మునిసిపాలిటీల్లో పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. గ్రామాల్లో తపాలా శాఖ కార్యాలయాల్లో వేలి ముద్రలు తీసుకొని పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇక నుంచి ఫేస్ రికగ్నేషన్ ఆధారిత పింఛన్ల పంపిణీ కోసం రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు డౌన్‌లోడ్ చేయించి వారికి శిక్షణ ఇప్పించారు. లబ్ధిదారుల ఫొటోలను ప్రతీ నెల తీసుకొని ఆధార్‌కార్డులో ఉన్న ఫొటోతో సరిచూస్తారు. అనంతరం యాప్‌లో డౌన్‌లోడ్ చేస్తారు. రెండింటికి పోలికలు కలిస్తేనే పింఛన్ మంజూరు అవుతుంది.

అక్రమాలకు అడ్డుకట్ట..

నూతన విధానంతో బోగస్ పింఛన్ల లెక్క తేలనుంది. వేలి ముద్రలు పడని లబ్ధిదారుల పింఛన్లను పంచాయతీ కార్యదర్శులు డ్రా చేసి అందించేవారు. ఇలాంటి పింఛన్లలో బోగస్ ఉంటే వెంటనే

(మిగతా 6లో..)

పార్కింగ్ కష్టాలకు చెక్

నగరంలో మల్టీ లెవల్ వెహికల్ పార్కింగ్

- హైదరాబాద్ తర్వాత వరంగల్‌లో ఏర్పాటుకు సన్నాహాలు
- భద్రకాళి ఆలయం ఎదుట మూడెకరాల స్థలం గుర్తింపు
- రూ.20కోట్ల నిధులతో 'కుడా' ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ప్రణాళిక
- అధునాతన సాంకేతిక పద్ధతిలో కార్ల పార్కింగ్
- మరి కొద్దిరోజుల్లో టెండర్లకు ఆహ్వానం



వరంగల్ కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వరంగల్ నగరంలో శక్తిపీఠంగా విలసిల్లుతున్న భద్రకాళి అమ్మవారి ఆలయానికి దర్శనం కోసం వచ్చే పర్యాటకులు, స్థానిక భక్తులకు చాలా సందర్భాల్లో వాహనాలకు పార్కింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా పండుగలు, ఉత్సవాల సమయంలో భద్రకాళి ఆలయం నుంచి ఎంజీఎం వరకు ఇటు కాపువాడ వరకు కార్లు, ద్విచక్రవాహనాలు బారులుగా నిలిచి ట్రాఫిక్‌లో చిక్కిన భక్తులు అల్లాడిపోతున్నారు. సమయాభావం ఎక్కువై కొందరు భక్తులు ట్రాఫిక్‌లో కళ్లు తిరిగి పడిపోయిన వారు ఉన్నారు. అంతేకాకుండా అందంగా రూపుదిద్దుకుంటున్న మాఢ వీధులు, కాకతీయ మ్యూజికల్ గార్డెన్, ప్లానిటోరియం, పాలిటెక్నిక్, వేదపాఠశాలతో పాటు పక్కనే ఉన్న భారీ ఫంక్షన్‌హాల్‌కు వచ్చే వారికి ప్రతీ రోజు వాహనాల పార్కింగ్ సమస్య తలనొప్పిగా మారింది. దీంతో వరంగల్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా కొత్త ప్రాజెక్ట్‌ను డిజైన్ చేస్తున్నారు. రూ.20కోట్ల వ్యయంతో మల్టీలెవల్ వెహికిల్ పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అధునాతన సాంకేతిక పద్ధతిలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మరో ఐదు ఫ్లోర్లలో సుమారు 400 నుంచి 600 వరకు కార్లు ఒకేసారి పార్కింగ్ చేసేందుకు వీలుగా గత జూన్ మాసంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు భద్రకాళి దేవాలయం ఎదుట గల మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎంపికచేసి మల్టిలెవల్ వెహికిల్ పార్కింగ్ నిర్మాణానికి

(మిగతా 6లో..)



ఇటీవల స్థలపరిశీలన చేస్తున్న కుడా అధికారులు

మల్టీలెవల్ వెహికిల్ పార్కింగ్ అంటే..?

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేబీఆర్ (కె.బ్రహ్మానంద రెడ్డి పార్క్)తో పాటు నాంపల్లి మెట్రో రైల్వేస్టేషన్‌లలో ప్రస్తుతం అధునాతన మల్టీలెవల్ వెహిహిల్ పార్కింగ్‌లు సక్సెస్‌ఫుల్‌గా నడుస్తున్నాయి. ప్రభుత్వ సహకారంతో నిర్మించి మెయింటనెన్స్ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో పార్కింగ్ ద్వారా ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి. అదే విధంగా వరంగల్ భద్రకాళి దేవాలయం సమీపంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే నగర సౌందర్యంతో పాటు అటు దేవాలయానికి ఇటు ప్రభుత్వానికి ఆర్థిక వనరులు చేకూరుతాయని అధికారులు అభిప్రాయపడ్డారు. అనుకున్నదే తడవుగా ప్రాజెక్టుకు తెరలేపినట్టు తెలిపారు. వరంగల్ ప్రాజెక్టులో కంప్యూటర్ సిస్టం ద్వారా మిషనరీస్ ఆటో సిస్టంతో గేట్ ముందు ఉంచిన వాహనాన్ని తనకు అనుకూలమైన ప్రదేశంలో పార్కింగ్ చేసుకుని ఆన్‌లైన్‌లో ఒక బార్‌కోడ్‌తో కూడిన నెంబర్ జారీ అవుతుంది. ఆ తర్వాత కేటాయించిన నెంబర్‌తో వారికి అప్పగించిన వాహనం ఎప్పుడు కావాలంటే అప్పుడు క్షణాల్లో యజమాని ముందు ప్రత్యక్షం అవుతుంది. అంతేకాకుండా పార్కింగ్ లోపలి భాగంలో గ్రీన్ ల్యాండ్ స్కేప్ జోన్స్, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్, ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ పాయింట్స్, స్మార్ట్ టికెటింగ్ అండ్ డిజిటల్ పేమెంట్ సిస్టమ్, 24 గంటల పాటు సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిస్టమ్, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్, మినీ ఫుడ్ కోర్టు, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ పాయింట్‌తోపాటు 400 నుంచి 600 వరకు వాహనాలు పార్కింగ్ చేసేందుకు వీలుగా ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రాజెక్ట్ డిజైన్ చేశారు. వచ్చే కొత్త సంవత్సరం ఈ పార్కింగ్ పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.

పాలన చేతకాకపోతే మాలో చేరిపోండి..

- ఎమ్మెల్యేలపై ట్రాన్స్‌జెండర్ పుష్పీయ లత విమర్శ



మాట్లాడుతున్న పుష్పీయలత

కరీమాబాద్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ట్రాన్స్‌జెండర్ పుష్పీయలత తీవ్ర విమర్శలు చేశారు. చేతకాని పాలనకు బహుమానంగా చీర గాజులు పంపుతున్నట్లు తెలిపారు. నగరంలోని రామన్నపేటలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. వర్షం కురిసిన ప్రతీసారి నగరం నీట మునగడానికి కారణం ముమ్మాటికీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఇతర ప్రజాప్రతినిధులే కారణమని ఆరోపించారు. వీరంతా నగరంలో కబ్జాలకు తెరలేపి కూర్చున్నారని, కమీషన్లు తీసుకుంటూ కబ్జాలను ప్రోత్సహించడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు. కాగా, అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ట్రాన్స్‌జెండర్ పుష్పీయలత చేసిన వ్యాఖ్యలను ట్రాన్స్‌జెండర్ల సంఘం అధ్యక్షురాలు లైలా ఖండించారు. ట్రాన్స్‌జెండర్‌లకు అధికార పార్టీ నాయకులు అన్ని విధాలా సహకరిస్తున్నారని తెలిపారు.

ఏనుమాముల మార్కెట్ కార్యదర్శిగా మల్లేశం



వరంగల్ వ్యవసాయం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా మల్లేశం నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్లేశం జమ్మికుంట మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండగా ఆయనను ఏనుమాముల మార్కెట్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం నర్సంపేట మార్కెట్ కమిటీ కార్యదర్శి గుగులోతు రెడ్యా గత ఎనిమిది నెలల నుంచి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన 40 రోజులుగా సెలవుపై వెళ్లడంతో మార్కెట్లో గ్రేడ్ 2 కార్యదర్శులే మార్కెట్ వ్యవహారాలు చూస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం మల్లేశంకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించింది.

రూల్స్ పాటిస్తే ఒట్టు!

- రోడ్డు భద్రత నియమాలు పాటించని వాహనదారులు
- జరిమానాలు, జైలుశిక్షలు విధిస్తున్నా మారని తీరు
- పెరుగుతున్న సిగ్నల్ జంపింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
- హెల్మెట్ నిబంధనను ఖాతరు చేయని వారే ఎక్కువ
- నిత్యం తనిఖీలు చేస్తున్నా మారని ప్రవర్తన
- వేలల్లో నమోదవుతున్న కేసులు

నగరంలో యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలు


మట్టెవాడ(వరంగల్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. జరిమానాలు.. జైలుశిక్షలు మమ్మల్ని ఏమీ చేయలేవన్నట్టు బరితెగిస్తున్నారు. పోలీసులు ఎన్ని కేసులు నమోదు చేసినా ఇంకా రోజురోజుకూ పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా వాహనదారుల తీరు మారడం లేదు. ప్రధానంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపడం, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వాటిని అరికట్టడం కోసం జరిమానాలు, జైలుశిక్షలు విధిస్తున్నప్పటికీ వాహనదారులు జంకడం లేదు. ఫలితంగా నిత్యం

(మిగతా 6లో..)



కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసులు..

	2023	2024	2025
డ్రంక్ అండ్ డ్రైవ్	15,380	21,032	15,612
సెల్‌ఫోన్ డ్రైవింగ్	5,715	10,788	8231
డేంజరస్ డ్రైవింగ్	559	2929	2007
సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్	546	1282	676
నెంబర్ ప్లేట్ లేని వాహనాలు	3870	4402	17,846
మైనర్ డ్రైవింగ్	431	342	119
సిగ్నల్ జంపింగ్	20,800	24,253	12,386
ట్రిపుల్ డ్రైవింగ్	12,925	17,166	11,315
లైసెన్స్ లేకుండా డ్రైవింగ్	19,459	22,412	46,534
హెల్మెట్ లేకుండా	4,52,534	5,22,879	6,49,899
రాంగ్ సైడ్ డ్రైవింగ్	21,408	14,885	8925



నిబంధనలు పాటించాలి...

– కె.సుజాత, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ప్రతీ వాహనదారుడు విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలి. ట్రాఫిక్ సిగ్నల్స్, వేగ పరిమితులను, రహదారి సంకేతాలను పాటించాలి. అతివేగం, మద్యం తాగి వాహనం నడుపడం నేరం. వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు కల్గి ఉండాలి. రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన ఉండాలి.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు సర్టిఫికెట్ల పరిశీలన

- రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయిలో కౌన్సెలింగ్
- తొలిరోజు 27 మంది బాలురు హాజరు


కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నూతనంగా ప్రారంభం కానున్న క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో చేరనున్న వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ కార్యక్రమం బుధవారం జేఎన్ఎస్‌లో చేపట్టినట్లు హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల పాటు 40మంది బాలురు, 40మంది బాలికలకు సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ ఉంటుదన్నారు. కాగా, తొలి రోజు 40మంది బాలురకు గాను 27మంది హాజరయ్యారని తెలిపారు. రెండో రోజు గురువారం 40మంది బాలికల తో పాటు తొలి రోజు హాజరుకాలేకపోయిన బాలురకు సైతం కౌన్సెలింగ్ నిర్వహించి, సర్టిఫికెట్లను పరిశీలిస్తామన్నారు. గతంలో హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడాపాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాల కోసం రాష్ట్ర స్థాయిలో ఎంపికలు నిర్వహించగా, ఇక్కడ అత్యుత్తమ ర్యాంకు (మెరిట్) సాధించిన విద్యార్థులకు పాఠశాలలో ఖాళీల ఆధారంగా ప్రవేశాలు కల్పించారన్నారు.

అదే విధంగా రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి, అన్ని అర్హతలు కలిగి హకీంపేట క్రీడా పాఠశాలలో ప్రవేశాలు అందుకోలేకుండా ఉన్న వివిధ జిల్లాలకు చెందిన 40మంది బాలురు, 40మంది బాలికలకు జేఎన్ఎస్‌లో ఈనెల 14లోపు ప్రారంభమయ్యే క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం సర్టిఫికెట్లను పరిశీలన కార్యక్రమం చేపట్టామన్నారు. జేఎన్ఎస్ క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం అర్హత సాధించిన బాలబాలికలకు డీఎస్ఏ నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. కాగా, సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి సాట్ అబ్జర్వర్లుగా ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ రవికుమార్, హాజరయ్యారని అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది, వివిధ జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు.

కాకతీయ కళాపీఠం దశాబ్ది ఉత్సవాలు

- 8 నుంచి వివిధ అంశాల్లో పోటీలు
- 14న బహుమతి ప్రదానోత్సవం
- ఆహ్వాన కమిటీ చైర్మన్ సుందర్‌రాజ్


దశాబ్ది ఉత్సవాల వివరాల పత్రాలను ఆవిష్కరిస్తున్న సుందర్‌రాజ్‌యాదవ్, కాకతీయ కళాపీఠం నాయకులు

న్యూశాయంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ కళాపీఠం (వరంగల్) స్థాపించి 10 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా, బాలల దినోత్సవం నవంబరు 14ను పురస్కరించుకుని కాకతీయ కళాపీఠం ఆర్ట్ అండ్ కల్చరల్ ఎగ్జిబిషన్ సొసైటీ వరంగల్ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మాస్టర్జీ కళాశాలలో బుధవారం దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. హనుమకొండ, కాజీపేట త్రినగరికి సంబంధించి ఈ నెల 8,9 తేదీలలో హనుమకొండ కిషన్‌పురలోని మాస్టర్జీ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు వివిధ సాహిత్య, సాంస్కృతిక అంశాలలో, మ్యాథమెటిక్స్ టాలెంట్, జనరల్ టెస్ట్‌లు, జనరల్ క్విజ్, తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. 8వ తేదీన చిత్రలేఖనం పోటీలు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరిలలో స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 9వ తేదీన జనరల్ గ్రూప్ క్విజ్ పోటీలు, గణిత శాస్త్రం టాలెంట్ టెస్ట్ ఉంటాయన్నారు. అలాగే 10వ తేదీన సుబేదారి వడ్డెపల్లి రోడ్‌లోని కాకతీయ హైస్కూల్‌లో సీబీఎస్ఈ మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్, ఉపన్యాస పోటీ, వ్యాసరచన పోటీలు, 11వ తేదీ మాస్టర్జీ హైస్కూల్‌లో స్పాట్ పెయింటింగ్ చిత్రలేఖన ప్రదర్శన ఉంటాయన్నారు. బహుమతి ప్రదానోత్సవం, ముగింపు కార్యక్రమం 14వ తేదీన ఉంటుందని, మరిన్ని వివరాలకు 95151 93264, 98859 59394 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ కో-చైర్మన్ లయన్ టి. భాస్కర్‌గౌడ్, కాకతీయ కళాపీఠం ఫౌండర్ ప్రెసిడెంట్ ఎ.శ్రీధర్‌రాజు, ఫౌండర్ సెక్రెటరీ టి.చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ కె.సుశీల, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, కల్చరల్ ప్రోగ్రామ్ కన్వీనర్ ఎం.పద్మజాదేవి, కల్చరల్ ప్రోగ్రాం కో-కన్వీనర్ ఎ.పల్లవి సునీల్, స్పాట్ పెయింటింగ్ కన్వీనర్ సాగంటి మంజుల, క్విజ్, ఇతర సాహిత్య కార్యక్రమాల కన్వీనర్ టి. చంద్రశేఖర్, కో-కన్వీనర్లు ఎస్.రాజు, ఎం.రమేష్, ఎ.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ కష్టాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

రూపకల్పన చేశారు. ఇందు కోసం వరంగల్ ప్రజాప్రతినిధులతో పాటుకుడా, జీడబ్ల్యూఎంసీ అధికారులు ప్రాజెక్ట్ డిజైన్ డ్రాఫ్ట్‌పై చర్చలు జరిపారు. అనుమతుల కోసం ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీపెట్టినట్టు తెలిపారు.

స్థల పరిశీలన

ఐదు మాసాల కిందట డిజైన్ చేసిన మల్టిలెవల్ వెహికిల్ పార్క్ స్థల పరిశీలన జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులు పరిశీలించారు. భద్రకాళి ఆలయం ఎదుట ఉన్న 3 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అన్ని ఏర్పాటు చేయొచ్చనే నిర్ణయానికి వచ్చారు. కాకపోతే ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ చేస్తే త్వరగా పూర్తి అవుతుందా? లేక పీపీబీ (పబ్లిక్ అండ్ ప్రైవేట్ ప్రాపర్టీ) సౌజన్యంతో చేస్తే బాగుంటుందా అని అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

సీఎంకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది..

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

శాయంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'పచ్చగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని వల్లకాడు చేస్తూ.. రైతుల పరిస్థితిని అత్యంత దయనీయంగా మార్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని, ప్రభుత్వాన్ని ప్రజలు తప్పకుండా సాగనంపుతారు' అని శాసనమండలి ప్రతిపక్షనేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి హెచ్చరించారు. హనుమకొండ జిల్లా శాయంపేటలో అకాలవర్షాలకు ఇటీవల నేలరాలిన వరి పంటను మధుసూదనాచారి బుధవారం పరిశీలించి, మాట్లాడారు. రాష్ట్రంలో అకాలవర్షాలకు కురిసిన రైతులు పంట నష్టపోతే ఏ ఒక్క ప్రజాప్రతినిధి, అధికారి కన్నెత్తి చూడలేదని, పంటనష్టం లెక్కలన్నీ బోగస్ అని మండిపడ్డారు.అనంతరం మండలకేంద్రానికి చెందిన ఎమ్మీ ఫౌజియాతో పాటు అనారోగ్యంతో బాధపడే పలువురిని పరామర్శించి, వారి బాగోగులు తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గుర్రం రవీందర్, నాయకులు భగ్గి రమేష్, నిమ్మల మహేందర్, పొడిశెట్టి గణేష్, అడప ప్రభాకర్, బేరుగు తరుణ్ గోపి, కొమ్ముల శివ, జాలిగపు అశోక్, మారెపెల్లి సుమన్, మేరగుత్తి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఓపెన్ టూ ఆల్ బాలబాలికల విభాగంలో రెండు రోజులు పాటు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు నగదు పురస్కారంతో పాటు, ప్రశంసాపత్రాలు, వ్యక్తిగత మెడల్స్ ప్రదానం చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా ప్రకటనలో కోరారు.

పరిమిత వేగంతో డ్రైవింగ్ చేయాలి

- భారీ వాహనాలకు దూరంగా ఉండాలి
- డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సురేష్ రెడ్డి
- రోడ్డు భద్రతపై పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీడీటీసీ సురేష్‌రెడ్డి, వినియోగదారుల మండలి ప్రతినిధులు

హనుమకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు పరిమిత వేగంతో డ్రైవింగ్ చేయాలని, మితిమీరిన వేగంతో వాహనం నడపడం వల్ల ప్రమాదాలకు కారణమవుతారని వరంగల్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సురేష్‌రెడ్డి అన్నారు. వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, వినియోగదారుల హక్కులకు సంబంధించిన పోస్టర్‌ను సురేష్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీటు బెల్టుతో డ్రైవింగ్ వల్ల ప్రాణాపాయం తప్పుతుందన్నారు. వాహనాలు కొనుగోలులో కూడా వినియోగదారులు చైతన్యవంతులు కావలసిన అవసరం ఉందన్నారు. ద్విచక్రవాహనదారులు రోడ్లపై భారీ వాహనాలకు వీలైనంత ఎక్కువ దూరంలో డ్రైవింగ్ చేయాలని సూచించారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. ఇటీవలకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోవడం, అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్న నేపథ్యంలో వినియోగదారుల మండలి రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు భద్రతపై చైతన్యకార్యక్రమాలతో పాటు సర్వేను ప్రారంభించిందని అన్నారు. ఇందులో భాగంగా ఈపోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ కమిటీ సెక్రెటరీ జెనరల్ మొగిలిచెర్ల సుదర్శన్, సీసీఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్ కుమార్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఆది శేషు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో 'సిద్ధు గాడి లవ్‌స్టోరీ' చిత్రీకరణ

తండ్రి పాత్రలో నటిస్తున్న సుమన్


షూటింగ్‌లో పాల్గొన్న సుమన్, నటీనటులు

ఐనవోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శివబ్రమేంద్ర క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన నటీనటులతో నిర్మిస్తున్న సినిమా 'సిద్ధు గాడి లవ్ స్టోరీ' షూటింగ్ బుధవారం ఐనవోలు మండలంలో జరిగింది. వారంరోజులుగా రెడ్డిపాలెం, రాంనగర్, నందనం గ్రామాల్లో షూటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సినిమాకు రమేష్ బాబు దర్శకత్వం వహిస్తుండగా నిర్మాతగా సావిత్రమ్మ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో నూతన కథనాయకుడు(హీరో)గా మనోజ్‌ను పరిచయం చేస్తుండగా హీరోయిన్లుగా శృతి, మౌనికలు నటిస్తున్నారు. ఈ సినిమాలో నటుడు సుమన్ హీరో తండ్రిగా నటిస్తున్నారు. బుధవారం రాంనగర్‌లో సుమన్‌పై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఒక సన్నివేశంలో గ్రామస్థులు సైతం శవయాత్రలో పాల్గొనేవిధంగా చిత్రీకరించారు. నటీ నటులు ఆనంద్, చిట్టిబాబు, సాంబశివరావు తదతరులు నందనం సొసైటీ ఫంక్షన్‌హాల్‌లో బసచేసి వారం రోజులుగా గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. సుమన్ షూటింగ్ కోసం రావడంతో యువకులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి షూటింగ్‌ను తిలకించారు. సుమన్ షూటింగ్ పూర్తయ్యాక నందనంలోని సర్దార్ సర్వాయిపాపన్న విగ్రహానికి గౌడ కులస్థులతో కలిసివచ్చి పూలమాలలు సమర్పించారు.

ముఖం చూపిస్తేనే పింఛన్

(5వ పేజీ తరువాయి)

తేలిపోనుంది. లబ్ధిదారులు మృతి చెందితే రెండు మూడు నెలల వరకు పింఛన్లు మంజూరు అవుతున్నాయి. ఫేస్ రికగ్నేషన్‌తో జీవించి ఉన్నవారికే పింఛన్లు అందనున్నాయి.

జిల్లాలో పింఛన్ పొందుతున్న వారు..

జిల్లాలో 1,22,559 మంది పింఛన్‌దారులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీనెల లబ్ధిదారులకు రూ. 29,01,91,360 అందజేస్తోంది. జిల్లాలో వృద్ధులు 46,358 మంది, వితంతువులు 46,376, దివ్యాంగులు 15,319, ఒంటరి మహిళలు 3181, కల్లుగీత కార్మికులు 2817, చేనేత కార్మికులు 2253, డయాలసిస్ రోగులు 216, బోదకాలు బాధితులు 349, బీడీ కార్మికులు 5674 మంది ఉన్నారు.

పకడ్బందీగా అమలు చేస్తాం..

రామిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

పింఛన్‌దారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నూతన విధానాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఫేస్ రికగ్నేషన్‌తో పింఛన్ల పంపిణీ చేస్తాం. వేలిముద్రలు పడని వారు ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్లు పొందవచ్చు.

గేట్ ఎంట్రెన్స్‌కు ఉచిత శిక్షణ

- ఈనెల 17 నుంచి తరగతులు ప్రారంభం
- శిక్షణ కాలం ఎనిమిది వారాలు

హనుమకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో గేట్ ఉచిత కోచింగ్ తరగతులను నిర్వహించనున్నారు. ఈ కోచింగ్ కార్యక్రమం వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులతో పాటు వరంగల్ పరిసర ప్రాంతాల్లోని ఇతర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కూడా అందుబాటులో ఉంటుంది. ఈ తరగతులను అన్ని ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించి నిర్వహిస్తారు. కోర్సు 8వారాల పాటు కొనసాగుతుంది. ఈనెల 17 నుంచి 2026 జనవరి 9వ తేదీ వరకు ఈ ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తారు. ఇంజనీరింగ్ విద్యార్థులు గేట్ పరీక్షకు సమర్థవంతంగా సిద్ధంకావడంలో సహాయపడడమే లక్ష్యంగా ఈ తరగతుల నిర్వహణ ఉంటుంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు ఫారం నింపి దాఖలు చేయడం ద్వారా తరగతులకు హాజరుకావచ్చు. దరఖాస్తు ఫారమ్, నియమాలు, నిబంధనలు, ఇతర మరిన్ని వివరాల కోసం ఎన్ఐటీ వరంగల్ అధికారిక నోటిఫికేషన్ విభాగంలో చూడవచ్చు. మరింత సమాచారానికి విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ సెల్, ఎన్ఐటీ, వరంగల్‌ను సంప్రదించవచ్చునని నిట్ అధికారులు తెలిపారు.

నియమ నిబంధనలు

ఉచిత కోచింగ్ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు గుర్తింపు కార్డు ఇస్తారు. కళాశాలలోకి రావడానికి, తరగతులకు హాజరుకావడానికి ఈ కార్డును తప్పనిసరిగా కలిగి ఉండాలి. కళాశాల నియమ నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలి. తరగతులు నవంబరు 17 నుంచి ప్రారంభమవుతాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తారు. క్రమం తప్పకుండా క్యాంపస్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వారం వారం పరీక్షా ఫలితాలను బట్టి టాపర్లను నిర్ణయిస్తారు.

తరగతులకు క్రమం తప్పకుండా హాజరుకావడం తప్పనిసరి. వరుసగా నాలుగు తరగతులకు హాజరుకాకపోతే ప్రవేశాన్ని తొలగిస్తారు. ఇతర కాలేజీ విద్యార్థులు ఎవరైనా క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటారు. తరగతుల్లో మొబైల్ వాడకం నిషేధం. ఇతర వివరాలకు నిట్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆఫీసు 9963169781లో సంప్రదించవచ్చు. ఈ ఉచిత కోచింగ్‌కు అన్ని శాఖల బీటెక్ తృతీయ, బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు అర్హులు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని..

రూ.45 లక్షలు వసూలు?

నల్లబెల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోర్టుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.45 లక్షలు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం, మంచిర్యాల, కోరుట్ల ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు, అలాగే నల్లబెల్లి మండలానికి చెంది న ఓ వ్యక్తి మధ్యవర్తిత్వంతో రహస్యంగా మండలంలోని ముచ్చింపుల, రంగాపురం, గుండ్లపహాడ్, నల్లబెల్లి గ్రామాలకు చెందిన కొందరు నిరుద్యోగుల నుంచి సుమారుగా రూ.45లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. వీరందరికి వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని కోర్టులలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి దగ్గర రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. మండలానికి చెందిన ఓ మధ్యవర్తిని నలుగురు బాధితులు తమకు ఉద్యోగం రాలేదని, పైగా డబ్బులు పోయాయంటూ నిలదీయడంతో.. మీ డబ్బులు ఇవ్వకుంటే తన భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తానని స్థానిక పోలీస్ స్టేషన్‌లో గత 10 రోజుల కిందట మంతనాలు జరిగాయని వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై ఎస్సై గోవర్ధన్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రూల్స్ పాటిస్తే ఒట్టు!

(5వ పేజీ తరువాయి)

రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రధాన కారణాలు ఇవే..

హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, త్రిపుల్ డ్రైవింగ్, మితిమీరిన వేగం, రోడ్లపై విన్యాసాలు, సీటు బెల్టు పెట్టుకోకుండా కారు, ఇతర వాహనాలు నడపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, సైలెన్సర్ సౌండ్ పొల్యూషన్, నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాన్ని నడుపడం, నెంబరు ప్లేట్ ట్యాంపరింగ్, ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్, లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, అతివేగం తదితర కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

భారీగా నమోదవుతున్న కేసులు..

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరం అనేది అందరికీ తెలిసిందే. ఇందుకు జరిమానా, జైలుశిక్ష, ఇతర శిక్షలు విధిస్తారు. 18 ఏళ్ల లోపు వ్యక్తులు వాహనం నడుపడం చట్ట విరుద్ధం. వారికి వాహనం ఇచ్చిన యాజమానికి కూడా శిక్షార్హుడే. 2023-24,25 ఈ మూడేళ్లలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వాహనదారులపై 88,405 కేసులు నమోదయ్యాయి. అదే విధంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన కేసులు 16,25,312 ఉన్నాయి. సిగ్నల్ జంప్ కేసులు 57,439, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లు 24,734, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లు 45,218, త్రిపుల్ డ్రైవింగ్ 41,406 కేసులు, అదేవిధంగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు 52,024 నమోదయ్యాయి.

నేడు పీహెచ్‌డీ అడ్మిషన్లకు రీ ఇంటర్వ్యూలు

అభ్యర్థులకు సమాచారం అందించిన అధికారులు

కేయూ క్యాంపస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం అభ్యర్థులకు నవంబరు 6న గురువారం రీఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ పీహెచ్‌డీ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులందరికీ ఉదయం 10 గంటల నుంచి జరిగే రీ ఇంటర్వ్యూలు హాజరుకావాలని సమాచారం అందించారు. అన్ని ఒరిజినల్స్ ధృవపత్రాలతో పాటు 3 సెట్ల జిరాక్స్ పత్రులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

కాగా, 2022 పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో అన్ని విభాగాల్లో సీట్లు పెంచి ఆశావహులైన అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించగా, తెలుగు విభాగంలో కొద్దిమందికే అవకాశం కల్పించారని అభ్యర్థులు వాపోతున్నారు. కొందరు అభ్యర్థులు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రాన్ని అందించారు. ఇదిలా ఉండగా, గతంలో తెలుగు విభాగంలో కేటగిరి-1లో రెండు సీట్లకు జరిగిన పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన విషయం విదితమే. అవకతవకల దృష్ట్యా తెలుగులో పీహెచ్‌డీ అడ్మిషన్లకు రీ షెడ్యూల్ ప్రకటించి అభ్యర్థులందరికీ రీఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. అయితే వర్సిటీ తెలుగు విభాగంలో జరిగిన అవకతవకలపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ ఘటనకు బాధ్యుడైన ఆ రిటైర్డు కేయూ తెలుగు ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకుంటారా? లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో తెలుగు పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు నిర్వహించి అవకతవకలకు బాధ్యులపైన వారిపై కమిటీని నియమించి చర్యలకు ఉపక్రమిస్తారా? అనే చర్చ జరుగుతోంది. కేయూ తెలుగు విభాగంలో చోటుచేసుకున్న పరిణామాలపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీదేవసేనకి ఫిర్యాదులందినట్లుగా తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు ఏం చేస్తారనేది వేచి చూడల్సిన ఉందని వర్సిటీ వర్గాలు చర్చిస్తున్నాయి.

అతిథి అధ్యాపకుల భర్తీకి నోటిఫికేషన్

హనుమకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకులను (గెస్ట్ ఫ్యాకల్టీ) తాత్కాలిక విధానం ద్వారా భర్తీ చేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యుడు ఎం.డి. అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను అధ్యాపకులుగా (గెస్ట్ ఫ్యాకల్టీ) ఎంపిక చేసే సమయానికి 65 ఏళ్ల వయసులోపు ఉన్న రిటైర్డ్ / నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో కళలు-కళావిద్య ఒక పోస్టుకు విద్యార్హతలు ఫైన్ ఆర్ట్స్/మ్యూజిక్/డాన్స్/థియేటర్ మొదలైన వాటిలో మాస్టర్స్ (ఎంఎఫ్ఏ) బ్యాచిలర్స్ (బీఎఫ్ఏ) డిగ్రీ కలిగి ఉండాలి. గౌరవ వేతనం రూ.15600. ఉర్దూ మీడియలో ఫిలాసఫీ/సోషియాలజీ/ సైకాలజీ ఒక పోస్టుకు విద్యార్హతలు సంబంధిత సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ), ఎంఈడీ కలిగి ఉండాలి. గౌరవ వేతనం రూ.23400. ఉర్దూ మీడియంలో పెడగాజీ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఒక పోస్టు. విద్యార్హతలు గణితం సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ), ఎంఈడీ కలిగి ఉండాలి. గౌరవ వేతనం రూ.23400. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు కళాశాలలో ఇచ్చే దరఖాస్తును పూర్తి చేసి ఒక ఫొటో, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను జత చేసి ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ, హనుమకొండలో ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకు సమర్పించాలి. 14న తుది జాబితా ప్రకటించి మెరిట్ ప్రాతిపదికన 1:5 నిష్పత్తిలో 15న డెమో/ ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నట్టు ప్రధానాచార్యుడు తెలిపారు. జాబితాలోని అభ్యర్థులు 17న 2025-26 అకడమిక్ సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీగా డైట్‌లో రిపోర్టు చేయాలని తెలిపారు.

బీఈడీ కళాశాలలో..

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని బీఈడీ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీలకు చెందిన మూడు పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు-కళా విద్య, ఫిలాసఫీ, పెడగాజీ ఆఫ్ మ్యాథమెటిక్స్‌లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు ఎంఈడీ పూర్తి చేసి 65 ఏళ్లలోపు అర్హత, ఆసక్తిగల వారు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

భద్రకాళి ఆలయంలో జ్వాలా తోరణం

వరంగల్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చారిత్రక, ఆధ్యాత్మిక నగరమైన ఓరుగల్లు నేలపై కార్తీక పౌర్ణమి వెలుగులు విరజిమ్మాయి. భక్తుల ఆరాధ్యదైవం భద్రకాళి అమ్మవారి సన్నిధానంలో కార్తీక పౌర్ణమి దీపోత్సవం, జ్వాలాతోరణం, చండీ హోమాలను బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి దీపోత్సవాలను మేయర్ గుండు సుధారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆవు నెయ్యితో తయారు చేసిన జ్వాలా తోరణాలను పరమేశ్వరుడికి, అమ్మవారికి, విష్ణుమూర్తికి నివేదించారు. పండితులు వేద మంత్రాలతో జ్వాలాతోరణాలను వెలిగించారు. కార్తీక దీపోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి, ఈవో రామల సునిత, కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అర్చకులు భద్రకాళి శేషు, ధర్మకర్తలు కార్తీక దీపాలను వెలిగించారు. ఓరుగల్లులోని పంచలింగాల్లో తేజో లింగంగా (అగ్ని లింగం)గా భద్రేశ్వరస్వామిగా పూజలందుకుంటున్న స్వామిని పుష్పాలతో అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన ముత్తైదువులకు వాయినాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, శ్రవన్‌కుమార్‌రెడ్డి, పూర్ణచందర్, శ్రీనివాసరావు, రాములు, శ్రీలక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్టు అధ్యక్షుడు జి. కృష్ణారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

బయ్యారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో ఓ బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డ గ్రామానికి చెందిన సూర్ణపాక రాంబాబు (30) ఢిల్లీలో పీసీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలోనే విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇటీవల ఆయనను విధుల నుంచి తొలగించారు. దీంతో కొంతకాలంగా ఇంటి వద్దనే ఉంటున్న అయన.. జాబ్ పోయిందనే మనోవేదనతో ఈనెల 3న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంటి వద్ద వాంతులు చేసుకుంటుండగా గమనించిన భార్య మమత.. రాంబాబును చికిత్స నిమిత్తం తొలుత జిల్లా ఆస్పత్రికి, అక్కడ నుంచి ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ రాంబాబు పరిస్థితి విషమంగా మారడంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి భార్యతో పాటు ఇరువురు పిల్లలున్నారు.



వేయిస్తంభాల ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా దర్శనానికి బారులు తీరిన భక్తులు

వెల్లివిరిసిన కార్తీక శోభ

నగరంలోని ఆలయాల్లో అభిషేకాలు, దీపోత్సవాలు



వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



ఖిలా వరంగల్ స్వయంభూ శంభు లింగేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవం

- ఇంటింటా ఉసిరి దీపాలు వెలిగించిన మహిళలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిండు వెన్నెల వెలుగుల్లో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 4 గంటలకు బ్రహ్మీ ముహూర్తంలో నీళ్లలో ఉసిరికాయలు వేసుకొని స్నానాలు ఆచరించారు. సుప్రభాత సమయంలో ఆలయాలను దర్శించుకున్నారు. గణపతి పూజ అనంతరం శివుడికి అభిషేకాలు నిర్వహించారు. విష్ణుమూర్తి ఆలయాల్లో అలంకరణలు, అమ్మవారి దేవాలయాల్లో కుంకుమ పూజలు చేశారు. సామూహికంగా రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఇళ్లల్లో దేవతామూర్తుల వద్ద ఉసిరి కొమ్మను పెట్టుకొని పూజలు చేశారు. ఉసిరి కాయలపై దీపాలు వెలిగించి హారతులు పట్టారు. కార్తీక మాసంలో ఇప్పటివరకు నోము కోని వారు ఈ రోజు నోముకున్నారు.

దేవాలయాల్లో అభిషేకాలు, అలంకరణలు, హోమాలు, కుంకుమ పూజల సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ఇళ్ల వద్ద కార్తీక దీపాలు వెలిగించి ప్రసాదాలను వితరణ చేశారు. నగరంలోని అన్ని శివాలయాల్లో, విష్ణు ఆలయాల్లో, అమ్మవారి దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి పర్వదినం వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. కొన్ని చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని అనేక ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. ముఖ్యంగా ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయానికి తెల్లవారుజామునుంచే పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. భారీ క్యూలైన్లలో నిలబడి పరమేశ్వరుడిని దర్శించుకొని తరించారు. నాగుల చవితి రోజు పాములకు పాలు పోయని మహిళలు, కార్తీక పౌర్ణమి వేళ పుట్టల వద్దకు తరలివచ్చి నాగేంద్రుడిని కొలుస్తూ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలోని పుట్టల వద్దకు పెద్దసంఖ్యలో మహిళలు చేరుకొని నాగేంద్రుడికి మొక్కుబడుగు చెల్లించుకొని, పరమేశ్వరుడిని దర్శించుకొని పరవశించిపోయారు.

దేవాలయాల్లో పూజలు..

హనుమకొండ బ్రాహ్మణవాడలోని నాగుల గల్లీ, పంచరామ ఆలయ సమీపంలోనూ, పబ్లిక్ గార్డెన్ వద్ద, ఏకశిల పార్కు సమీపంలోని సీతా రామచంద్రస్వామి ఆలయం, రెవెన్యూ రామాలయం, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వరాలయంలో మహిళలు నాగేంద్రుడిని కొలిచారు. హనుమకొండ షిరిడీ సాయిబాబా ఆలయం, దత్తక్షేత్రం, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వర ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలను పెద్ద ఎత్తున జరుపుకున్నారు. బ్రాహ్మణవాడలోని శ్రీ గోదా రంగనాథస్వామి ఆలయంలో పవిత్ర కార్తీకపౌర్ణమి వేళ గోదా రంగనాయకులకు ఆలయ అర్చకులు నరసింహాచారి, రాఘవాచారిల ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు జరిగాయి.

పద్మాక్షి, సిద్ధేశ్వర ఆలయాల్లో మహాన్యాసక రుద్రాభిషేకాలు జరిగాయి. ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో పౌర్ణమి దత్తాత్రేయ హోమం నిర్వహించగా అమ్మవారి దేవాలయంలో చండీహోమాన్ని ఆచరించారు. రాజరాజేశ్వరీ అమ్మవారి దేవాలయంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. శృంగేరి శంకరమఠంలో శారద మాతకు, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ములుగురోడ్‌లోని శ్రీవాసవీ మాత దేవాలయంలో, హనుమాన్ జంక్షన్‌లోని శ్రీరమాసత్యనారాయణ స్వామి ఆలయాల్లో సామూహికంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.



ఖిలా వరంగల్ స్వయంభూ శంభులింగేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవంలో భక్తులు



వరంగల్ కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వర దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల పూజలు

కాళేశ్వరానికి కార్తీక శోభ



గర్భాలయంలో భక్తుల పూజలు

- 60వేల మంది భక్తుల దర్శనాలు.. కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- దీపారాధనలు, లక్షవత్తుల కాంతుల వెలుగులు

మహాదేవపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక పౌర్ణమి కావడంతో భక్తులు బుధవారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం 4గంటల నుంచే బారులు తీరారు. బస్టాండు, కాళేశ్వర ముక్తీశ్వరాలయం, సరస్వతీ ఘాట్, ప్రధాన్‌ఘాట్‌ల వద్ద భక్తులతో కాళేశ్వరం రద్దీగా మారింది. సుమారు 60వేల మంది భక్తులుతరలిరాగా టికెట్లు, ప్రసాదాల ద్వారా ఒక్క రోజే ఆలయానికి రూ. 9.50లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు పేర్కొన్నా రు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు.. భక్తులకు ఉచిత ప్రసాదాన్ని(సిరా) అందించారు. గోదావరిలో నది స్నానంతో పాటు ఆలయంలో అభిషేకాలు.. బ్రాహ్మణులకు దీపదానాలు, లక్షవత్తుల పూజలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.

ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టు క్రింద దీపాలు వెలిగించేందుకు భక్తులు క్యూకట్టారు. స్వామివార్ల దర్శనార్థం వచ్చిన భక్తులకు దాతలు అన్నదానాలతోపాటు పాలు, పండ్లు, తాగునీటిని పంపిణీ చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో మహిళలు విశిష్ట పూజలతో పాటు కుంకుమార్చన నిర్వహించుకున్నారు. సా యంత్రం ఆలయ ఆవరణలో జ్వాతా తోరణం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాగా, కార్తీక పౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా బస్సులు సరిపడా అందుబాటులేక ఇబ్బందులు పడ్డారు. వచ్చి న ఒక్కో బస్సులో 70మందికిపైగా తరలివెళ్లిపోయారు. గంటల తరబడి వేచి చూసినా బస్సులు రాకపోడంతో ఆర్టీసీ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.



గోదావరి నదిలో దీపాలు వదులుతున్న మహిళా భక్తులు

వైభవంగా బుగులోని బ్రహ్మోత్సవాలు

భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ఏనుగు వాహనంతో వస్తున్న భక్తులు

రేగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరిలో బుగులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ఏనుగు, గుర్రం, మేక వాహనాల్లో ఊరేగింపుగా గుట్ట వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తి గీతాలు, కోలాటాలు, నృత్యాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. భక్తులు స్తంభం చెట్టు చుట్టూ వాహనాలతో ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా వన బోజనాలు చేసి ఆనందంగా గడిపారు. బుగులోని వెంకటేశ్వర స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జాతరలో పాల్గొన్న వారిలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, శాసన మండలి పక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్పీ సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, నాయకులు ఉమేష్‌గౌడ్, మటిక సంతోష్, పాతుపల్లి సంతోష్, పల్నాటి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, నితిన్‌రెడ్డి, శివ, కిరణ్, రవి, శ్రీనివాస్, విజయ్ ఉన్నారు.

దీపారాధనతో కాంతులు విరజిమ్మిన క్షేత్రం

వెంకటాపూర్, నవంబరు5(ఆంధ్రజ్యోతి):కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజామున ఆలయానికి చేరుకున్న భక్తులు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని రుద్రాభిషేకాలు చేశారు. మహిళలు దీపారాధన చేసి తన భక్తిని చాటుకున్నారు.దేవాలయంలో దీపాలు వెలిగించకపోవడంతో ఆలయం పక్కన ఉన్న మామిడిచెట్టు కింద శివలింగం వద్ద భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. దీంతో కొంతమేర భక్తులకు ఇబ్బంది కలిగింది. అనంతరం భక్తులు అర్చకులకు దీపదానం చేశారు. తదుపరి రామలింగేశ్వర స్వామికి ఇష్ట వాహనమైన నందీశ్వరుడి వద్ద భక్తులు మొక్కులు చెల్లించి ఆలయ గార్డెన్‌లో సరదాగా గడిపారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకున్న భక్తులు బోటులో విహరిస్తూ ఆనందంగా గడిపారు. కార్తీకమాసం సందర్భంగా దీపం వెలిగిస్తే సర్వ పాపాలు హరిస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు కోమళ్లపల్లి హరీశ్ శర్మ, మోహనమఠం ఉమాశంకర్ తెలిపారు.



రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు

కన్నులపండువగా కందగిరి జాతర

వెల్లువలా తరలివచ్చిన భక్తజనం

కురవి, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండ పర్వతంపై లక్ష్మీనర్సింహస్వామి జాతర బుధవారం ఘనంగా జరిగింది. వేలాదిమంది భక్తులు కందికొండను అధిరోహించి, నర్సింహస్వామి, లక్ష్మీదేవిల కల్యాణానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గుట్టపై పుష్కరిణి (కోనేటి)లో స్నానం చేసి లక్ష్మీనర్సింహుని ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ సతీమణి ప్రమీల కందికొండ గుట్టమెట్ల వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పూజలు నిర్వహించారు. ఇక లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. అనంతరం తీర్థ ప్రసాదాలను పంచి భక్తుల దర్శనార్థం స్వామివారిని ఉంచారు. సాయంత్రం గుట్టపై ఉన్న ఆలయం పైభాగంలో అఖండజ్యోతిని వెలిగించారు.



కందగిరి పర్వతంపైకి ఎక్కుతున్న భక్తులు

నాలుగేళ్ల బాలికపై బాలుడి అత్యాచారయత్నం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

తొర్రూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలికపై ఓ బాలుడు(15) అత్యాచార యత్నానికి పాల్పడగా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో బుధవారం వెలుగు చూసింది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరులోని ఓ కాలనీలో ఉండే బాలిక(4)పై అదే కాలనీకి చెందిన బాలుడు అత్యాచారానికి యత్నించాడు.

ఈ విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు... స్వయంగా బాలుడి తల్లిదండ్రులకు తెలిపేందుకు వెళ్లారు. అయితే వారు బాలిక కుటుంబసభ్యులపై దాడికి దిగారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాలుడిపై పోక్సో నమోదు చేశారు.

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం

భక్తులతో కిక్కిరిసిన వేయిస్తంభాల ఆలయం

హనుమకొండ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక పౌర్ణమి వేళ చారిత్రక సహస్ర స్తంభాల ఆలయం శోభాయమాన విద్యుత్ దీప కాంతులతో అద్భుత శోభతో వెలుగొందింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మేయర్ గుండు సుధారాణి, ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకులు గట్టు మహేశ్‌బాబుతో కలిసి లక్ష దీపోత్సవాన్ని ప్రారంభింపజేశారు. తెల్లవారు జాము నుంచే ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. కిక్కిరిసిన క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి రుద్రేశ్వరున్ని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి వేళ తెల్లవారు జామున 4 గంటలకు మంగళ వాయిద్యసేవ, సుప్రభాతం, ఉత్తిష్ట గణపతికి హరిద్రా కుంకుమ విలేపనంతో స్వామి వారికి సేవలు ఆరంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో 108 పుట్ల తేనెతో వేయి మంది భక్తులచే నమక చమకాలతో సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. దేవాదాయశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామివారిని రాత్రి 10 గంటల వరకు సుమారు 40వేల మంది భక్తులు దర్శించుకోవడం విశేషం. ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రుడి పుట్టల వద్ద ఉసిరిక, తులసీదళాలతో, మారేడు వృక్షాల కింద మహిళలు పెద్దఎత్తున దీపాలు వెలిగించుకున్నారు. నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేత్ర పర్వంగా దీపోత్సవం

రాత్రి పెద్ద సంఖ్యలో హాజరైన మహిళల సమక్షంలో మేయర్ సుధారాణి దీపోత్సవాన్ని ప్రారంభించారు.ఆర్యవైశ్య మహాసభ నాయకుడు గట్టు మహేశ్‌బాబు కొమ్మ పూజ నిర్వహించి దీపోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. కాగా, రంగవల్లులతో శివపార్వతుల చిత్రాలు, ఓంకారం, స్వస్తిక్, స్వాగతం లాంటి ముగ్గులతో వేసిన రంగవల్లులతో మహిళలు దీపాలు వెలిగించి ఆలయ ప్రాంగణాన్ని దీపకాంతులతో శోభాయమానం చేశారు. హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, సీఎంఆర్ జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి, ప్రముఖ ఇంజనీర్ రమేశ్, శ్రీనివాస్ గుప్తా, చిదుల అంజనీదేవి, మునుగోటి రమేశ్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో అనిల్ కుమార్ వేడుకలను పర్యవేక్షించారు. రాత్రి 10 గంటల వరకు వేయిస్తంభాల ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ప్రముఖ నాట్యాచారిణి తాడూరి రేణుక శిష్యబృందం 25 మంది కళాకారులు నేత్రపర్వంగా సంప్రదాయ, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.




వేయిస్తంభాల ఆలయ ఆవరణలో లక్ష దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



దీపోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న మేయర్ సుధారాణి



వేయిస్తంభాల ఆలయ ఆవరణలో యువతులు



ఓసీ గర్జనను విజయవంతం చేయాలి

జూలైవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఇటీవల నిర్వహించిన రెడ్ల నిరసన దీక్షకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొడం సంతోషంగా ఉందని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ పోస్టల్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో గోపు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జనవరిలో వరంగల్‌లో నిర్వహించే ఓసీ గర్జన సభకు ఓసీ బంధువులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందుపట్ల నర్సింహారెడ్డి, నల్ల రాజిరెడ్డి, కూరెళ్ల విద్యాసాగర్‌రెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, పెరటి రమేశ్‌రెడ్డి, తాటిపల్లి గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపు జైపాల్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి ఎంపీ డాక్టర్ కావ్య ప్రచారం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఎంపీ కావ్య

హనుమకొండ, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలతో కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజాపాలన ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతీ ఇంటికి వెళ్లి వివరించారు.

ఇందిరమ్మ కాలనీలో చెత్త తరలింపు స్పెషల్ డ్రైవ్



ఇందిరమ్మ కాలనీలో శానిటేషన్ పనులు చేస్తున్న కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరంగల్ నగరంలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రోడ్లపై నిలిచిన చెత్తను తొలగించేందుకు జీడబ్ల్యూఎంసీ శానిటేషన్ విభాగం సిబ్బంది బుధవారం స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో సుమారు 30మంది మునిసిపల్ సిబ్బందిరోడ్లపై నిలిచిన చెత్తతో పాటు రోడ్లకు ఇరువైపు ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ మాట్లాడుతూ.. కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మరో వారం పాటు డివిజన్ మొత్తం శానిటేషన్ కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రతీ ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్ శ్యాంసుందర్, ఇందిరమ్మ కాలనీ అధ్యక్షుడు సిలువేరు కరుణాకర్, నాయకులు నరేష్, వెంకటయ్యగౌడ్, ఉపేందర్, అరుణ్ పాల్గొన్నారు.

కేయూలో విద్యార్థి అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నేత నరసింహారావు తదితరులు

కేయూ క్యాంపస్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి ఉద్యమాల్లో అసువులు బాసిన విద్యార్థి అమరులకు మంగళవారం రాత్రి కేయూ మొదటి గేటు వద్ద పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు నేతృత్వంలో నివాళులర్పించారు. నవంబరు 5 నుంచి 11 వరకు విద్యార్థి అమరుల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కేయూలో నరసింహారావు నివాళులర్పించి మాట్లాడారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పేదలకు ఉచిత నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. విద్యాకాషాయికరణను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ ప్రధానకార్యదర్శి వి.కావ్య, ఉపాధ్యక్షురాలు పి.అనూష, శ్రీజ, లోకేశ్, సహాయకార్యదర్శులు సాధన, చందన, శ్రీకాంత్, నాయకులు గణేశ్, బాలు, చారి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల నిరసన

ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతి పత్రం

కేయూ క్యాంపస్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల ఫీజుల బకాయిలను చెల్లించాలని చేపట్టిన నిరసన ప్రదర్శనలు మూడోరోజుకు చేరాయి. మంగళవారం హనుమకొండ ఏకశిలా పార్కు ఆవరణలోని జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా కేయూ డిగ్రీ పీజీ కాలేజ్ అసోషియేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు జి.వేణుమాదవ్ మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలల ఆర్థిక ఇబ్బందులతో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. రూ.1200కోట్ల మేరకు అప్పులు తీసుకుని పెట్టుబడి పెట్టి కళాశాలలను నడిపించామని, ఇప్పుడు తమకు అప్పులు పుట్టడం లేదన్నారు. గతేడాది నుంచి జీతాలు, అద్దె చెల్లించే పరిస్థితులు లేవన్నారు. డిప్యూటీ సీఎం విక్రమార్క, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కు మార్‌రెడ్డిలకు వినతిపత్రాలిచ్చామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌కు వెంటనే ఫీజుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కళాశాలలను నడుపలేమని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు కె.రవీందర్‌రెడ్డి, హరిందర్‌రెడ్డి, కోడం సదానందం, కె.వెంకట్, కృష్ణమోహన్, నారాయణరెడ్డి, సంజీవరావు, అధ్యాపక బృందాలు పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు

వైభవంగా కార్తీక దీపోత్సవం

వడ్డెపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో కార్తీక పౌర్ణమి వేడుకలను బుధవారం కన్నులపండువగా నిర్వహించుకున్నారు. హనుమకొండ నగరం కార్తీక శోభతో పరిడవిల్లింది. కార్తీక దీపాలతో నగరం దేదీప్యమానంగా ప్రకాశించింది. హనుమకొండ 57వ డివిజన్ అశోక కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సహస్ర విష్ణునామ స్మరణ, కార్తీక దీపోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. మహిళలు ప్రమిదలు వెలిగించారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింతం శ్రీనివాస్, సరోత్తంరెడ్డితోపాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హనుమకొండ 58వ డివిజన్‌లోని శ్రీనాగరాజరాజేశ్వర స్వామి దేవాలయంలో దేవాలయ కమిటీ చైర్మన్ కుందూరు అనిల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండల్‌రావు ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని భక్తి ప్రపత్తులతో జరిపించారు. వడ్డెపల్లి శివాలయంలో ఉత్సవకమిటీ ప్రతినిధి అల్లం హరిమహేందర్ పటేల్ నేతృత్వంలో కార్తీక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రమిదలను వెలిగించి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

● మడికొండ: కార్తీక మాసోత్సవాలలో భాగంగా మడికొండలోని మెట్టుగుట్టపై పరమ శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు వెల్లువెత్తారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వయంభూ శివలింగానికి ఫల, పంచామృతాలతో మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆకాశ దీపోత్సవం, సుగంధ ద్రవ్యాలతో మహా రుద్రాభిషేకం, ధాత్రినారాయణ పూజ, జ్వాలాతోరణం, లక్షపుష్పార్చన, మంత్రపుష్పం, నక్షత్ర హారతి ఇత్యాది పూజలు చేశారు. రామాలయంలో స్వామి వారికి లక్ష తులసి అర్చనలు, సాలగ్రామ పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా భక్తులకు వాయినాలు ఇచ్చారు. ఈవోలు ఆర్. సునీత, ఎస్. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాషశర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● హనుమకొండ కల్చరల్: పవిత్ర కార్తీక పౌర్ణమి పర్వదిన వేళ బుధవారం హనుమకొండ ఏషియన్ మాల్ సమీపంలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో పెద్దఎత్తున శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, రాకం సదానందం, వెయ్యిగండ్ల రమేశ్ తదితరుల పర్యవేక్షణలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ అర్చకులు కిశోర్ శర్మ, మణిశర్మ, చందులు శాస్త్రయుక్తంగా క్రతువులు నిర్వహించారు. అనంతరం భక్తులందరికి విశేష అన్నదానం నిర్వహించారు. రాత్రి బాబాకు పల్లకి సేవ కూడా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి వేళ జ్వాల తోరణం కూడా ఆలయంలో నేత్రపర్వంగా నిర్వహించారు. సాయిక్రిష్ణ, రాజు, తదితర సిబ్బందితోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అశోక కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు



మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వయంభూ శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకోవాలి

వడ్డెపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురై నష్టపోయిన ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం హనుమకొండ పశ్చిమ మండల కార్యదర్శి వాంకుడోతు వీరన్న డిమాండ్ చేశారు. వరద బాధిత ప్రాంతాలను బుధవారం సీపీఎం హనుమకొండ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ పర్యటన బృందాన్ని సీపీఎం జిల్లా కమిటీ నాయకురాలు ఎల్. దీపతో పాటు వీరన్న ప్రారంభించి మాట్లాడారు. జీడబ్ల్యూఎంసీ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు గోపాల్‌పూర్‌లోని ఊర చెరువు ప్రాంతంలోని డక్ట్ డ్రైన్‌ను ఉన్న గేట్లను తొలగించకపోవడంవల్లనే వరద ముంపుతో కాలనీలు జలమయమయ్యాయని అన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని, రోడ్లు, డ్రైయినేజీలు, ఇళ్లు దెబ్బతిన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ నాయకులు స్వామిదాస్, కె. రవీందర్, రాజు, కడియాల ప్రసాద్, రమేష్, లత, అనిత, రాధిక, సాంబన్న, సమ్మయ్య, లాలూ, ప్రభాకర్, సబిత, పావని, రవి నాయక్ పాల్గొన్నారు.



సీపీఎం బృందం పర్యటనను ప్రారంభిస్తున్న వాంకుడోత్ వీరన్న, ఎల్. దీప

సీపీఐ బస్సు జాతను జయప్రదం చేయండి

న్యూశాయంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పార్టీ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18, 19 తేదీల్లో జిల్లాలో జరిగే రాష్ట్ర బస్ జాతను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రజా సంఘాల సమావేశం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా కర్రె భిక్షపతి హాజరై మాట్లాడుతూ.. సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18, 19 తేదీలలో జిల్లాలో రాష్ట్ర బస్ జాత జరుగుతుందని, 18న భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరుకు చేరుకుని 19వ తేదీన పరకాలలో ముగించుకుని భూపాలపల్లి జిల్లాకు వెళతుందన్నారు. ఈ బస్ జాతలో పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎన్ఏ స్టాలిన్, ఎం.భిక్షపతి, టి.భిక్షపతి, ఎదునూరి వెంకట్రాజం, గుంటి రాజేందర్, కండె నర్సయ్య, కొట్టెపాక రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

జస్టిస్ గవాయ్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

ఎమ్మార్పీఎస్- టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ

వడ్డెపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిచేసిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణ (ఎమ్మార్పీఎస్- టీ) వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఎమ్మార్పీఎస్-టీ రాష్ట్ర అధ్యక్షుడు బొక్కల వెంకటస్వామి మాదిగ మాట్లాడారు. జస్టిస్ గవాయ్‌పై దాడి జరిగితే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్పందించకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో దళిత, గిరిజనులపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మనువాది రాకేష్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 20న ఢిల్లీలో నిర్వహించే హలో దళిత ఛలో ఢిల్లీ మహాధర్నాలో ఎమ్మార్పీఎస్-టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ - టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేరిపోతుల విల్సన్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరు ఆశీర్వాదం మాదిగ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఎడ్ల సమ్మయ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు దాసారపు సారయ్య, మైపాల్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న చిట్టుపాక ప్రభాకర్ మాదిగ



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎం చైర్మన్ ఊకంటి వనంరెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మడికొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం కడిపికొండలో దర్గా ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి కొబ్బరికాయ కొట్టి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ప్రతీ రైతు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణగౌడ్, కాంగ్రెస్ నాయకులు రాజారపు స్వామి, కట్కూరి రమేష్, సీఈవో జ్ఞానేశ్వర్‌రెడ్డి, రైతులు ముసుల క్రిష్ణారెడ్డి, కట్ట రాజేశ్వర్‌రెడ్డి, సాధినేని రాజయ్య, సాధినేని దయాకర్, సీతారాములు, దామెరుప్పుల కోటేశ్వర్, జనగాం సమ్మిరెడ్డి, సాదినేని మహేష్, కంకణాల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 వరకు కోమటిపల్లి రైల్వే గేటు మూసివేత

కాజీపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లి రైల్వే గేటును ఈ నెల 15 వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట - హసన్‌పర్తి రైల్వే స్టేషన్‌ల మధ్య రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల దృష్ట్యా గేటు నెంబర్ 2ను మూసివేస్తున్నామని చెప్పారు. ఈ గేటు మార్గంలో ప్రయాణికులు వేరే మార్గంలో వెళ్లాలని సూచించారు.

అవస్థల్లో అపార్ట్‌మెంట్ల వాసులు

- నిర్మాణం, నిర్వహణలో బిల్డర్ల నిర్లక్ష్యం
- యథేచ్ఛగా రెరా చట్టం ఉల్లంఘన

బాలసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో గజం స్థలం రూ.వేలల్లో, లక్షల్లో రేటు పలకడంతో మధ్యతరగతి కుటుంబాలకు ఇల్లు నిర్మించుకోవడం అనేది అందని ద్రాక్షగా మారింది. దీంతో అపార్ట్‌మెంట్ సంస్కృతి విస్తృతంగా పెరిగింది. స్వచ్ఛమైన వాతావరణం, భద్రత, సమాజ జీవనం లాంటి సౌకర్యాలతో అనేక కుటుంబాలు అపార్ట్‌మెంట్లలో నివసించడం ప్రారంభించాయి. అయితే అపార్ట్‌మెంట్ నివాసితులు అనేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. బిల్డర్ల నిర్లక్ష్యం, రెరా చట్టం అమలులో లోపాలు, జీడబ్ల్యూఎంసీ శాఖల పర్యవేక్షణ రాహిత్యం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

చాలా మంది బిల్డర్లు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా)లో ప్రాజెక్టులను నమోదు చేయకుండానే నిర్మాణాలు చేస్తున్నారు. దీని వల్ల నాణ్యత, భద్రత, పారదర్శకత లోపిస్తోంది. అపార్ట్‌మెంట్ నిర్మాణంలో బిల్డర్ల లోపాలుంటే బిల్డర్లు ఐదేళ్ల వరకు మరమ్మతు చేయాలని రెరా నిబంధనలో ఉంది. రెరాను ఉల్లంఘించిన బిల్డర్లకు నిబంధనల ప్రకారం శిక్ష కూడా ఉంటుంది. అయినప్పటికీ కొంత మంది బిల్డర్లు రెరా చట్టాన్ని ఉల్లంఘిస్తూ బాధ్యతారహిత్యంగా ప్రవర్తిస్తున్నారు. అలాంటి బిల్డర్స్‌పై కార్పొరేషన్ అధికారులు ప్రజలు మోసపోకుండా వారిని బ్లాక్ లిస్టులో పెట్టి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది.

నగరంలో 600 గజాలలోపు స్థలాల్లో కూడా ఐదు అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)పేరుతో కార్పొరేషన్‌కు డబ్బులు చెల్లించి అదనపు ఫ్లోర్స్ కట్టడం వల్ల పార్కింగ్ స్థలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు తమ వాహనాలను బయట రోడ్లపై నిలిపే పరిస్థితి దాపురించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు భద్రత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక అనేక మంది బిల్డర్లు నివాసితులకు తమ ఇష్ట ప్రకారంగా పార్కింగ్ స్థలాలను కేటాయిస్తున్నారు. చట్ట పరంగా పార్కింగ్ స్థలాలను కేటాయించే హక్కు బిల్డర్లకు లేదు. పార్కింగ్ మొత్తం అపార్ట్‌మెంట్ ఏరియాలో భాగం కాబట్టి స్థలాల కేటాయింపు హక్కు అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌దేకానీ బిల్డర్లది కాదు. ఇటీవల బెంగుళూరులో జరిగిన ఇలాంటి కేసులో కోర్టు తీర్పు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ పక్షాన వచ్చింది. బిల్డర్ ప్రాజెక్టు పూర్తిచేసిన తర్వాత పార్కింగ్ స్థలాలపై హక్కును కోల్పోతారు. నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో అసోసియేషన్ ఏర్పడిన తర్వాత జనరల్ బాడీ మీటింగ్ ద్వారా పార్కింగ్ స్థలాల కేటాయింపును చేపట్టాల్సి ఉంది. కానీ వీటిని పట్టించుకోవడం లేదు. బిల్డర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.


సమన్వయంతో పనిచేయాలి..



అపార్ట్‌మెంట్ వాసుల సౌకర్యాలు, జీవన ప్రమాణాలు మెరుగు పడాలంటే బిల్డర్లు, కార్పొరేషన్ అధికారులు, అపార్ట్‌మెంట్ నివాసితులు కలిసి సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. మా అసోసియేషన్ ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం చట్టపరమైన మార్గంలో నిరంతరం కృషి చేస్తుంది.

\- ఆర్.కేశవరెడ్డి, అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

పర్మిషన్ కమిటీలో ప్రతినిధులుండాలి..



అపార్ట్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ పరిశీలించే కమిటీలో కనీసం ఇద్దరు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులకు చోటు కల్పించాలి. దీనితో పార్కింగ్, భద్రతా, నివాసితుల అవసరాలపై సమగ్ర నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది.

\- టి.ప్రభాకర్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం



టౌన్ ప్లానింగ్, మునిసిపల్ శాఖలు అపార్ట్‌మెంట్ నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చిన అనంతరం పర్యవేక్షణ చేయకపోవడంవల్ల నాణ్యత లోపాలు చట్ట విరుద్ధ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన స్పందన లభించడం లేదు.

\- నడుముల విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్

నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 6 నవంబరు 2025



మన అమ్మాయిలు ప్రపంచ క్రికెట్ కప్ గెలుచుకోవటంతో దేశమంతా ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకుంది. ఇప్పటి దాకా కేవలం పురుషుల క్రికెట్‌కు మాత్రమే దక్కిన గౌరవం మహిళా క్రికెట్‌కు కూడా దక్కుతోంది. కానీ ఈ గౌరవాలేవీ అందకపోయినా- కేవలం క్రికెట్ మీద ప్రేమతో ఆటనే నమ్ముకున్నవారెందరో. అలాంటివారిలో ఒకరు లెవెల్ 2 కోచ్‌గా అర్హత సాధించిన **సిరిగుడి కవిత**. ప్రస్తుతం అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్న షబ్నం, మహంతి, తమన్నా లాంటి క్రికెటర్లకు బేసిక్ స్థాయిలో కోచింగ్ ఇచ్చింది కూడా కవితే!
ఆమె తన ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.

కష్టాలను గెలిచి కోచ్‌గా ఎదిగి



"మా నాన్న టాక్సీ డ్రైవర్. అమ్మ సాధారణ గృహిణి. రెక్కాడితే తప్ప డొక్కాడని పరిస్థితి. 'మన ఆర్థిక స్థితికి ఆటలు సరిపడవు. బాగా చదువుకో..' అంటూ ఉండేవారు. కానీ క్రికెట్ అంటే ఆసక్తి. స్కూల్లో చదువుతున్న సమయంలో క్రికెట్‌లో శిక్షణ పొందా. కానీ క్రికెట్ మీద మాత్రమే దృష్టి పెట్టలేని స్థితి. అందువల్ల ఒక వైపు చదువుకుంటూనే మరో వైపు క్రికెట్ ప్రాక్టీసు చేస్తూ ఉండేదాన్ని. అంతే కాకుండా నా చిన్నప్పుడు క్రికెట్ ఆడే మహిళలు తక్కువే ఉండేవారు. ఎందుకంటే- మహిళా క్రికెట్‌కు ఎక్కువ ప్రోత్సాహం ఉండేది కాదు. 2004 నుంచి పురుషుల క్రికెట్ బోర్డు- మహిళా క్రికెట్‌ను కూడా నియంత్రించటం మొదలుపెట్టింది. దీనితో మహిళా క్రికెటర్లకు కొంత ప్రోత్సాహం లభించింది. విశాఖ జిల్లా క్రికెట్ సంఘం కూడా అమ్మాయిలకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించేది. నేను కూడా వేసవి క్రీడా శిక్షణ శిబిరంలోనే మెలకువలు అభ్యసించా. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి టోర్నీలలో ఆడే అవకాశం లభించింది. 2013లో సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాను. ఆ టోర్నీలో స్వర్ణ పతకం సాధించాం.

కోచ్‌గా ప్రస్థానం..

2014లో కోచ్‌గా నా ప్రస్థానం ప్రారంభమయింది. ఆ సమయంలోనే షబ్నం, మహంతి లాంటి క్రికెటర్లకు ప్రాథమిక శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దాను. వీరందరూ ప్రస్తుతం అండర్-19 భారత జట్టులో ఆడుతున్నారు. అలాగే ఏయూ సౌత్ జోన్, ఆలిండియా యూనివర్సిటీల మహిళా క్రికెట్ టోర్నీలలో స్వర్ణ పతకాలు గెలిచిన ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు కోచింగ్ ఇచ్చాను. సీనియర్ విమెన్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన తొలి మహిళా క్రికెటర్‌ను నేనే! వృత్తిపరంగా అంతా బాగా సాగుతోందని భావిస్తున్న సమయంలో- మా అమ్మా, నాన్నా ఒకే ఏడాది మరణించారు. దీనితో తమ్ముళ్ల బాధ్యత కూడా నాపై పడింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఒక వైపు క్రికెట్ కోచ్‌గా.. మరో వైపు ఫిజికల్ ఫిట్‌నెస్ టీచర్‌గా పనిచేశాను. ఉదయం, సాయంత్రం కోచింగ్ ఇస్తూ.. రోజంతా స్కూల్లో పనిచేయటం చాలా కష్టమయ్యేది. రెండింటిలో ఒకటి మానేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్రికెట్ మీద మక్కువతో కోచ్‌గానే స్థిరపడాలనుకున్నాను.

కోచింగ్‌తో పాటు..

చాలా మంది కోచింగ్ అంటే కేవలం ఆటలో మెలకువలు తెలియచెప్పటం అనుకుంటారు. కానీ కోచింగ్ అంటే- ఒక క్రీడాకారుల వ్యక్తిత్వాన్ని పూర్తిగా తీర్చిదిద్దటం. మెలకువలతో పాటుగా మానసిక సైర్థ్యాన్ని ఇవ్వటం కూడా చాలా ముఖ్యమైన పని. అందుకే క్రికెట్‌తో పాటుగా నేను యోగా, ప్రాణిక్ హీలింగ్ లాంటి కోర్సులు చేశాను. ఇవన్నీ నాకు కోచింగ్‌లో ఎంతో ఉపకరిస్తాయి. ఒక వైపు ఈ కోర్సులు చేస్తూనే- గత ఏడాది నేను లెవెల్-2 కోచ్‌గా అర్హత సాధించాను. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ అర్హతను సాధించిన రెండో మహిళను కావటం చాలా గర్వంగా అనిపిస్తోంది. ప్రస్తుతం నా దృష్టంతా కోచింగ్ పైనే ఉంది. అందుకే పెళ్లి కూడా చేసుకోలేదు. మన దేశానికి ప్రతిష్ఠను తీసుకువచ్చే మహిళా క్రీడాకారులను తీర్చిదిద్దటమే నా లక్ష్యం. దాని కోసమే శ్రమిస్తున్నాను."

• **భాస్కర్**, విశాఖపట్నం

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్... మన హైదరాబాదీ!



ముస్లింలు అత్యధికంగా ఉన్న దేశాలపై 2017లో డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రయాణ ఆంక్షలు గజాలా హష్మీలో ఆగ్రహావేశాలను రేకెత్తించాయి. అమెరికన్ పరిపాలనలో సమ్మిళితత్వం, సమానత్వం ఉండాలని కోరుకొనేవారి ప్రతినిధిగా... ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఇప్పుడు... అదే ట్రంప్ అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో... ప్రతిష్ఠాత్మకమైన వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఘనమైన విజయాన్ని గజాలా సాధించారు. ఆమె ఆ పదవికి ఎన్నికైన మొదటి ఇండియన్-అమెరికన్‌గా, తొలి సౌత్-ఏషియన్ అమెరికన్‌గా, తొలి ముస్లింగా... చరిత్ర సృష్టించారు. మార్పు దిశగా సాగుతున్న వర్జీనియాలో... డెమొక్రటిక్ పార్టీ కొత్త తరం నాయకత్వానికి ప్రతినిధిగా పరిశీలకులు అభివర్ణిస్తున్న గజాలా తొలి అడుగులు వేసింది మన హైదరాబాద్‌లోనే!

తల్లిదండ్రుల స్ఫూర్తితో...

1964 జనవరి 17న... హైదరాబాద్‌లో గజాలా జన్మించారు. ఆమె బాల్యం మలక్‌పేటలోని అమ్మమ్మ ఇంట్లో గడిచింది. ఆమె తాత రాష్ట్ర ఆర్థిక శాఖలో ఉద్యోగి. తండ్రి జియా హష్మీకి జార్జియాలో ఉద్యోగం రావడంతో... తల్లి, అన్నలతో పాటు నాలుగేళ్ళ వయసున్న గజాలా భారతదేశాన్ని వదిలి అమెరికాకు వలస వెళ్ళారు. జియా హష్మీ అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో ఎంఏ, ఎల్ఎల్‌బి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కరోలినాలో అంతర్జాతీయ సంబంధాలపై పిహెచ్‌డి చేశారు. తరువాత ప్రొఫెసర్‌గా పనిచేశారు. 'సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్'ను స్థాపించి, పదవీ విరమణ చేసేవరకూ ఆ సంస్థ డైరెక్టర్‌గా కొనసాగారు. హైదరాబాద్‌లోని కోఠీ ఉమెన్స్ కాలేజీలో చదివిన గజాలా తల్లి తన్వీర్ హష్మీ... బీఏ, బీఈడీ చేశారు. తల్లిదండ్రుల స్ఫూర్తితో... బోధనా వృత్తి మీద గజాలా మక్కువ పెంచుకున్నారు. హైస్కూల్ స్థాయిలోనే ఉపకారవేతనాలు, ఫెలోషిప్‌లు అందుకున్నారు. జార్జియా సదరన్ యూనివర్సిటీలో బిఏ ఆనర్స్ అట్లాంటాలోని ఎమోరీ యూనివర్సిటీలో... అమెరికన్ సాహిత్యంలో పిహెచ్‌డి చేశారు.

ప్రజా సమస్యలపై గళం విప్పి...

అజహర్ రఫీతో వివాహం తరువాత... రిచ్మాండ్ ప్రాంతంలో గజాలా స్థిరపడ్డారు. వారికి యాస్మిన్, నూర్ అనే ఇద్దరు అమ్మాయిలున్నారు. యూనివర్సిటీ ఆఫ్ రిచ్‌మండ్‌లో ప్రొఫెసర్‌గా గజాలా వృత్తి జీవితం ప్రారంభించారు. ఆ తరువాత రెనాల్డ్స్ కమ్యూనిటీ కాలేజీలో పని చేశారు. ఆ కాలేజీలో 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ అండ్ లెర్నింగ్' (సిఇటిఎల్)కు వ్యవస్థాపక డైరెక్టర్‌గా వ్యవహరించారు. ముప్పయ్యేళ్ళపాటు ప్రొఫెసర్‌గా పని చేసిన గజాలా... 2019లో రాజకీయాల్లో ప్రవేశించారు. రిపబ్లికన్ ప్రాబల్యం ఉన్న స్టేట్ సెనేట్ సీటులో సంచలన విజయం సాధించారు. 2023లో మరోసారి గెలిచారు. 2024లో... 'సెనేట్ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ కమిటీ'కి ఛైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. 'రైట్ టు వర్క్' చట్టాలకు మద్దతివ్వడంతో పాటు విద్య, ఆరోగ్య సంబంధమైన బిల్లులను సెనేట్‌లో ప్రవేశపెట్టడం ద్వారా ఆమె ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారు. తాజాగా లెఫ్టినెంట్ గవర్నర్ పదవికోసం పోటీ పడిన గజాలా... గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్యం లాంటి అంశాల్లో నెలకొన్న అసమానతలను తొలగిస్తాననీ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తాననీ హామీ ఇచ్చారు. పౌరుల జీవితాలను మెరుగుపరచడానికి అంకితమవుతానని ప్రకటించారు. ఇటీవలి ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి జాన్ రీడ్‌పై ఘన విజయం సాధించారు.

తగ్గేది లేదు...

తను గెలిచిన తరువాత గజాలా మాట్లాడుతూ... "ప్రజలను అధోగతి పట్టించేవారిని కాకుండా వారి అభ్యున్నతికి పాడుపడే నాయకత్వాన్ని వర్జీనియా ఎన్నుకొంది. వర్జీనియాకు ఎంతో వైవిధ్యం ఉంది. భవిష్యత్ పట్ల దార్శనికత ఉంది. వాటి పట్ల విశ్వాసం ఉంచిన ఓటర్లకు ధన్యవాదాలు. 'మన వైవిధ్యమే మనకున్న గొప్ప బలం' అని ఈ రోజు వర్జీనియా రుజువు చేసింది.
మనం వెనక్కి తగ్గేది లేదు... కలిసి కట్టుగా ముందుకు సాగుదాం" అని పిలుపునిచ్చారు. లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఆమె ఎన్నిక కావడంతో... సెనేట్‌లో ఖాళీ అయిన ఆమె స్థానాన్ని ప్రత్యేక ఎన్నిక ద్వారా భర్తీ చేస్తారు. వర్జీనియా స్టేట్ సెనేట్లో ప్రస్తుతం డెమొక్రాట్లకు ఇరవై ఒక్క స్థానాలు, రిపబ్లికన్లకు పంతొమ్మిది స్థానాలు ఉన్నాయి. సీట్ల మధ్య వ్యత్యాసం తక్కువ కావడంతో... గజాలా పాత్ర కీలకం కాబోతోంది.

రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డవారికి.. రూ. లక్షన్నర వరకు ఉచిత వైద్యం: పొన్నం



హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ద్వారా లక్షన్నర రూపాయల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఆర్టీఏ మెంబర్స్(రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ నాన్ అఫీషియల్ మెంబర్స్)కు రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన చర్యలపై హైదరాబాద్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇటీవల వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందులో మృతుల సంఖ్య అధికంగా ఉండటం ఆందోళనకరంగా మారిందన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు విద్యాసంస్థల్లో రోడ్డు భద్రత, నియమ నిబంధనలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలని ఆయన సూచించారు. యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. 10-19 సంవత్సరాల వయస్సులో మరణిస్తున్న వారిలో ప్రధానంగా రోడ్డు ప్రమాదాలే కారణమన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి యూనిసెఫ్ వివిధ దేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. మనదేశంలో అహ్మదాబాద్, ముంబై, హైదరాబాద్‌లలో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.



నోటిఫికేషన్ పోస్టర్స్ విడుదల చేస్తున్న వీసీ ఆచార్య నాగభూషణ్ తదితరులు

విశాట్ నోటిఫికేషన్ జారీ

» దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 25
» మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు ప్రవేశ పరీక్ష

గుంటూరు(విద్య), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని వడ్లమూడిలో ఉన్న విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో బీటెక్, ఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశం కోసం విశాట్ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. ఈ మేరకు వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య వీ. నాగభూషణ్ నోటిఫికేషన్ వివరాలు వెల్లడించారు. 2026-27 విద్యాసంవత్సరానికి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ(హానర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ(హానరల్), అగ్రికల్చరల్, ఫార్మా డీ తదితర కోర్సుల్లో అడ్మిషన్ కోసం విశాట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 వరకు గడువు ఉందని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 1 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విశాట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వడ్లమూడిలోని వర్సిటీ క్యాంపస్‌తోపాటు హైదరాబాదులోని ఆఫ్ క్యాంపస్‌లో ఆయా కోర్సులు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు https://admission.-vignan.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విశాట్ పరీక్షలో ర్యాంకులు సాధించిన వారికి దాదాపు రూ.48 కోట్ల వరకు ఉపకార వేతనాలు అందించనున్నట్టు తెలిపారు. ఇంటర్, జేఈఈ, మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ దిరిశాల విజయరాము, డీన్ అడ్మిషన్స్ కేవీ కృష్ణకిశోర్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఏ. గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు సరుకుల సరఫరాలో

టెండర్ల ఎంపికకు లాటరీ పద్ధతి వద్దు

హైకోర్టు ఆదేశం.. మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లకు పండ్లు, కూరగాయలు, చికెన్, మటన్ సహా ఇతర సరుకులు సరఫరా చేసే టెండర్ల ప్రక్రియలో సమానత్వం, పారదర్శకత పాటించాలని హైకోర్టు స్పష్టంచేసింది. సాంకేతిక అర్హత ఉన్న బిడ్డర్లలో ఒకరిని లాటరీ ద్వారా ఎంపిక చేసే పద్ధతికి స్వస్తి పలకాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రంలోని దాదాపు 1,023 ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలకు సరుకుల సరఫరాకు సంబంధించి కొత్త పద్ధతిని ప్రవేశపెడుతూ ప్రభుత్వం ఈ ఏడాది జూలై 8న జీవో 17ను జారీచేయడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. పిటిషనర్ సంఘంలో 5 వేల మంది చిన్న కాంట్రాక్టర్లు ఉన్నారని, కొత్త విధానం వల్ల వీరంతా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కొత్త జీవో ద్వారా జిల్లా యూనిట్‌గా కేంద్రీకృత సేకరణ విధానాన్ని ప్రవేశపెట్టారని.. కలెక్టర్లు ఛైర్మన్‌లుగా జిల్లా కొనుగోళ్ల కమిటీ (డీపీసీ)లను ఏర్పాటు చేశారని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. టెండర్ల ప్రక్రియలో సమానత్వం, పారదర్శకత ఉండేందుకు పలు మార్గదర్శకాలు జారీచేసింది. 'జీసీసీ, మండల, జిల్లా మహిళా సమాఖ్యలకు అనుకూలంగా రిజర్వేషన్ ఇస్తే దాన్ని టెండర్ నోటిఫికేషన్‌లో స్పష్టంగా చెప్పాలి. టెండర్ ప్రక్రియ ప్రారంభమయ్యాక విజయవంతమైన ఏజెన్సీలను గుర్తించడంలో డీపీసీలకు విచక్షణాధికారం ఉండదు. టెండర్ షరతులు హేతుబద్ధంగా, దామాషా ప్రకారం ఉండాలి. చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్ల పట్ల వివక్ష ఉండకూడదు. రూ.కోటి కంటే తక్కువ విలువైన కాంట్రాక్టుల విషయంలో ఈఎండీ అంచనా విలువలో 2 శాతానికి మించకూడదు. బిడ్‌ను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి కారణాలను రాతపూర్వకంగా నమోదు చేయాలి. అర్హులైన బిడ్డర్లకు మాత్రమే పని లభించేలా ఎంపిక ఉండాలి. మండల, పాఠశాల స్థాయి సేకరణ యూనిట్లలో 25 శాతం కంటే తక్కువ కాకుండా.. అనుభవం, సామర్థ్యమున్న చిన్న, స్థానిక కాంట్రాక్టర్లకు రిజర్వు చేయాలి. ప్రభుత్వ కాంట్రాక్టుల సమాన పంపిణీకి నిబంధనలు రూపొందించాలి. బహిరంగ, పారదర్శక ప్రక్రియతో ఈ రిజర్వేషన్ అమలుచేయాలి. టెండర్ నోటీసుల ప్రచురణ, సవరణలు, ఫలితాలు, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి కేంద్రీకృత ఆన్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. పీఎంయూ ఏటా గుర్తింపు పొందిన కాంట్రాక్టర్ సంఘాల ప్రతినిధులతో సమావేశాలను ఏర్పాటు చేయాలి. ఈ తీర్పు అందిన తేదీ నుంచి రెండు వారాల్లో పైన పేర్కొన్న ఆదేశాలతో సవరించిన మార్గదర్శకాలను ప్రచురించాలి. రాష్ట్రవ్యాప్తంగా ఒకేలా వర్తింపజేయాలి. చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్ల హక్కులను కాపాడాలి' అని ధర్మాసనం పేర్కొంది.

నడిరోడ్డుపై కత్తిపోట్లు

» యువకుడిపై కత్తితో పాశవిక దాడి
» బాధితుడు, నిందితుడు ఇద్దరూ రౌడీషీటర్లే
» హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో ఘటన


రోషన్ సింగ్‌పై దాడి చేస్తున్న బాలశౌరెడ్డి

జీడిమెట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఓ రౌడీషీటర్ బరి తెగించాడు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలప్పుడు, నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే తన ప్రత్యర్థి అయిన మరో రౌడీషీటర్‌పై కత్తితో పాశవికంగా దాడి చేశాడు. పాత కక్షల నేపథ్యంలో విచక్షణారహితంగా పొడిచి హత్యాయత్నం చేశాడు. బాధితుడు రక్తమోడుతూ ప్రాణభయంతో పరుగులు తీయగా.. తమ కళ్ల ముందు జరిగిన రక్తపాతాన్ని చూసి జనమంతా భీతిల్లిపోయారు. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాధితుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్, గాంధీనగర్ ప్రాంతంలోని రంగారెడ్డినగర్‌కు చెందిన రోషన్‌సింగ్(25), జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌కు చెందిన బాలశౌరెడ్డి(23) స్నేహితులు. వీరిద్దరిపై జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్‌లు ఉన్నాయి. రోషన్ సింగ్‌పై హత్యాయత్నం, కిడ్నాప్, అత్యాచారం, ఆయుధాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. బాలశౌరెడ్డిపై రెండు హత్య కేసులున్నాయి. అయితే, రోషన్ సింగ్ మరో ఆరుగురు యువకులు కలిసి 15 రోజుల క్రితం ఓ ట్రాన్స్‌జెండర్‌పై అత్యాచారం చేశారు. దీనిపై ట్రాన్స్‌జెండర్ చేసిన ఫిర్యాదుతో బాలానగర్ పోలీసులు కేసు నమోదు చెయ్యగా.. ఆ కేసులో రోషన్ జైలుకి వెళ్లివచ్చాడు. అయితే, బాలశౌరెడ్డే ట్రాన్స్‌జెండర్‌తో కేసు పెట్టించాడని రోషన్ కక్ష పెంచుకున్నాడు. బాలశౌరెడ్డిని చంపేస్తానని తన స్నేహితుల వద్ద సవాలు చేశాడు. ఇదే కాక, మరో అమ్మాయి విషయంలో కూడా బాలశౌరెడ్డి, రోషన్ మధ్య అనేకసార్లు ఘర్షణలు జరిగాయి. ఈ నేపథ్యంలో బుధవారం మద్యం సేవించిన బాలశౌరెడ్డి, అతని స్నేహితులు ఆదిల్, మహ్మద్ కలిసి రోషన్ సింగ్‌ను జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్దకు పిలిచారు. అందరూ మాట్లాడుకుంటుండగా హఠాత్తుగా కత్తి బయటకు తీసిన బాలశౌరెడ్డి.. రోషన్‌సింగ్‌పై దాడి చేశాడు. కడుపులో కత్తితో పలుమార్లు పొడిచాడు. రోషన్ పారిపోకుండా మహ్మద్ పట్టుకున్నాడు. అనంతరం రక్తమోడుతున్న రోషన్ సింగ్‌ను వదిలేసి బాలశౌరెడ్డి, మహ్మద్, ఆదిల్ ద్విచక్రవాహనంపై వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని రోషన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. రోషన్ పరిస్థితి విషమంగా ఉంది. పాత కక్షల నేపథ్యంలోనే హత్యాయత్నం జరిగిందని, నిందితులను పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.



లండన్‌లో ఐవోడీ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు స్వీకరిస్తున్న భువనేశ్వరి, చిత్రంలో ఏపీ సీఎం చంద్రబాబు, సంస్థ ప్రతినిధులు

ఇది సేవకు దక్కిన గుర్తింపు

» ఎన్టీఆర్ ట్రస్టు తరఫున ఎన్నో కార్యక్రమాలు: భువనేశ్వరి
» ఐవోడీ సంస్థ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు స్వీకరణ
» గోల్డెన్ పీకాక్ అవార్డు కూడా..

అమరావతి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు తరఫున సంజీవని ఉచిత హెల్త్ క్లినిక్స్, మొబైల్ హెల్త్ క్యాంప్స్, సురక్షితమైన తాగునీరు అందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా మంగళవారం అర్ధరాత్రి లండన్‌లో ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ నుంచి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ హోదాలో ఆ సంస్థకు ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో ప్రకటించిన గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకున్న తర్వాత ఆమె ప్రసంగించారు. తనకు వచ్చిన అవార్డు.. సేవకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. మహిళా సాధికారిత కోసం పని చేస్తున్నామని, వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వొకేషనల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు వారి సామర్థ్యాలు పెంచేందుకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలుస్తున్నామని, వారి జీవితం సాధారణ స్థితికి చేరుకునే వరకు చేయూతనిస్తున్నామని చెప్పారు. ఏపీ, తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు సాయం అందిస్తున్నామన్నారు.

ఎక్సైజ్ సీఐ వేధింపులు..

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

» నిద్రమాత్రలు మింగిన కానిస్టేబుల్ అఖిల.. ఆస్పత్రిలో చికిత్స
» కొత్తగూడెంలో ఘటన.. బాధితులు మొత్తంగా 10 మంది
» ఎవర్నీ ఉద్దేశపూర్వకంగా అనలేదంటూ సీఐ జయశ్రీ వివరణ


చుంచుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఎక్సైజ్ కార్యాలయంలో సిబ్బందిని సీఐ జయశ్రీ వేధింపులకు గురిచేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఆమె వేధింపులు భరించలేక ఎక్సైజ్ కానిస్టేబుల్ అఖిల శనివారం కార్యాలయం నుంచి ఇంటికి వెళుతూ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. తమను జయశ్రీ వేధిస్తున్నారని.. 'విధుల్లో ఉన్నప్పుడు తోటి సిబ్బందితో మాట్లాడొద్దు. ఏం తమాషా చేస్తున్నారా? మీరూ.. మీ బతుకులు' అంటూ వ్యాఖ్యానించారంటూ ఉన్నతాధికారులకు సిబ్బంది ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా బాధితురాలు అఖిల నుంచి ఆమె కుటుంబసభ్యులు జరిగిన విషయాన్ని తెలుసుకొని సోమవారం కొత్తగూడెం ఎక్సైజ్ కార్యాలయాన్ని చేరుకున్నారు. అధికారులను, అక్కడి సిబ్బందిని నిలదీశారు. అయితే సీఐ జయశ్రీ కార్యాలయానికి రాకపోవడంతో వారు మరోసారి మంగళవారం కార్యాలయానికి వచ్చి నిలదీశారు. కాగా అఖిల సహా మొత్తంగా కార్యాలయంలోని పదిమంది కానిస్టేబుళ్లు సీఐ జయశ్రీ నుంచి వేధింపులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు బాధితులంతా కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్యకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో కానిస్టేబుళ్లను పిలిపించి వారి వద్ద నుంచి ఈఎస్ వివరాలు సేకరించారు. బాధిత మహిళ కానిస్టేబుళ్లకు అండగా నిలిచేందుకు బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషనరీ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు కరీం కొత్తగూడెం చేరుకుని సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఈఎస్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని బాధితులకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కాగా విధి నిర్వహణపరంగా తన మాటలు సిబ్బందిని బాధపెట్టి ఉండొచ్చునని.. అయితే తాను ఎవర్నీ ఉద్దేశపూర్వకంగా అన్న మాటలు కావని సీఐ జయశ్రీ పేర్కొన్నారు.

ప్రతి యువకుడి కథ



శ్రీవిష్ణు కథానాయకుడిగా ఒక సినిమా తీయనున్నట్టు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ బుధవారం ప్రకటించింది. 'ప్రతి యువకుడి కథ' అనే ట్యాగ్‌లైన్‌తో ఓ పోస్టర్‌ను ఈ సందర్భంగా విడుదల చేసింది. 'అనగనగా'తో ఓటీటీలో అడుగుపెట్టి , ప్రశంసలు పొందిన దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వినోదాత్మక నటనతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా అన్ని రకాల భావోద్వేగాలను పలికించే సామర్థ్యం కలిగిన శ్రీవిష్ణు ఈ చిత్రంలో మరో మంచి పాత్రను పోషించనున్నారు. సున్నితమైన భావోద్వేగాలతో, రోజువారీ జీవితంలోని నిశ్శబ్ద సంఘర్షణలు, ఆశలు, సంతృప్తలను అన్వేషించే కథతో చిత్రాన్ని రూపొందించనున్నారు దర్శకుడు సన్నీ సంజయ్. త్వరలోనే షూటింగ్ మొదలవుతుందని నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు.

ప్రేక్షకులు థ్రిల్ అవుతారు



సుధీర్‌బాబు

'చిన్నప్పుడు మనందరం జానపద, చందమామ కథలు వింటూ పెరిగాం. నిధికి పిశాచి కాపలాగా ఉండే ఓ జానపద కథ ఆధారంగా మా 'జటాధర' చిత్రం రూపుదిద్దుకుంది. ఆ కథను దర్శకుడు ఈ కాలానికి తగ్గట్లు చాలా ఆసక్తిగా మార్చారు. పెద్దతెరపై చూడదగ్గ కథ అనిపించి ఈ సినిమాకు అంగీకారం తెలిపాను. ప్రేక్షకులు థ్రిల్ అవుతారు' అని హీరో సుధీర్‌బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు.

- ఈ సినిమా కథలో దెయ్యాల వేట, కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, శివుని గురించి కథలు... ఇలా విభిన్న అంశాలు మిళితమై ఉంటాయి. నేను దెయ్యాల వేటగాడి పాత్రలో కనిపిస్తాను. ప్రత్యేకంగా డిజైన్ చేసిన పోరాట ఘట్టాలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయి. ఇక ఈ సినిమాలో శివ తాండవం ఎపిసోడ్ ఉంటుంది. శాస్త్రీయ నృత్యంలో నాకు ప్రవేశం లేకపోవడంతో పదిరోజులు సాధన చేసి నటించాను. 'జటాధర' సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఎక్కడా బోర్ కొట్టదు. కథనం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.
- సోనాక్షి చాలా అద్భుతమైన నటి. తను దక్షిణాది అమ్మాయిలానే ఉంటారు. తనలోని నటిని వెలికితెచ్చే పాత్రను ఈ చిత్రంలో పోషించారు.



నిర్మాతగా సంతృప్తినిచ్చిన చిత్రమిది

అల్లు అరవింద్

'సినిమాల ద్వారా నిర్మాతగా కోట్ల రూపాయలు సంపాదించాను. అందులో దాపరికం ఏమీ లేదు. అయితే 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ద్వారా నేను సంపాదించాలనుకుంటున్నది డబ్బు కాదు... సంతృప్తి. ఇలాంటి ఒక మంచి సినిమాను నిర్మించాననే అనుభూతి వెలలేని సంతృప్తినిస్తోంది' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'రాహుల్ లాంటి సున్నిత మనస్కుడు మాత్రమే ఇలాంటి సినిమాను రూపొందించగలరు. ఎన్ని పాటలున్నాయి, ఎన్ని జోక్స్ ఉన్నాయి, ఎంత ఎంటర్‌టైన్‌మెంట్ ఉందని చూసే సినిమా కాదిది. అతి సున్నితంగా సాగే ఈ సినిమా చివరకు అతి ఘాటుగా ముగుస్తుంది. ఈ సినిమా చూసిన రోజు రాత్రి చాలా మంది నిద్రపోలేరు. అంతగా ఈ కథ వారిని వెంటాడుతుంది. రష్మిక తన పాత్రలో జీవించారు' అని చెప్పారు. రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో ఒక అందమైన ప్రయాణంగా 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం మిగిలిపోతుంది. నిర్మాతల సహకారం వల్లే మంచి అవుట్‌పుట్ వచ్చింది. రష్మిక లేకుంటే ఈ సినిమా లేదు. ఆమె ఎన్నో పురస్కారాలకు అర్హురాలు' అని అన్నారు. ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'రాహుల్‌తో మరిన్ని సినిమాలు చేయాలనుంది. సినిమా నిర్మాణంలో మాకు ఏ కష్టం వచ్చినా అరవింద్ గారు చూసుకుంటారనే భరోసా మమ్మల్ని ముందుకు నడిపించింది' అని చెప్పారు.

కమల్ హాసన్ నిర్మాతగా రజనీకాంత్ కొత్త చిత్రం



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా కమల్ హాసన్ ఓ చిత్రం నిర్మించనున్నారు. ఈ విషయాన్ని బుధవారం కమల్ హాసన్ ప్రకటించారు. కమల్‌హాసన్ చిత్ర నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ మూవీస్ ఇంటర్నేషనల్ నిర్మించనున్న ఈ చిత్రానికి సుందర్.సి దర్శకత్వం వహించనున్నారు. 2027 సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు కమల్ హాసన్ తన ఎక్స్ పేజీలో... 'గాలిలా వానలా నదిలా పొంగిపోతాము, సంతోష పడతాము, జీవిస్తాము! రాజ్‌కమల్ మూవీస్ ఇంటర్నేషనల్ నిర్మాణంలో సుందర్.సి దర్శకత్వంలో నా ప్రియ స్నేహితుడు రజనీకాంత్ నటించనున్న 'తలైవర్ 173' అంటూ పోస్ట్ చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



భావోద్వేగానికి గురిచేస్తుంది

మంచు మనోజ్



'ఓ పల్లెటూరిలో జరిగిన సంఘటన ఆధారంగా రాసుకున్న కథతో హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఫీల్ గుడ్ సినిమాలా మొదలై ముగింపులో భావోద్వేగానికి గురిచేస్తుంది' అని మంచు మనోజ్ అన్నారు. ఈ చిత్రంలో హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన ఓ ప్రేమగీతాన్ని ఆయన విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అఖిల్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రమిది. దర్శకుడు వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి సంయుక్తంగా నిర్మించారు. డా. నాగేశ్వర రావు పూజారి సమర్పిస్తున్నారు. ఈ నెల 21న బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు.

మూడు జంటల ప్రేమకథ



రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న 'పిఠాపురంలో' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. మహేశ్‌చంద్ర దర్శకత్వంలో దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేశ్, ఎఫ్ఎం మురళీ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్‌చంద్ర మాట్లాడుతూ 'మూడు జంటల ప్రేమకథగా ఈ చిత్రాన్ని రూపొందించాం. పిఠాపురం నేపథ్యంలో సినిమా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 20 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో ఆరు రోజులు షూటింగ్ చేశాం' అని చెప్పారు.

'కుంభమేళా' మోనాలిసా తెలుగు చిత్రం



విశాలమైన కనులతో కుంభమేళాలో పూసలు అమ్ముతూ సోషల్ మీడియా ద్వారా అందరినీ ఆకట్టుకున్న మోనాలిసా టాలీవుడ్ కథానాయికగా మారారు. శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'లైఫ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. బుధవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. నటుడు సురేశ్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత డీఎస్‌రావు కెమెరా స్విచ్చాన్ చేశారు. శివన్నారాయణ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత అంజన్న మాట్లాడుతూ 'సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితాల్లోని సంఘర్షణ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రమిది. సినిమాకు మంచి ప్రచారం జరుగుతుంది, హైప్ వస్తుంది అని భావించి మోనాలిసాను హీరోయిన్‌గా ఎంపిక చేశాం' అని చెప్పారు.











బిహార్‌లోని చనుపటియాలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీతో కలిసి బహిరంగ సభలో పాల్గొన్న మంత్రి పొంగులేటి.

ఎన్డీయే హామీలు బూటకం

ఒక్కసారి మహాగఠ్‌బంధన్‌కు అవకాశం ఇవ్వండి.. తెలంగాణ మోడల్ పాలన అందిస్తాం

బిహార్ ఓటర్లకు మంత్రి పొంగులేటి పిలుపు.. ప్రియాంకతో కలిసి ఎన్నికల ప్రచారం

పాట్నా, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల పాటు అవినీతి, అక్రమాలు, అవకాశ వాద రాజకీయాలతో బిహార్‌లో అభివృద్ధి కుంటుపడిందని బిహార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఎన్డీయే కోటి వరాల హామీలు బూటకమని, ఒక్కసారి మహాగఠ్‌బంధన్‌కు అవకాశం ఇవ్వాలని బిహార్ ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. బిహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లా చనుపటియా నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీతో కలిసి భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి ప్రసంగిస్తూ ఎన్డీయే కూటమికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే అలవికాని హామీలను ఇస్తుందన్నారు. 20 ఏళ్ల పాటు అధికారంలో ఉండి యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని పొంగులేటి డిమాండ్ చేశారు. ఎంతమంది దీదీలను లక్షాధికారులుగా చేశారో చెప్పాలన్నారు. మహాగఠ్‌బంధన్‌ను గెలిపిస్తే తెలంగాణ మోడల్ పాలనను బిహార్‌లో అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతను ఇస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని పొంగులేటి వివరించారు. రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయిలకే సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి హామీలను అమలు చేస్తున్నామన్నారు. బిహార్ ప్రజలు ఈసారి విజ్ఞతతో ఆలోచించి మహాగఠ్‌బంధన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మహాగఠ్‌బంధన్‌ను గెలిపిస్తే యువకుడైన తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్న విషయాన్ని ప్రకటించలేని దుస్థితిలో ఉందని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ బహిరంగ సభలో బిహార్ రాష్ట్ర ఇంచార్జ్ కృష్ణ అల్వర్, ఎంజీబీ అభ్యర్థి అభిషేక్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామా.. అరకొర ధీమా

పెండింగ్‌లో 9 లక్షలకు పైగా దరఖాస్తులు.. ఇప్పటిదాకా క్రమబద్ధీకరించినవి 5 వేలే!

- అఫిడవిట్ తప్పనిసరా కాదా అనే అంశంపై రాతపూర్వకంగా స్పష్టత ఇవ్వని సీసీఎల్ఏ
- పంచనామా చేసి పని పూర్తి చేయాలన్నా.. కొర్రీలు వేసి పెండింగ్ పెడుతున్న అధికారులు

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం నత్తనడకన సాగుతోంది. క్రమబద్ధీకరణ చేయాలంటే అఫిడవిట్ తేవాల్సిందేనని అధికారులు చెబుతుండటంతో ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అఫిడవిట్ తప్పనిసరి కాదని.. పంచనామా ద్వారా గ్రామంలో సంతకాలు సేకరించి.. క్రమబద్ధీకరణ చేయాలని సీసీఎల్ఏ అధికారులు ఆదేశించినా.. రాత పూర్వకంగా ఆదేశాలు రాలేదనే సాకుతో సమస్య పరిష్కారానికి తహసీల్దార్లే మోకాలడ్డుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్నిచోట్ల తండ్రి అఫిడవిట్ ఇచ్చినా వారసులు సంతకాలు పెట్టెందుకు సహకరించని పరిస్థితి ఎదురవుతోంది. దీంతోపాటు సాంకేతిక సమస్యలు కూడా అడ్డంకిగా మారుతున్నాయి. సీసీఎల్ఏ ఇచ్చిన సాఫ్ట్‌వేర్‌లో భూమి విక్రయించిన వ్యక్తి ఇంటి పేరు.. కొనుగోలుదారు ఇంటి పేరుగా వస్తోంది. ఈ సాంకేతిక లోపాన్ని సరిదిద్దాలని తహసీల్దార్లు సీసీఎల్ఏ కార్యాలయానికి ప్రతిపాదించినా ఇంకా సమస్య పరిష్కారం కాలేదని చెబుతున్నారు. సాదాబైనామా కింద విక్రయం చేసిన వ్యక్తి పేరు ఆన్‌లైన్‌లో లేకపోయినా, చనిపోయినా.. ఆన్‌లైన్‌లో ఆ వివరాల నమోదుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు వాపోతున్నారు. ఒకవేళ బతికి ఉంటే.. ఆ వ్యక్తి ఆధార్ నంబరు నమోదు చేస్తే తప్ప.. విక్రయదారుని వివరాల నమోదుకు వీలుకాని పరిస్థితి. ఒకే సర్వే నంబరులో ఉన్న భూమిని ఒకరి కంటే ఎక్కువ మంది పేరుతో సాదాబైనామా చేసిన కేసులను పరిశీలించకుండా పక్కన పడేస్తున్నారు. నవంబరు 5 నాటికి సాదాబైనామా దరఖాస్తుల పరిస్థితిని పరిశీలిస్తే.. మొత్తం 9,00,880 దరఖాస్తులకు గాను 8,99,032 దరఖాస్తులకు నోటీసులు జారీ చేశారు. 1848 దరఖాస్తులకు నోటీసులు ఇవ్వాల్సి ఉంది. మొత్తం దరఖాస్తుల్లో తహసీల్దార్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు పంపినవి 32,030. ఇందులో ఆమోదించిన దరఖాస్తులు కేవలం 5,295. పెండింగ్‌లో పెట్టినవి 26,735 ఉన్నాయి. తహసీల్దార్ నుంచి ఆర్డీవోకు వెళ్లిన దరఖాస్తుల్లో కేవలం 17 శాతమే ఆమోదించారు. 8,99,032 నోటీసులిచ్చిన అధికారులు.. కేవలం 4% దరఖాస్తులే(32030) తహసీల్దార్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు పంపారు.



అత్యధికం.. ఖమ్మం జిల్లా నుంచే

సాదాబైనామాకు సంబంధించిన దరఖాస్తుల్లో ఒక్క ఖమ్మం జిల్లా నుంచే అత్యధికంగా 1,11,442 దరఖాస్తులు వచ్చాయి. ఈ జిల్లాలో తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు వెళ్లిన దరఖాస్తులు కేవలం 51. ఇందులో ఏ ఒక్క దరఖాస్తునూ ఇప్పటి వరకూ ఆమోదించలేదు. సూర్యాపేట జిల్లాలో 81,626 దరఖాస్తులు రాగా తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీవోకు పంపినవి 491. వాటిలో 65 దరఖాస్తులను ఆమోదించగా 426 పెండింగ్‌లో పెట్టారు. ఒక్క దరఖాస్తు కూడా ఆమోదించని జిల్లాల జాబితాలో రంగారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, వికారాబాద్, నిర్మల్, హనుమకొండ, వరంగల్, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, భద్రాది కొత్తగూడెం, ములుగు, మేడ్చల్ మల్కాజ్‌గిరి, పెద్దపల్లి, కుమ్రంభీం అసిఫాబాద్, ఖమ్మం ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 5,541 దరఖాస్తులు రాగా అందులో తహసీల్దార్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు వెళ్లినవి 69. వరంగల్ జిల్లాలో 53,996 దరఖాస్తులకు గాను కేవలం ఒకే ఒక్క దరఖాస్తు తహసీల్దార్ నుంచి ఆర్డీవోకి వెళ్లింది. అది కూడా పెండింగ్‌లోనే ఉంది. సిద్దిపేట జిల్లాలో 44,583 దరఖాస్తులు రాగా.. అత్యధికంగా 11,652 దరఖాస్తులు తహసీల్దార్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు వెళ్లాయి. వాటిలో 8832 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు.. 2,820 దరఖాస్తులను ఆమోదించారు. అత్యధిక సాదాబైనామా దరఖాస్తులు ఆమోదించిన జిల్లా ఇదొక్కటే. దీని తరువాత స్థానంలో సంగారెడ్డి జిల్లా (దరఖాస్తులు 8,446; ఆమోదించినవి 2,550) ఉంది.



మణికొండలో హైడ్రాకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

హైడ్రాకు కాలనీలు, బస్తీల మద్దతు

- ర్యాలీలు, ప్లకార్డులతో అనుకూల ప్రదర్శనలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హైడ్రాకు మద్దతుగా పలు బస్తీలు, కాలనీల ప్రజలు ప్రదర్శనలు చేపట్టారు. మణికొండ మర్రిచెట్టువద్ద 15 కాలనీల ప్రజలు ర్యాలీ నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీలో వెయ్యికోట్ల రూపాయల విలువైన పార్కులు కాపాడి నగర ప్రజలకు ప్రాణ వాయువును అందించారంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నెక్నాంపూర్ విలేజ్, తిరుమల హిల్స్ నుంచి స్థానికులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఖాజాగూడ ప్రశాంతిహిల్స్‌లో హైడ్రా కాపాడిన పార్కుల్లో మొక్కలు నాటారు. కొండాపూర్‌లోని రాఘవేంద్రకాలనీలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్స్ కాలనీలో 4300 గజాల ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడారంటూ ర్యాలీ నిర్వహించారు. రాఘవేంద్రకాలనీలో 2 వేల గజాల పార్కును కాపాడినందుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. హైడ్రాపై దుష్ప్రచారం వద్దని, కూల్చివేతల న్యూసెన్స్ హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం తగదన్నారు. దశాబ్దాల సమస్యలను గంటలు, రోజుల్లో పరిష్కరించే సత్తా హైడ్రాకు ఉందంటూ ప్రశంసలు కురిపించారు.

లింక్ తెరిస్తే వాట్సాప్ హ్యాక్

- ఏపీకే ఫైళ్లతో జర జాగ్రత్త: సైబర్ సెక్యూరిటీ బ్యూరో

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్‌లో వచ్చే ఏపీకే ఫైళ్లను తెరవొద్దని సైబర్‌సెక్యూరిటీబ్యూరో ప్రజలకు సూచించింది. వాట్సాప్ సందేశాల ద్వారా హ్యాకింగ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది.వాట్సాప్‌లో వచ్చే ఏపీకే లింకుల గురించి ఏ సమాచారం తెలిసినా 1930నంబర్‌కు కాల్ చేయాలని కోరింది.

'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్' నూతన కౌన్సిల్ ఏర్పాటు

- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లపై నియంత్రణ కోసం ప్రభుత్వం నూతన 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ కౌన్సిల్'ను ఏర్పాటు చేసింది. గత కౌన్సిల్ పదవీకాలం ఈ ఏడాది జూన్‌లో ముగియడంతో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్- 2010 ప్రకారం ఈ కౌన్సిల్‌ను పునర్ వ్యవస్థీకరిస్తూ వైద్యారోగ్య శాఖ తాజాగా జీవో నెం. 173 జారీ చేసింది. ఈ కౌన్సిల్ సభ్యులు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. కౌన్సిల్‌కు హెల్త్ సెక్రటరీ ఎక్స్-అఫీషియో ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తుండగా, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ), పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ (డీహెచ్) మెంబర్ సెక్రటరీలుగా ఉంటారు. వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ గుండగాని శ్రీనివాస్‌ను అధికారులు నియమించారు. సభ్యులుగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్, రాష్ట్ర మెడికల్, డెంటల్, నర్సింగ్, ఫార్మసీ కౌన్సిళ్ల ప్రతినిధులు, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ దయాళ్‌సింగ్, అడ్వకేట్ కె.గౌరీశంకర్ రావు, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌కు చెందిన ముజ్తబా హసన్ అస్కారీతో సహా పలువురికి చోటు కల్పించారు. రాష్ట్రంలోని క్లినికల్ సంస్థల రిజిస్ట్రేషన్, వాటి పనితీరును పర్యవేక్షించడం, నిబంధనలు సరిగ్గా అమలయ్యేలా చూడటం వంటి బాధ్యతలను ఈ కౌన్సిల్ నిర్వర్తిస్తుంది.

రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలి

- విద్యాసంస్థలు మూసివేసినా కనీస పట్టింపు లేదు
- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు

న్యూఢిల్లీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేని రీతిలో 2,500కి పైగా విద్యాసంస్థలు మూసివేసి నిరసన తెలిపినా.. రేవంత్ ప్రభుత్వానికి కనీస పట్టింపు లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో విద్యారంగం అధోగతి పాలైందని బుధవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.10,500 కోట్ల బకాయిల్లో.. కళాశాలలు సగం మొత్తాన్ని మాత్రమే అడుగుతున్నాయన్నారు. ఆ నిధులు కూడా విడుదల చేయకుండా.. రాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీ సానుభూతిపరులతో అర్థం పర్థం లేని ఓ కమిటీని ఏర్పాటు చేసిందని ఎద్దేవా చేశారు. కమిటీని ఏర్పాటు చేయాలనుకుంటే రూ.1200 కోట్ల బిల్లుల కోసం టోకెన్లను ఎందుకు జారీ చేశారని బండి సంజయ్ ప్రశ్నించారు. డబ్బులను విడుదల చేసే ఉద్దేశమే లేనప్పుడు దసరా నాటికి రూ.600 కోట్లు విడుదల చేస్తామని ఎందుకు ప్రకటించారని నిలదీశారు.

చిన్న విషయానికి ఇంత రాద్ధాంతమా?!

- పర్వతగిరి గురుకులం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లపై వరంగల్ కలెక్టర్ ఆగ్రహం
- విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులతో సంప్రదింపులు
- మరో గురుకులంలో చదివిస్తామని వెల్లడి

పర్వతగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'పాము కనిపించిందని చెప్పినందుకు విద్యార్థినిని గురుకులం నుంచి గెంటేశారు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తాకథనంపై స్పందన లభించింది. చిన్న విషయానికి రాద్ధాంతం చేసి, విద్యార్థినిని చదువుకు దూరం చేస్తారా? అని పర్వతగిరి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వాతిలపై వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద ఆగ్రహం వ్యక్తం చేశారు. మానసిక పరిస్థితి సరిగ్గా లేదని విద్యార్థినిని గురుకులానికి రానివ్వకుండా చేయడం సరి కాదని స్పష్టం చేశారు. విద్యార్థిని శివానీ, ఆమె తల్లిదండ్రులు వల్లందాసు స్వప్న, నాగరాజులను బుధవారం పిలిపించుకున్న సత్య శారద.. పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి ఆధ్వర్యంలో విచారించారు.. 4 నెలలుగా ఆమెకు చదువును దూరం చేసిన విషయమై ఆరా తీశారు. ఆ శివానీకి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆమె మానసిక పరిస్థితి తెలుసుకున్నారు. శివానీని చదివించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ఆమెకు, ఆమె తల్లిదండ్రులకు హామీనిచ్చారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే దుగ్గొండిలో గానీ, మరో గురుకులంలో సీటు ఇప్పిస్తానని చెప్పారు. తాను పర్వతగిరి గురుకులంలోనే చదువుతానని శివానీ చెప్పడంతో 10 రోజులు వేచి చూడాలని, నచ్చకపోతే చెప్పాలని శివానీకి కలెక్టర్ తెలిపారు. ఏ ఇబ్బందులు ఉన్నా తనకు చెప్పాలని కలెక్టర్ ఆదేశించడంతో శివానీ, ఆమె తల్లిదండ్రులు గ్రామానికి చేరుకున్నారు. మరో వైపు, పోలీసు నిఘా వర్గాలు.. పలువురు విద్యార్థులనడిగి గురుకులం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తీరుపై ఆరా తీశాయి. తమ కూతురు చదువును అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా చూసిన ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలపడంతోపాటు తాము రుణపడి ఉంటామని శివానీ తల్లిదండ్రులు తెలిపారు.

ఫార్మాసిటీ భూముల్లో లైఫ్‌సైన్సెస్ హబ్ ఏర్పాటుకు సన్నాహాలు

- రోడ్డు మరమ్మతుకు టెండర్లు పిలిచిన ప్రభుత్వం

యాచారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ కోసం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో సేకరించిన భూముల్లో లైఫ్ సైన్సెస్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మేడిపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న ఈ హబ్‌కు రోడ్ల కనెక్టివిటీని అభివృద్ధి చేయనుంది. నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి తక్కళ్లపల్లి గేట్ నుంచి మేడిపల్లి ఫార్మా భూముల వరకు 15 కిలోమీటర్ల మేర రోడ్డు వేయడానికి ప్రభుత్వం ఇటీవల టీజీఐఐసీ అధికారుల పర్యవేక్షణలో టెండర్లు పిలిచింది. ఇందుకుగాను రూ. 24.46 కోట్ల నిధులను కేటాయించింది. ఈ నెల 12 వరకు టెండర్లు దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును వెడల్పు చేయడానికి చర్యలు తీసుకుంటోంది. మేడిపల్లి గ్రామంలో ఇప్పటికే సేకరించిన భూముల్లో అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నారు. ఆరు నెలల వ్యవధిలో రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా ఈ భూముల్లో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయడానికి కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బయో మెడికల్ పరిశోధన కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

లోక్ అదాలత్ అవార్డు చట్టబద్ధంగా ఉండాలి:

- రాజీ ఒప్పందం రికార్డు చేసి ఆర్డర్ ఇవ్వాలి: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్ అవార్డు జారీ చేసే ముందు సంబంధిత కోర్టు తగిన కసరత్తు చేయడంతోపాటు కక్షిదారులంతా వ్యక్తిగతంగా హాజరయ్యారా? వారి గుర్తింపు ఏంటి? కక్షిదారుల తరఫున జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) హోల్డర్లు హాజరైనా అసలు కక్షిదారులకు నోటీసులు అందాయా.. అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని హైకోర్టు పేర్కొంది. అలాగే వ్యక్తిగతంగా హాజరైన కక్షిదారుల సమక్షంలో రాజీ ఒప్పందం రికార్డు చేసి ప్రత్యేకంగా ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్-1987 నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఓ లోక్‌అదాలత్ అవార్డును కొట్టేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఓ సివిల్ వివాదానికి సంబంధించి తమకు తెలియకుండా, నోటీసు ఇవ్వకుండా.. లోక్‌అదాలత్ అవార్డుపై తేదీ లేకుండా కుషాయిగూడలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జూనియర్ సివిల్ జడ్జి జారీ చేసిన లోక్‌అదాలత్ అవార్డును కొట్టేయాలని కోరుతూ కె.కల్యాణి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. 'ఏ సందర్భాల్లో లోక్ అదాలత్ కేసును విచారణకు స్వీకరించాలి? రాజీ ఒప్పందం, లోక్ అదాలత్ అవార్డు జారీ చేయడానికి ఏ విధానం పాటించాలో తెలుపుతూ చట్టంలో స్పష్టమైన నిబంధనలున్నాయి. అవార్డు జారీ చేయడానికి ముందు పార్టీల మధ్య రాజీ ఒప్పందం రికార్డు చేసి ఆర్డర్ ఇవ్వాలి. చివరగా.. అసలు కక్షిదారులు సంతకాలు చేశారా.. చూసుకోవాలి' అని ధర్మాసనం పేర్కొంది.

వందశాతం స్ట్రైక్ రేట్‌తో గెలుస్తాం

- నాకు ఇచ్చిన మంత్రిత్వ శాఖలతో సంతృప్తిగానే ఉన్నా..
- మంత్రి అజారుద్దీన్

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యమని రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ విమర్శించారు. ఉప ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేట్‌తో కాంగ్రెస్ విజయం సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసే పని చేస్తున్నాయన్నారు. జూబ్లీహిల్స్‌లోని మైనార్టీలు కాంగ్రెస్ వెంటే ఉన్నారన్నారు. నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ నియోజకవర్గ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అజారుద్దీన్ మాట్లాడుతూ తనను నమ్మి మంత్రి పదవి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నానన్నారు. తనకు కేటాయించిన శాఖలతో తాను సంతృప్తిగానే ఉన్నానని చెప్పారు. తన శాఖలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు వచ్చే విధంగా వంద శాతం కృషి చేస్తానన్నారు. హైదరాబాద్ క్రికెట్ కోసం తాను చాలా కృషి చేశానని, తనపై ఆరోపణలు సరికాదన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ముస్లింల కోసం ఏం చేశారో చెప్పాలంటూ కేసీఆర్, కేటీఆర్‌లను డిమాండ్ చేశారు.



ముస్లింలపై కేటీఆర్ మొసలి కన్నీరు: టీపీసీసీ

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ముస్లింలపై మొసలి కన్నీరు కారుస్తున్న కేటీఆర్.. బీఆర్ఎస్ హయాంలో సచివాలయంలోని మసీదును ఎందుకు కూలగొట్టారో చెప్పాలని టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. మసీదును కూలగొట్టిన కేటీఆర్‌కు ముస్లిం సోదరులు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేకనే బుల్డోజర్ పేరుతో కేటీఆర్ కొత్త నాటకం ఆడుతున్నారన్నారు.

'పక్కా లెక్క'లతో బెట్టింగ్!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సర్వేలు చేయించుకుంటున్న బెట్టింగ్ రాయుళ్లు

- స్థానిక బంధువులకు ఏపీ వాసుల ఫోన్లు
- కోట్లలో పందేలు కాసేందుకు ప్రణాళిక
- 500కోట్ల మేర బెట్టింగ్ జరిగినట్టు అంచనా
- ఫలితాల నాటికి రూ.1200 కోట్లకు పెరిగే చాన్స్



బంజారాహిల్స్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎవరు గెలుస్తారు? అన్నది వందల కోట్ల రూపాయల ప్రశ్నగా మారింది. ఇటు తెలంగాణతోపాటు అటు ఏపీలోనూ ఈ అంశంపై జోరుగా బెట్టింగ్ సాగుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎవరు గెలుస్తారు? ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడతాయి? ఓటర్లు ఏ అభ్యర్థి వైపు సానుకూలంగా ఉన్నారు? సర్వేలు ఎవరికి అనుకూలంగా ఉన్నాయి? ఏ పార్టీ ఎంత ఖర్చు చేస్తోంది? ఇలా అనేక రకాలుగా లెక్కలు వేసుకుంటూ బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇందుకోసం కొందరు సొంతంగా సర్వేలు చేయించుకుంటున్నారు. ఇప్పటికే సుమారుగా రూ.500కోట్ల మేర పందేలు కాసినట్టు తెలుస్తోంది. మరో వారంలో ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వాస్తవానికి ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచే బెట్టింగ్ మొదలైంది. అభ్యర్థుల ఖరారు పూర్తి కాకముందే సుమారు రూ.50 కోట్ల మేరకు బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. అభ్యర్థుల ప్రకటన తర్వాత అధికార పార్టీ అభ్యర్థికి భారీ మెజారిటీ వస్తుందన్న అంచనాతో పందేలు కాశారు. నామినేషన్లు పూర్తయ్యాక మెజారిటీ కన్నా ఎవరు విజయం సాధిస్తారనే దానిపై బెట్టింగ్ నడుస్తోంది. ఇప్పటికే రూ.500 కోట్లకుపైనే బెట్టింగ్ జరిగినట్లు తెలుస్తుండగా.. పోలింగ్ తేదీ నాటికి ఇది రెండింతలు అవుతుందని, ఫలితాల వెలువడే నాటికి రూ.1200 కోట్లకు చేరినా ఆశ్చర్యపోనవసరం లేదని ఓ బెట్టింగ్ రాయుడు చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్, మణికొండతో పాటు ఖమ్మం, సూర్యాపేట జిల్లాల ప్రజలు, ఏపీలోని విజయవాడ, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన వారు బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్లు తెలిసింది. ఏపీకి చెందిన వారు ఎప్పటికప్పుడు హైదరాబాద్‌లో ఉంటున్న బంధువులకు ఫోన్లు చేసి, పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. దానికి తగ్గట్టుగా పందేలు కాస్తున్నారు. నోటిఫికేషన్ విడుదలైన తొలినాళ్లలో ఓ పార్టీ తరఫున రూ.10కడితే రూ.100 ఇస్తామంటూ బెట్టింగ్ నిర్వాహకులు ప్రచారం చేశారు. నామినేషన్లు వేసిన తర్వాత ఓ పార్టీపై రూ.10కి రూ.60, మరో పార్టీపై రూ.10కి రూ.30చొప్పున బెట్టింగ్ నడుస్తున్నట్లు చెబుతున్నారు.

ప్రత్యేకంగా సర్వేలు చేయిస్తూ..

పక్కా లెక్కలతో బెట్టింగ్‌లో డబ్బు పెట్టేందుకు కొంత మంది ఓ బృందంలా ఏర్పడి ప్రైవేటు సర్వేలు చేయించుకుంటున్నారు. పలు సంస్థలను ఆశ్రయించి పక్కా నివేదికలు సిద్ధం చేయించుకుంటున్నారు. ఇలాంటి సర్వేలకు ఆయా ఏజెన్సీలు రూ.70వేల నుంచి రూ.లక్ష తీసుకుంటున్నాయి. మరీ పెద్ద ఏజెన్సీ అయితే రూ.2లక్షలు ఉంటుంది. ఈ చిన్నపాటి ఖర్చుతో ప్లానింగ్ చేసుకుంటే ఏకంగా కోట్లాది రూపాయలు కొల్లగొట్టవచ్చని బెట్టింగ్ రాయుళ్లు భావిస్తున్నారు. మొత్తంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. ప్రజలకే కాదు బెట్టింగ్ రాయుళ్లకు చెమటలు పట్టిస్తోంది.

ఎన్నికలు అక్కడ.. ఓటర్లు ఇక్కడ!

కొల్లూరులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వారికి వరంగా మారిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

- జూబ్లీహిల్స్‌కు చెందిన 3 వేల మందికి గతంలోనే కొల్లూరులో 'డబుల్' ఇళ్లు
- అక్కడ కోడ్ లేపోవడంతో మంత్రుల హామీలు.. 24 గంటల్లోనే కార్యరూపం
- 10 రేషన్ దుకాణాలు ప్రారంభం
- 4 అంబులెన్స్‌లు.. ఆర్టీసీ బస్సుల ఏర్పాటు

రామచంద్రాపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రావడం.. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో నివాసముంటున్న వారికి వరంగా మారింది. జూబ్లీహిల్స్‌కు చెందిన పలు కుటుంబాలకు గతంలో సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని కొల్లూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేశారు. దీంతో వారంతా ఆ ప్రాంతానికి వెళ్లి నివాసముంటున్నారు. ఈ కుటుంబాలన్నింట్లో కలిపి సుమారు 3వేల మంది ఓటర్లు ఉన్నారు. అయితే కొల్లూరులోని ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో కనీస సదుపాయాలు లేక వారంతా ఇబ్బందులు పడుతున్నారు. విద్య, వైద్యం, రేషన్, పోలీస్, రవాణా వంటి సౌకర్యాలేవీ లేవు. పైగా, వీఎస్టీ వారి సీఎస్ఆర్ నిధులు రూ.10 కోట్లతో ఈ ప్రాంగణంలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మించాలని తలపెట్టగా.. మంత్రి, ఎమ్మెల్యే మధ్య ప్రొటోకాల్ వివాదం అడ్డంకిగా మారింది. ఆరు నెలలుగా భవన నిర్మాణానికి అనుమతులు లభించడం లేదు. బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా పట్టించుకోలేదు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఈ ఆటంకాలన్నీ తొలగిపోయాయి. అన్ని సౌకర్యాలూ ఆగమేఘాలపై సమకూరాయి. ఈ నెల 3న



కొల్లూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయానికి కేటాయించిన అంబులెన్స్‌లు

(సోమవారం) మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ ఇక్కడికి వచ్చి.. ఈ పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ.. కొల్లూరు డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో బస్తీ దవాఖానా, అంబులెన్స్‌లు, పోలీస్ ఔట్ పోస్ట్, పది రేషన్ దుకాణాలు, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

24 గంటల్లోనే హామీల అమలు..

మంత్రులు హామీ ఇచ్చిన 24 గంటల్లోనే చాలా వరకు అమలులోకి వచ్చాయి. డబుల్ బెడ్‌రూం ప్రాంగణంలో 10 రేషన్‌దుకాణాలను ప్రారంభించారు. అప్పటికప్పుడు రెండు లారీల బియ్యం వచ్చాయి. రేషన్‌కార్డుల ఆధారంగా బియ్యాన్ని అందజేశారు. 4 అంబులెన్స్‌లు సమకూర్చారు. బస్తీ దవాఖానాకు డాక్టర్ అర్చనారెడ్డికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టీసీ బస్సులు సైతం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రాంగణం మీదుగా వెళ్తున్నాయి. మరోవైపు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా గురువారం కొల్లూరు డబుల్‌బెడ్‌రూంఇళ్ల ప్రాంగణంలో పర్యటించనున్నారు.



విశ్వవిజేతలతో ప్రధాని మోదీ

అమన్‌జోత్ క్యాచ్‌తో ట్రోఫీ కనిపించిందా!

న్యూఢిల్లీ: ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టును ప్రధాని మోదీ బుధవారం తన నివాసంలో కలుసుకున్నారు. టోర్నమెంట్‌లో జట్టు అద్భుతంగా పుంజుకొని విజేతగా నిలిచిన తీరును ఆయన కొనియాడారు. ఫైనల్లో అమన్‌జోత్ పట్టిన అద్భుత క్యాచ్‌తో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు వరల్డ్ కప్ ట్రోఫీ కనిపించి ఉంటుందని ఈ సందర్భంగా మోదీ నవ్వుతూ అన్నారు. 2017 వన్డే వరల్డ్ కప్ అనంతరం మోదీని కలిసిన క్షణాలను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గుర్తు చేసుకొంది. అప్పుడు కప్ లేకుండా ప్రధానిని కలిశామని, ఇప్పుడు ట్రోఫీతో భేటీ అవడం గర్వంగా ఉందని చెప్పింది. నిరంతరం వర్తమానంలో ఎలా ఉండగలుగుతారని ప్రధానిని హర్మన్ ప్రశ్నించింది. అది తన జీవితంలో ఒక భాగమైందని, క్రమంగా అలవాటుగా మారిందని ఆయన బదులిచ్చారు. ఫైనల్ అనంతరం బంతిని హర్మన్ తన జేబులో దాచుకోవడాన్ని గురించి మోదీ సరదాగా అడిగారు. ఆ బంతి తన వద్దకు రావడం అదృష్టమని హర్మన్ తెలిపింది.

దీప్తీశర్మ 'జై శ్రీరామ్' బయో గురించి ప్రస్తావన..

ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ దీప్తీశర్మ.. ఇన్‌స్టాలో 'జైశ్రీరామ్' బయోతో పాటు హనుమాన్ టాటూ గురించి ఆమెను ప్రధాని అడిగారు. ఆ రెండు తనకు ఎంతో బలాన్ని ఇస్తాయని దీప్తీశర్మ తెలిపింది. 'ఫిట్ ఇండియా' సందేశాన్ని బాలికల్లో బాగా ప్రచారం చేయాలని ప్లేయర్లను కోరారు. పాఠశాలలను సందర్శించి బాలబాలికలు క్రీడలపట్ల ఆకర్షితులయ్యేలా స్ఫూర్తి నింపాలని సూచించారు.

చెరగని గుర్తుగా!

● కెప్టెన్ హర్మన్ 'వరల్డ్‌కప్' టాటూ



న్యూఢిల్లీ: భారత మహిళల జట్టుకు తొలి వరల్డ్ కప్ అందించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆ ఘట్టాన్ని చెరగని గుర్తుగా మార్చుకొంది. తన చేతిపై ప్రపంచ కప్ టాటూను వేయించుకొంది. ఈ ఫొటోను ఆమె నెట్‌లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ప్రపంచకప్ ట్రోఫీతోపాటు గెలిచిన సంవత్సరం '2025'తో పాటు ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల విజయాన్ని గుర్తుచేసేలా '52' టాటూపై కనిపిస్తున్నాయి.

త్వరలో ఆటకు వీడ్కోలు

● క్రిస్టియానో రొనాల్డో



న్యూఢిల్లీ: సాకర్ సూపర్‌స్టార్ క్రిస్టియానో రొనాల్డో (40) కెరీర్ ముగింపు దశకు వచ్చినట్టే. త్వరలోనే తాను ఆటకు గుడ్‌బై చెప్పనున్నట్టు ఓ ఇంటర్వ్యూలో రొనాల్డోనే ఈ విషయాన్ని వెల్లడించాడు. కెరీర్‌కు ఎప్పుడు వీడ్కోలు పలుకుతున్నావంటూ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'త్వరలోనే.. అందుకు మానసికంగా సన్నద్ధమవుతున్నా. ఆటను వదిలేయడం చాలా కష్టం. ఆ సమయం వస్తే మాత్రం కన్నీళ్లు ఆపుకోలేను' అని పోర్చుగల్‌కు చెందిన రొనాల్డో తెలిపాడు. ప్రస్తుతం అల్ నాసర్ క్లబ్‌కు ఆడుతున్న రొనాల్డోకు ఆ జట్టుతో 2027 వరకు ఒప్పందం ఉంది.

మూడోరౌండ్‌కు అర్జున్, హరి

పనాజీ: భారత గ్రాండ్ మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణ, వరల్డ్ చాంపియన్ గుకేష్‌తోపాటు దీప్తయన్ ఘోష్‌లు చెస్ వరల్డ్‌కప్ మూడో రౌండ్‌కు చేరుకొన్నారు. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో అర్జున్ 2-0తో మార్టిన్ పెట్రోవ్ (బల్గేరియా)పై, హరి 1.5-0.5తో నెస్టొరోవ్‌పై, గుకేష్ 1.5-0.5తో నోజర్‌బెక్ (కజకిస్థాన్)పై, కార్తీక్ వెంకట్రామన్ 1.5-0.5తో అరవింద్ చిదంబరంపై నెగ్గారు. నెపోమ్నియాచి (రష్యా)పై ఘోష్ సంచలన విజయం సాధించాడు.

పంత్ వచ్చేశాడు

షమికి మొండిచేయి ● దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌కు జట్టు



న్యూఢిల్లీ: వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. దక్షిణాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు బుధవారం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో పంత్‌కు చోటు కల్పించారు. అయితే సుదీర్ఘకాలంగా జట్టులోకి రావాలని చూస్తున్న పేసర్ మహ్మద్ షమికి నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో 35 ఏళ్ల షమి కెరీర్ ముగిసినట్టేనని భావిస్తున్నారు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ 14నుంచి కోల్‌కతాలో జరగనుంది. ఈ టెస్ట్ సిరీస్‌కు ఎన్. జగదీశన్ స్థానంలో పంత్‌కు చోటు దక్కింది. అంతేకాదు రిషభ్‌ను వైస్-కెప్టెన్‌గానూ నియమించారు. భుజం గాయంనుంచి కోలుకున్న బెంగాల్ పేసర్ ఆకాశ్‌దీప్ కూడా సఫారీలతో టెస్ట్ సిరీస్‌కు జట్టులోకి వచ్చాడు. స్పిన్ విభాగం బాధ్యతలను జడేజా, అక్షర్, కుల్దీప్, సుందర్ పంచుకోనున్నారు. కాగా..బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్‌లతో పేస్ బౌలింగ్ బలంగా ఉంది.

భారత టెస్ట్ జట్టు: గిల్ (కెప్టెన్), పంత్ (వైస్-కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, పడిక్కళ్, జురెల్, జడేజా, సుందర్, బుమ్రా, అక్షర్, నితీశ్ రెడ్డి, సిరాజ్, కుల్దీప్, ఆకాశ్‌దీప్.

భారత్ 'ఎ' కెప్టెన్ తిలక్ వర్మ

దక్షిణాఫ్రికా 'ఎ'తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారత్ 'ఎ' జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టుకు హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మను కెప్టెన్‌గా ప్రకటించారు. ఈ మ్యాచ్‌లు ఈనెల 13, 16, 19 తేదీల్లో రాజ్‌కోట్‌లో జరగనున్నాయి.

షమికి ఇక కష్టమేనా?

ఇటీవల మూడు రంజీ మ్యాచ్‌ల్లో బెంగాల్ తరపున 15 వికెట్లతో రాణించిన పేసర్ షమిని సెలెక్టర్లు జట్టు ఎంపికలో పరిగణనలోకి తీసుకోలేదు. కానీ సుదీర్ఘ స్పెల్స్ వేయాల్సిన టెస్ట్‌లకు అతడి శరీరం సహకరించదేమోనన్న అభిప్రాయంలో సెలెక్టర్లు ఉన్నట్టు తెలిసింది. అలాగే తన ఫిట్‌నెస్ గురించి తాజా సమాచారం తెలియజేయాల్సిన బాధ్యత తనది కాదని ఇటీవల షమి వ్యాఖ్యానించడం ప్రతికూలంగా మారినట్టు భావిస్తున్నారు.

పాక్ ఆటగాళ్లతో మేం కరచాలనం చేస్తాం

హాకీ ఇండియా

న్యూఢిల్లీ: భవిష్యత్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌ల సందర్భంగా పాకిస్థాన్ ఆటగాళ్లతో మన జట్టు కరచాలనం చేయకుండా నిరోధించలేమని హాకీ ఇండియా (హెచ్ఐ) స్పష్టంజేసింది. వారితో కరచాలనం చేయవద్దంటూ తమకు ఎవరి నుంచీ ఆదేశాలు లేవని తేల్చింది. ఇటీవల మలేసియాలో జరిగిన సుల్తాన్ జొహార్ కప్ మ్యాచ్ సందర్భంగా పాక్ హాకీ జట్టుతో భారత ఆటగాళ్లు కరచాలనం చేయడంపై వివాదం ఏర్పడిన విషయం విదితమే. భారత పురుషులు, మహిళల జట్లు పాకిస్థాన్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వని నేపథ్యంలో..హాకీ జట్టు అందుకు విరుద్ధంగా ప్రవర్తించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. 'మేం క్రికెట్ నియంత్రణలో లేము. క్రికెటర్లు ఎలా ప్రవర్తిస్తారన్నది వారి ఇష్టం. ఒలింపిక్ చార్టర్‌ను, అంతర్జాతీయ హాకీ సమాఖ్య నిబంధనలను మేం పాటిస్తాం' అని హెచ్ఐ కార్యదర్శి భోలానాథ్ సింగ్ స్పష్టంజేశారు.

కెప్టెన్ జూనియర్లను కొడుతోంది

● బంగ్లా సారథి సుల్తానాపై జట్టు సభ్యురాలి ఆరోపణ



నిగర్ సుల్తానా

ఢాకా: బంగ్లాదేశ్ మహిళా క్రికెట్ కెప్టెన్ నిగర్ సుల్తానా జూనియర్ క్రికెటర్లను తన రూముకి పిలిచిమరీ కొడుతోందని ఆ జట్టు పేస్ బౌలర్ జహనారా ఆలమ్ సంచలన ఆరోపణలు చేసింది. 'ఇది కొత్తేంకాదు. జూనియర్లను కొట్టడం నిగర్‌కు అలవాటే. ఇటీవల ముగిసిన వన్డే వరల్డ్ కప్‌లోనూ నిగర్ తమను పలుమార్లు కొట్టిందని జూనియర్ క్రికెటర్లు నాతో చెప్పారు. ఇటీవలి దుబాయ్ పర్యటనలోనూ ఓ జూనియర్‌ను తన గదికి రప్పించుకొన్న నిగర్ ఆమె చెంప ఛెళ్లుమనిపించింది' అని ఆలమ్ ఆరోపించింది. అయితే జట్టులో చోటు దక్కనందుకే జహనారా ఇలా ఆరోపణలు చేస్తోందని బంగ్లా క్రికెట్ బోర్డు వ్యాఖ్యానించింది.

డ్రగ్స్‌కు బానిస.. సీన్ విలియమ్స్‌పై వేటు

హరారే: మాదక ద్రవ్యాలకు బానిసైన జింబాబ్వే క్రికెట్ మాజీ కెప్టెన్ సీన్ విలియమ్స్(39)పై ఆ దేశ బోర్డు జీవితకాల నిషేధం విధించారు. సెప్టెంబరులో టీ20 వరల్డ్‌కప్ ఆఫ్రికా క్వాలిఫయింగ్ పోటీలకు ముందు సీన్ జట్టు నుంచి తప్పుకోవడానికి కారణాలపై ఆరాతీయగా అతడు డ్రగ్స్‌కు బానిసైన విషయం బయటపడింది.



ప్రాక్టీస్‌లో కెప్టెన్ సూర్య, బుమ్రా

భారత్‌కు భలే చాన్స్!

నేడు ఆస్ట్రేలియాతో నాలుగో టీ20
మ. 1.45 నుంచి

● ఆధిక్యంపై సూర్య సేన గురి
● గిల్ ఫామ్ ఆందోళనకరం

కరార (గోల్డ్‌కోస్ట్): ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో తిరుగులేని ఆధిక్యం దక్కించుకొనేందుకు భారత్‌కు అద్భుత అవకాశం. ఐదు టీ20ల సిరీస్ 1-1తో సమమైన నేపథ్యంలో గురువారం జరిగే నాలుగో మ్యాచ్‌లో గెలిచి టీమిండియా సిరీస్ కోల్పోని స్థితిలో నిలవాలనుకొంటోంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్, పేసర్ హాజెల్‌వుడ్ సిరీస్‌కు దూరమైన నేపథ్యంలో కంగారూల పనిపట్టడానికి సూర్యకుమార్ సేనకు ఇదో మంచి చాన్స్. అయితే, మూడో టీ20లో విజయంతో జోష్ మీదున్న భారత్‌కు ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వరుస వైఫల్యాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత ఆరు మ్యాచ్‌ల్లో గిల్ ఒక్క అర్ధ శతకం కూడా సాధించలేదు. ఫుల్లర్ డెలివరీలు ఆడేందుకు గిల్ ఇబ్బంది పడుతున్నాడు. వికెట్ల ముందు దొరికిపోవడం అతడి ప్రధాన బలహీనతగా మారింది. మరోవైపు అభిషేక్ శర్మ తనదైన శైలిలో అదరగొడుతున్నాడు. గిల్ అతడికి ఏమాత్రం సరితూగడం లేదు. కెప్టెన్ సూర్యకుమార్ మెరుగ్గానే ఆరంభిస్తున్నా..భారీస్కోర్లు చేయడంలో విఫలమవుతున్నాడు. తిలక్ వర్మ, సుందర్ నమ్మదగ్గ ప్లేయర్లుగా ఎదుగుతున్నారు. ఈ మ్యాచ్‌కు కూడా శాంసన్ స్థానంలో జితేశ్ శర్మకు కీపింగ్ బాధ్యతలు అప్పగించే చాన్సులున్నాయి. ఆల్‌రౌండర్ శివం దూబేతోపాటు అర్ష్‌దీప్, బుమ్రా పేస్ బౌలింగ్‌ను నడిపించనున్నారు. మరోవైపు కెప్టెన్ మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్ దూకుడైన ఆటపై ఆసీస్ ఎక్కువగా ఆధారపడుతోంది. హెడ్ స్థానంలో మాట్ షార్ట్ ఓపెనర్‌గా బరిలోకి దిగనుండగా.. మ్యాక్స్‌వెల్ జట్టులోకి రావడం సానుకూల పరిణామం. అబాట్ బదులు డ్వార్షుయిస్‌కు చాన్స్ దక్కనుంది.

జట్లు (అంచనా)

భారత్: అభిషేక్ శర్మ, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, అక్షర్ పటేల్, సుందర్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), దూబే, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా.

ఆస్ట్రేలియా: మాట్ షార్ట్, మార్ష్ (కెప్టెన్), ఇంగ్లిస్ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, మిచ్ ఓవెన్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, బ్రాట్‌లెట్, బెన్ డ్వార్షుయిస్, నాథన్ ఎల్లీస్, కునేమన్.

అతడికి అంతా తెలుసు: మోర్కెల్

టీ20ల్లో అర్ష్‌దీప్ కీలకమైన బౌలర్. కానీ, అతడికి ఈ టూర్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు టీమ్‌లో చోటుదక్కలేదు. అయితే, మేనేజ్‌మెంట్ ఉద్దేశమేంటో అర్ష్‌దీప్‌కు అర్థమయ్యే ఉంటుందని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. మరో మూడు నెలల్లో జరిగే టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకొని టీమిండియా మేనేజ్‌మెంట్ జట్టును సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఉన్న వనరులను పరీక్షిస్తోంది.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,21,480 ▼	1,11,350 ▼	1,63,000 ▼
విజయవాడ	1,23,000 ▼	1,17,000 ▼	1,50,000 ▲
విశాఖపట్నం	1,23,520 ▼	1,12,250 ▼	1,63,000 ▼
రాజమండ్రి	1,21,470 ▼	1,11,350 ▼	1,47,900 ▼
ప్రొద్దుటూరు	1,20,400 ▼	1,10,770 ▼	1,50,000 ▼
ముంబై	1,20,419 ▼	1,10,304 ▼	1,46,150 ▼

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ లాభాలకు బ్రేక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్) కంపెనీ సెప్టెంబరు త్రైమాసికంలో రూ.188 కోట్ల ఆదాయంపై రూ.20 కోట్ల నికర లాభం నమోదు చేసింది. జూన్ త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 5.6% పెరిగినా, నికర లాభం మాత్రం 3.25% తగ్గింది. అయితే గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలతో పోలిస్తే మాత్రం కంపెనీ రూ.366 కోట్ల ఆదాయంపై రూ.42 కోట్ల నికర లాభం నమోదు చేసింది. ఆదాయం 17.4%, నికర లాభం 14.6% పెరిగాయి.

11న ఫిజిక్స్‌వాలా, ఎమ్వీ ఐపీఓలు

న్యూఢిల్లీ: వచ్చే మంగళవారం (తేదీ 11) రెండు ఐపీఓలు మార్కెట్ తలుపు తట్టనున్నాయి. వాటిలో ఎడ్‌టెక్ రంగంలోని ఫిజిక్స్‌వాలా, సోలార్ ఫొటోవోల్టాయిక్ తయారీదారు ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ లిమిటెడ్ ఉన్నాయి. రెండు ఇష్యూలు 13వ తేదీన ముగుస్తాయి.

- ఈ ఇష్యూ ద్వారా రూ.3,480 కోట్లు సేకరించాలన్నది ఫిజిక్స్‌వాలా లక్ష్యం. ఇందులో రూ.380 కోట్లు ఓఎఫ్ఎస్ విధానంలోనూ, రూ.3,100 తాజా షేర్ల జారీ ద్వారానూ సేకరించనుంది.
- ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ లిమిటెడ్ ఈ ఇష్యూ ద్వారా రూ.2,900 సేకరించనుంది.


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ			
హైదరాబాద్	575	విజయవాడ	585
వరంగల్	577	గోదావరి	590
చిత్తూరు	603	విశాఖపట్నం	575
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	113
కరీంనగర్	107	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	105
కర్నూలు	107	నెల్లూరు	110
విశాఖపట్నం	108	అనంతపురం	110
గోదావరి	109		

వచ్చే జూన్ నాటికి సెన్సెక్స్ 1,00,000



మార్కెట్లో కరెక్షన్ దశ ముగిసింది, ఇక దూకుడే
మోర్గాన్ స్టాన్లీ అంచనా

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్‌లో కరెక్షన్‌కు తెర పడిందనే అంచనాలు వినిపిస్తున్నాయి. మోర్గాన్ స్టాన్లీ వంటి ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు కూడా ఇదే అంచనాకు వస్తున్నాయి. మార్కెట్‌పై బుల్ ఆపరేటర్లు పట్టు బిగించి, పెద్ద అడ్డంకులేమీ లేకపోతే వచ్చే ఏడాది జూన్ నాటికి బీఎస్ఈ సెన్సెక్స్ లక్ష పాయింట్ల మైలురాయిని చేరుకుంటుందని మోర్గాన్ స్టాన్లీ ఒక నివేదికలో అంచనా వేసింది. సెన్సెక్స్ ప్రస్తుత స్థాయితో పోలిస్తే ఇది 16,541 పాయింట్లు ఎక్కువ. ఒక వేళ చిన్నపాటి అడ్డంకులు ఎదురైనా ప్రస్తుత స్థాయి నుంచి 6.6 శాతం వృద్ధితో 89,000 పాయింట్లను తాకడానికి 50 శాతం అవకాశం ఉందని తెలిపింది. తమ అంచనాలు తలకిందులై మార్కెట్‌పై బేర్ పట్టు పెరిగితే మాత్రం సెన్సెక్స్ ఇప్పుడున్న స్థాయి నుంచి 16 శాతం నష్టపోయి 70,000 పాయింట్లకు పడిపోయే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించింది. అయితే వచ్చే ఎనిమిది నెలల్లో భారత స్టాక్ మార్కెట్‌పై బేర్ పట్టుకు 20 శాతం మాత్రమే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ అంచనా.

మారుతున్న పరిస్థితులు: నిన్న మొన్నటి వరకు దేశీయ స్టాక్ మార్కెట్ అనేక ఆటుపోట్లకు లోనైంది. మదుపరులు కూడా ఎంపిక చేసిన కొన్ని మంచి కంపెనీల షేర్లలోనే ఇన్వెస్ట్ చేసే వారు. మారుతున్న స్థూల ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మదుపరుల పెట్టుబడుల వ్యూహం సైతం మారుతోందని మోర్గాన్ స్టాన్లీ నివేదిక తెలిపింది. జీడీపీ వృద్ధితో పాటు అభివృద్ధి పథంలోని కంపెనీల షేర్లపై వారు ఇప్పుడు దృష్టి పెడుతున్నారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ట్రంప్ సుంకాల పోటు భయపెడుతున్నా, మిగతా దేశాలతో పోలిస్తే భారత జీడీపీ వృద్ధి రేటు ఆశాజనకంగా కనిపిస్తోందని ఈ నివేదిక రూపొందించిన మోర్గాన్ స్టాన్లీ ఇండియా ఎండీ, చీఫ్ ఈక్విటీ స్ట్రాటజిస్టు రిథం దేశాయ్, నయంత్ పరేఖ్ తెలిపారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలతో పాటు ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లు, నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) తగ్గించడం, బ్యాంకుల డీ రెగ్యులేషన్, పెరగనున్న లిక్విడిటీ, జీఎస్‌టీ రేట్ల కుదింపు సైతం దేశీయ స్టాక్ మార్కెట్‌కు కలిసి వస్తాయని వీరి అంచనా.

ఇతర సానుకూల అంశాలు : చైనాతో మెరుగుపడుతున్న సంబంధాలు, భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై మెరుగుపతున్న ఆశలు, పెరుగుతున్న ఎగుమతులు, నిలకడగా ఉన్న ముడి చమురు ధరలు, అదుపులో ఉన్న ద్రవ్య లోటు కూడా సెంటిమెంట్‌ను మరింత పెంచుతాయని మోర్గాన్ స్టాన్లీ అంచనా. ఈ సానుకూల అంశాలన్నీ కలిసి కుటుంబాల పొదుపులో ఎక్కువ భాగం స్టాక్ మార్కెట్‌వైపు ఆకర్షించే అవకాశం ఉందని పేర్కొంది.

ఇబ్బందులూ ఉన్నాయ్: సానుకూలాంశాలతో పాటు భారత ఆర్థిక వ్యవస్థ, స్టాక్ మార్కెట్‌కు కొన్ని ప్రతికూల అంశాలూ పొంచి ఉన్నట్టు మోర్గాన్ స్టాన్లీ నివేదిక హెచ్చరించింది. ముఖ్యంగా నీరసిస్తున్న ప్రపంచ వృద్ధిరేటు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు మార్కెట్లకు పొంచి ఉన్న పెద్ద ముప్పు అని తెలిపింది. ఎఫ్‌పీఐల వెనుకంజ కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

మెరిసే కంపెనీల షేర్లు

: దేశీయ స్టాక్ మార్కెట్‌లో బుల్ రన్ ప్రారంభమైతే ఈ కింది కంపెనీల షేర్లు మంచి లాభాలు పంచే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.

- మారుతి సుజుకీ
- ట్రెంట్, టైటాన్
- వరుణ్ బేవరేజెస్
- రిలయన్స్ ఇండస్ట్రీస్
- బజాజ్ ఫైనాన్స్
- ఐసీఐసీఐ బ్యాంక్
- ఎల్ అండ్ టీ
- అల్ట్రాటెక్ సిమెంట్
- కోఫోర్జ్ లిమిటెడ్.

మారుతి 3 కోట్ల అమ్మకాల మైలురాయి

న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ మరో రికార్డును సొంతం చేసుకుంది. కంపెనీ ప్రారంభం నుంచి ఇప్పటికి దేశీయ మార్కెట్లో 3 కోట్ల కార్లను విక్రయించి సరికొత్త మైలురాయిని అధిగమించింది. మొదటి 1 కోటి విక్రయాల మార్కును సాధించడానికి 28 సంవత్సరాల 2 నెలలు పట్టగా, తదుపరి 1 కోటి యూనిట్ల మైలురాయిని 7 సంవత్సరాల 5 నెలల్లో చేరింది. తాజాగా మరో 1 కోటి యూనిట్లు కేవలం 6 సంవత్సరాల 4 నెలల్లోనే విక్రయించినట్లు మారుతి సుజుకీ తెలిపింది. ఈ మూడు కోట్ల అమ్మకాల్లో, ఆల్టో 47 లక్షలకు పైగా యూనిట్లతో అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్‌గా నిలిచింది. వ్యాగన్ ఆర్ (34 లక్షల యూనిట్లు), స్విఫ్ట్ (32 లక్షల యూనిట్లు) కార్లు ఈ విజయంలో కీలక పాత్ర పోషించాయి. 1983 డిసెంబర్‌లో ఐకానిక్ మారుతి 800తో ప్రారంభమైన కంపెనీ ప్రస్థానం, నేడు 19 మోడళ్లలో 170కి పైగా వేరియంట్లతో దేశంలో అగ్రగామిగా కొనసాగుతోంది.

అరబిందో ఫార్మా లాభం రూ.817 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్తమాన ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో స్థానిక అరబిందో ఫార్మా మంచి ఆర్థిక ఫలితాలు సాధించింది.ఈ కాలానికి కంపెనీ రూ.8,286 కోట్ల ఆదాయంపై రూ.817 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నికర లాభం నాలుగు శాతం పెరిగింది. అమెరికా, యూరోపియన్ మార్కెట్లు బాగా పుంజుకోవడం ఇందుకు కలిసివచ్చినట్టు కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ నిత్యానంద రెడ్డి తెలిపారు.

తగ్గిన ఎంటార్ టెక్నాలజీస్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎంటార్ టెక్నాలజీస్ ఆదాయం, లాభాలకు రెండో త్రైమాసికంలో గండి పడింది. రెండో త్రైమాసికంలో కంపెనీ రూ.135.6 కోట్ల ఆదాయంపై రూ.17 కోట్ల స్థూల లాభం, రూ.4.2 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొదటి త్రైమాసికంతో పోల్చితే క్యూ2లో కంపెనీ ఆదాయం రూ.21 కోట్లు, స్థూల లాభం రూ.11.4 కోట్లు, నికర లాభం రూ.6.6 కోట్లు పడిపోయాయి. అయితే మెరుగైన ఆర్డర్లు, ఉత్పాదకత వినియోగంతో ఈ ఆర్థిక సంవత్సరం మూడు, నాలుగు త్రైమాసికాల్లో మెరుగైన ఆర్థిక ఫలితాలు సాధిస్తామని కంపెనీ ఎండీ, ప్రమోటర్ పర్వత్ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

క్యూ2లో ఇళ్ల ధరల్లో 19% వృద్ధి

ప్రాప్ టైగర్ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలోని ఎనిమిది అగ్రగామి నగరాల్లో ఇళ్ల ధరలు జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో 7-19% పెరిగాయి. రియల్టీ కన్సల్టెంట్ ఆరమ్ ప్రాప్‌టెక్ తాజా నివేదికలో ఈ విషయం వెల్లడించింది. ఇళ్ల ధరలు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో గరిష్ఠంగా 19% పెరిగినట్టు తెలిపింది. ప్రధానంగా విలాసవంతమైన ఇళ్లకు డిమాండు గణనీయంగా పెరిగినట్టు పేర్కొంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో అక్కడ చదరపు అడుగు ధర రూ.7,479 ఉండగా ఇప్పుడు రూ.8,900 పలుకుతోంది. హైదరాబాద్, బెంగళూరు నగరాలు రెండూ కూడా బలమైన వృద్ధిని నమోదు చేశాయి. హైదరాబాద్‌లో ఇళ్ల ధర 13% వృద్ధితో చదరపు అడుగు రూ.6,858 నుంచి రూ.7,750కి పెరిగింది. బెంగళూరులో చదరపు అడుగు ధర 15% వృద్ధితో రూ.7,713 నుంచి రూ.8,870కి పెరిగింది.

అమ్మకాలు నీరసం

ఇళ్ల ధరలు దూసుకుపోతుండడం అమ్మకాలను ప్రభావితం చేసినట్టు తెలుస్తోంది. జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో టాప్ 8 నగరాల్లో ఇళ్ల అమ్మకాల్లో వృద్ధి స్వల్పంగానే ఉన్నట్టు హౌసింగ్ డాట్ కామ్ తాజా నివేదికలో తెలిపింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ ఎనిమిది నగరాల్లోనూ కలిపి మొత్తం 96,544 ఇళ్లు అమ్ముడుపోగా ఈ ఏడాది 96,827 ఇళ్లు అమ్ముడుపోయాయి. అలాగే కొత్తగా ప్రారంభమైన ఇళ్ల నిర్మాణం 91,863 నుంచి 94,419కి పెరిగింది. గత అర్థ దశాబ్ది కాలంలోనూ ధరలు విపరీతంగా పెరిగిపోవడం అఫర్డబుల్ హౌసింగ్ విభాగంలో అమ్మకాలు తగ్గడానికి కారణమయిందని ఈ పోర్టల్ యాజమాన్య సంస్థ రియా సీఈఓ ప్రవీణ్ శర్మ అన్నారు. అయితే ప్రీమియం విభాగంలో మాత్రం డిమాండు బలంగా ఉన్నట్టు చెప్పారు. ఇళ్ల అమ్మకాలు పెరగాలంటే అఫర్డబుల్ విభాగంలో సరఫరా పెంచేందుకు డెవలపర్లను ప్రోత్సహించాలని, కొనుగోలదారుల భరించగల స్థాయిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. 8 నగరాల్లోనూ ఇళ్ల అమ్మకాల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. హైదరాబాద్‌లో అమ్మకాలు 5% పెరిగి 11,164 యూనిట్ల నుంచి 12,138 యూనిట్లకు చేరాయి. ప్రధానంగా అహ్మదాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై రీజిన్, పూణె నగరాల్లో అమ్మకాలు క్షీణించగా బెంగళూరు, చెన్నై, కోల్కతా నగరాల్లో పెరిగాయి.

జీసీసీ నాయకత్వ ప్రతిభలో హైదరాబాద్ టాప్



న్యూఢిల్లీ: దేశంలో ఏర్పాటవుతున్న గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ) నాయకత్వం పూర్తిగా హైదరాబాద్, బెంగళూరు నగరాల్లోనే కేంద్రీకృతమయింది. జీసీసీల్లో ప్రతీ 10 నాయకత్వ స్థానాల్లోనూ 7 ఈ రెండు నగరాల్లోనే ఉన్నట్టు క్వెస్ కార్పొరేషన్ విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. నాయకత్వ స్థానాలకు ప్రతిభావంతులను ఎంపిక చేసుకోవడంలో హైదరాబాద్ 42% వృద్ధితో అగ్రస్థానంలో ఉంది. పోటీ ప్రీమియం 6-8% ఉంది. ప్రతిభావంతుల సంఖ్యలో బెంగళూరు టాప్‌లో ఉంది. ఇక్కడ వ్యయ సూచీ మార్కెట్ సగటు కన్నా 8-10% అధికంగా ఉంది. ఫైనాన్స్, రిస్క్, అదుపు ఆధారిత పని విభాగంలో చెన్నై ప్రాధాన్యతా నగరంగా నిలిచింది. ఇక్కడ రిటెన్షన్ స్థాయి 94% ఉంది. ప్రథమ శ్రేణి నగరాల్లో ఇది గరిష్ఠ స్థాయి.

నిపుణుల కొరత: టెక్నాలజీ విభాగాల్లో ప్రతిభావంతుల కొరత తీవ్రంగా ఉన్నట్టు కూడా క్వెస్ కార్ప్ తెలిపింది. ప్రధానంగా జెనరేటివ్ ఏఐ, ఎల్ఎల్ఎం ఇంజనీరింగ్ విభాగాల్లో ఈ కొరత 50% వరకు ఉన్నట్టు అంచనా. ఇతర విభాగాల్లో కొరత 38-45% ఉంది. కీలకమైన నాయకత్వ బాధ్యతల్లో నియామకాలకు 90 నుంచి 120 రోజుల సమయం పడుతోంది. ఆఫర్ ప్రకటించిన తర్వాత జాయిన్ కావడానికి జరుగుతున్న వ్యత్యాసం 68-72% ఉంది. బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఈ కొరత అధికంగా ఉన్నందు వల్ల ప్రాజెక్టుల అమలు నత్తనడకన సాగుతున్నట్టు క్వెస్ కార్ప్ నివేదిక వెల్లడించింది.


అభివాదం చేస్తున్న మంత్రులు తుమ్మల, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే నాగరాజు

కేటీఆర్.. పేదల కడుపు నింపడం

మాకు గొప్పే

- ప్రతి పేదవాడికి 6 కిలోల సన్నబియ్యం ఇస్తున్నాం
- జూబ్లీ హిల్స్‌లో కొత్తగా 14 వేల రేషన్ కార్డులిచ్చాం
- బీఆర్ఎస్ చేయలేనిది కాంగ్రెస్ చేసి చూపిస్తోంది
- అది ఓర్వలేకే కేటీఆర్ అహంకార ధోరణితో మాటలు
- మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్/వెంగళరావు నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపడం తమకు గొప్ప విషయమేనని మంత్రి వాకిటి శ్రీహరి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. కొత్తగా రేషన్ కార్డులతో పాటు ప్రతి పేదవాడికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. పేద ప్రజల కడుపు నింపడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న రేషన్ కార్డులు చూసి... వారు చేయనిది తాము చేస్తున్నామని ఓర్వలేక అహంకార ధోరణితో కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం వెంగళరావు నగర్ డివిజన్ జవహర్ నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా దళిత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కూడా పాల్గొన్నారు. శ్రీహరి మాట్లాడుతూ అంబేడ్కర్ ఇచ్చిన వజ్రాయుధం ఓటు హక్కు అని, ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి గురించి ఆలోచించే వారికి ఓటేస్తేనే రాజ్యాంగం ద్వారా ఆయన కల్పించిన ఓటు హక్కుకు విలువ ఉంటుందన్నారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో మూడుసార్లు బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చిన తరువాత కూడా ఇంకా ఈ ప్రాంతంలో మురికి కాలువలు, హై టెన్షన్ వైర్లు, తాగునీటి సమస్యలు ఎందుకున్నాయో ప్రజలు ఆలోచించాలన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఈప్రాంత అభివృద్ధికి బీఆర్ఎస్ ఏం చేసిందని ప్రశ్నించారు. ఇప్పుడు ఏదో చేస్తామని బీఆర్ఎస్ నాయకులు మాయమాటలు చెబుతున్నారని, వాటిని నమ్మి ప్రజలు మోసం పోవద్దన్నారు. ఆ పార్టీ చెల్లుబాటు అయ్యే రోజులు ఎప్పుడో పోయాయన్నారు. కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమని, ఇప్పటికే జూబ్లీహిల్స్‌లో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని గుర్తుచేశారు. ఇప్పటివరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దాదాపు 14 వేల నూతన రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు అప్పటికే ఉన్నవాటిలో కొత్తగా 8 వేల మందిని చేర్చామని చెప్పారు. దాదాపు 20 వేల కుటుంబాలకు 1,14,206 పైగా గ్యాస్ సిలిండర్లు రూ.500కే ఇచ్చామని, దీంతో ప్రజలకు రూ.3.6 కోట్లు ఆదా అయ్యాయని తెలిపారు. నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి బాధ్యత తీసుకుంటామని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి, మహిళా సాధికారితే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మూడు దశాబ్దాల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణను చేసిన మొదటి ప్రభుత్వం తమదేనన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ ఎమ్మెల్యే ఏ మోహన్, మేడి పాపన్న, దేవని సతీశ్ మాదిగ, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఆ పార్టీలు ముస్లింల

రిజర్వేషన్‌ను ఎత్తేస్తాయ్

(మొదటిపేజీ తరువాయి)

గేట్-2, గేట్-1 మీదుగా బృందావన్ కాలనీ వరకు, యూసుఫ్‌గూడలో వెంకటగిరి నుంచి కృష్ణానగర్ మీదుగా యూసఫ్‌గూడ చెక్ పోస్టు వరకు సీఎం రేవంత్ రెడ్డి రోడ్‌షో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. "కాళేశ్వరం ప్రాజెక్టులోఅవినీతికి సంబంధించి కేసీఆర్‌పై సీబీఐ కేసెందుకు పెట్టలేదని సవాల్ విసిరితే.. కిషన్‌రెడ్డి నాకు సవాల్ విసరుతున్నారు. నాతో చర్చలు జరపడం కాదు.. ఢిల్లీకి వెళ్లి మోదీ, అమిత్‌షాతో చర్చించండి. కేసీఆర్, కేటీఆర్ అరెస్టుకు ఎందుకు అనుమతించడంలేదని కొట్లాడండి" అని రేవంత్ ధ్వజమెత్తారు.

జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ తెచ్చుకుంటవా?

కిషన్‌రెడ్డి భయపెడితే భయపడడానికి చిన్న పిల్లలు ఎవరూ లేరని సీఎం రేవంత్ అన్నారు. "చాలా మందిని చూశాం. నియంతలా నీల్గిన కేసీఆర్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు బండకేసి కొడితే ఫామ్‌హౌజ్‌లో పండుకుండు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ తెచ్చుకుంటవా? డిపాజిట్ తెచ్చుకుంటే నువ్వు గెలిచినట్లే..! డిపాజిట్లు రాని నియోజకర్గంలో పర్యటనలు చేస్తూ బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కృషి చేస్తున్నావు. పార్టీని తాకట్టు పెట్టి కేసీఆర్‌ను కాపాడటం కాదు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లను ఎప్పటి వరకు బొక్కలో వేస్తావో చెప్పి జూబ్లీహిల్స్‌లో ఓట్లు అడగాలి" అని సవాల్ చేశారు. కేటీఆర్ చర్చలకు సవాల్ అంటున్నారని, సవాల్ విసరడం, పారిపోవడం ఆయన జాతిలోనే ఉందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కంటోన్మెంట్‌లో రూ.5 వేల కోట్ల అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యే శ్రీగణేశ్ జీవోలు చూపిస్తే రాజీనామా చేయకుండా కేటీఆర్ పారిపోయారని ధ్వజమెత్తారు. సన్నాసులు సవాల్ విసిరితే కాంగ్రెస్ కార్యకర్తలు పట్టించుకోరన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్లలో ఉన్న చెత్త, తాగునీటి సమస్య, ఇండ్లపై విద్యుత్ తీగల సమస్యలకు బీజేపీ, బీఆర్ఎస్సే కారణమని ఆరోపించారు. 2014 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉందని, ఎంపీగా బీజేపీ నేతను గెలిపించారని, తమకు అవకాశం రాలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

డబుల్ ఇళ్ల పేరుతో కేసీఆర్ మోసం..

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని సీఎం రేవంత్ ఆరోపించారు. తాము రాబోయే రోజుల్లో జూబ్లీహిల్స్‌కు 4వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్, కేటీఆర్ ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే వీళ్లకు వచ్చే సమస్య ఏమిటని ప్రశ్నించారు. మోదీ, అమిత్‌షా వచ్చి అడ్డుకున్నా మైనార్టీలకు పదవులు ఇస్తామన్నారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ ఏనాడూ సినీ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. కృష్ణానగర్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సినీ కార్మికుల పిల్లలు, జీవితాల గురించి కేసీఆర్, కేటీఆర్ మాట్లాడలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక 24 క్రాఫ్టుల సినీ సంఘాలను ఇంటికి పిలిచి మాట్లాడానని, గద్దర్ అవార్డులు ఇస్తున్నామని గుర్తు చేశారు. నవీన్ యాదవ్ 30 వేల మెజారిటీతో గెలుస్తారని, షేక్‌పేట నుంచే 15 వేల మెజారిటీ వస్తుందని అన్నారు. రోడ్‌షోలో మంత్రులు వివేక్, అజారుద్దీన్, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎంఐఎం ఎమ్మెల్యే కౌసర్ మెయినుద్దీన్ పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్‌లోని షేక్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి వివేక్, ఎమ్మెల్యే మెయినుద్దీన్ తదితరులు



బీజేపీ తాకట్టులో బీఆర్ఎస్!

బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. ఆ పార్టీని బీజేపీకి తాకట్టు పెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందుకే.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, అక్రమాల కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడిచినా కేంద్రం ఇంతవరకూ స్పందించలేదన్నారు. ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్‌ను అనుమతి కోరితే కూడా ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ ఒప్పందమే లేకుంటే గవర్నర్ అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్.. ప్రమాదకరమని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటువేస్తే కమలానికి వేసినట్లేనని అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. ఇదిలా ఉండగా.. ఎర్రగడ్డకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షరీఫ్ ఖురేషీ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షరీఫ్ ఖురేషీ


సినీ రంగ ప్రముఖుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు

హైదరాబాద్‌లో వరల్డ్ క్లాస్ ఫిలిం సిటీ ఏర్పాటు

- కాంగ్రెస్ హయాంలోనే సినీ రంగానికి మేలు
- సినిమా స్టూడియోలకు స్థలాలిచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలే
- సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి సర్కారు సిద్ధం
- సినీ రంగ ప్రముఖులు, సినీ కార్మిక సంఘాల నేతల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫిలిం సిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో తమ ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి బుధవారం జూబ్లీహిల్స్‌లోని తెలుగు క్లబ్‌లో సినీ రంగ ప్రముఖులు, సినీ రంగ కార్మిక నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలా మంది సినీ పరిశ్రమ గురించి చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారు గానీ.. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, తెలంగాణలో కానీ సినీ పరిశ్రమకు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే మేలు జరిగిందన్నారు. వేలాది మంది సినీ కార్మికుల జీవితాలను మెరుగు పర్చడానికి, చెన్నై నుంచి సినీ పరిశ్రమను తరలించినప్పుడు హైదరాబాద్‌లో సినీ స్టూడియోల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వమే భూములు ఇచ్చిందని గుర్తు చేశారు. అన్నపూర్ణ, పద్మాలయ, రామానాయుడు తదితర సినిమా స్టూడియోలు కాంగ్రెస్ ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే ప్రారంభమయ్యాయన్నారు. ఫిలిం క్లబ్‌కు సైతం కాంగ్రెస్ ప్రభుత్వమే స్థలం కేటాయించిందని భట్టి చెప్పారు. సీనియర్ నటుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సినీ కార్మికుల కోసం దివంగత సీఎం వైఎస్‌ను అడిగి మరీ చిత్రపురి కాలనీని ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు ఏ సమస్య వచ్చినా.., ఎటువంటి విజ్ఞప్తులు వచ్చినా పరిష్కారానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అన్ని భాషల వారిని అక్కున చేర్చుకునే గొప్ప నగరం హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, చక్కటి వాతావరణంతోపాటు తక్కువ ధరకే మానవ వనరులు లభిస్తాయని భట్టి పేర్కొన్నారు. ప్రతి సందర్భంలోనూ సినీ పరిశ్రమకు కాంగ్రెస్ ప్రభుత్వాలు అండగా నిలబడ్డాయని, భవిష్యత్తులోనూ నిలబడతాయని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమ ఎంత బాగా ఎదిగితే అంత మందికి ఉపాధి లభిస్తుందని, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. తమ ప్రభుత్వం బలంగా ఉంటేనే సినీ పరిశ్రమ బాగా ఎదుగుతుందన్న భట్టి.. సినీ పరిశ్రమకు సంబంధించిన ప్రతి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. ఎఫ్‌డీసీ చైర్మన్‌తో మాట్లాడి 'మా' అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించి.. సినీ నటుల కల సాకారమయ్యేందుకు యత్నిస్తామన్నారు. భవిష్యత్తులో మంచి సినిమాలు రావాలి, చిన్న సినిమాలు కూడా రావాలని భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఓర్వలేకనే మాపై విపక్షాల విమర్శలు

- జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారంలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్ర జ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చుతామని, ప్రతిపక్ష నేతల మాటలు నమ్మి ఆందోళనకు గురికావద్దని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓర్వలేకనే ప్రతిపక్షాలు తమపై విమర్శలు చేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఎల్లారెడ్డి గూడ, కమలాపురి కాలనీ, ఇమాంగూడ, జయప్రకాష్ నగర్, తవాక్కల్ నగర్, అలీనగర్ ప్రాంతాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషిని ఇంటింటికీ వివరిస్తూ ప్రచారం నిర్వహించారు.

బ్రాహ్మణులకు మంత్రి పదవి ఇచ్చింది కాంగ్రెస్సే

పదేళ్ళ బీఆర్ఎస్ పాలనలో బ్రాహ్మణులకు మంత్రి పదవి ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీశాఖ మంత్రిగా తనకు అవకాశం ఇచ్చిందని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రాహ్మణ కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జూబ్లీహిల్స్‌లో సేవాతత్వం తెలిసిన యువకుడు నవీన్‌యాదవ్ కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నాడని, అన్ని వర్గాల వారు ఆశీర్వదించాలన్నారు.

కాంగ్రెస్ పాలనలో మహిళలకు పెద్దపీట

- మంత్రులు దామోదర, జూపల్లి

ఎర్రగడ్డ: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహిళలకు పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఎర్రగడ్డలోని మెజిస్టిక్ గార్డెన్‌లో మహిళా సంఘాలు, స్వయం సహకారక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎర్రగడ్డలో మెయ్యి పడకలతో నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అధిక శాతం ఉద్యోగాలు మహిళలకు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి ఇదివరకే ప్రకటించారని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపుకు మహిళలంతా ఏకమై శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

బీసీ బిడ్డను గెలిపించుకుందాం

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఆధిపత్య వర్గాలు, ఆత్మగౌరవ కులాల మధ్య పోరాటం: జాజుల
- నవీన్ యాదవ్‌కు బీసీ సంఘాల మద్దతు

పంజాగుట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఆధిపత్య వర్గాలకు, ఆత్మగౌరవ కులాలకు మధ్య జరుగుతున్న పోరాటమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ ఎన్నికలో బీసీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను పార్టీలకు అతీతంగా గెలిపించాలని పిలుపునిచ్చారు. నవీన్‌యాదవ్ గెలుపు.. బీసీ రాజకీయాలకు మలుపు అని పేర్కొన్నారు. బుధవారం బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాలు, బీసీ సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మూడు పార్టీల మధ్య కాదని, మూడు కులాల మధ్య జరిగే ఎన్నిక అని అన్నారు.

20శాతం ముస్లింల కోసం

హిందువులను నిర్లక్ష్యం చేస్తారా?

- ముస్లిం ఓట్లే కావాలనుకుంటే హిందువుల ఓట్లు అవసరం లేదని రేవంత్ రెడ్డి చెప్పాలి
- సమాజాన్ని మతం పేరుతో విభజించి లబ్ధి పొందాలనే కుట్ర
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ముస్లింలు ఉన్నారంటే అది కాంగ్రెస్ వల్లే అంటూ.. ముస్లింలకు గౌరవం ఉందంటే అదీ కాంగ్రెస్ వల్లే అంటూ.. కాంగ్రెస్ లేకపోతే ముస్లింలకు దిక్కులేదు అంటూ వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మత ఆధారిత ఓటు బ్యాంకు రాజకీయాలను మాత్రమే నమ్ముతోందనే విషయం మరోసారి స్పష్టమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. పాలన, అభివృద్ధి, ప్రజాసేవపై చర్చించడానికి బదులుగా సమాజాన్ని మతం పేరుతో విభజించి రాజకీయ లబ్ధి పొందేందుకు, అధికారాన్ని కాపాడుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం 20శాతం ముస్లిం ఓట్ల కోసం 80శాతం హిందువుల మనోభావాలను నిర్లక్ష్యం చేస్తున్నారని.. దీనికి లౌకికవాద ముసుగు తొడగడం ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఉప ఎన్నికలలో లబ్ధి పొందేందుకు మంత్రి పదవిని కూడా మత ప్రాతిపదికన కేటాయించడం సిగ్గుచేటు అని విమర్శించారు. ముస్లిం సమాజానికి నిజమైన న్యాయం చేయాలంటే విద్య, ఉపాధి, మెరుగైన ఆర్థిక అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని.. కానీ కాంగ్రెస్ మాత్రం వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందని ఆరోపించారు. "మీకు, మీ పార్టీకి ముస్లింల ఓట్లు మాత్రమే కావాలనుకుంటే, హిందువుల ఓట్లు అవసరం లేదని బహిరంగంగా చెప్పే ధైర్యం చూపాలి" అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాగా అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల చొప్పున పరిహారం ఇవ్వాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సీఎంకు బహిరంగ లేఖను విడుదల చేశారు. బీజేపీ ఎప్పుడూ వ్యవస్థలను తన సొంత ప్రయోజనాల కోసం వాడుకోలేదని.. ఇక ముందు వాడుకోదని ఆ పార్టీ నేత, ఎంపీ రఘునందన్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు సీబీఐని తన కక్షపూరిత రాజకీయాల కోసం వాడుకున్న సంగతి దేశానికి తెలుసునన్నారు. గతంలో సీబీఐని 'కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' అంటూ నిర్వచించేవారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ 20నెలల పాలనలో బీఆర్ఎస్ నేతలకు, రాహుల్‌గాంధీకి, ఏఐసీసీ నాయకత్వం మధ్య ఏదో ఒప్పందం కుదిరి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులను అరెస్టు చేస్తే కాంగ్రెస్ పార్టీ బద్నాం అవుతుందని భావించే కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తూ తీర్మానం చేసినట్లు అనిపిస్తోందని పేర్కొన్నారు.

చెత్త ఎవరిదో.. సత్తా ఎవరిదో తేలిపోవాలి

హైదరాబాద్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా.. సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

- బీఆర్ఎస్ హయాంలో జూబ్లీహిల్స్‌లో జరిగిన అభివృద్ధిపై నివేదిక విడుదల
- దమ్ముంటే ఫార్ములా ఈ కేసులో తనను అరెస్టు చేయాలని వ్యాఖ్య



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్న కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అభివృద్ధి అంశంపై చర్చ పెడితే బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో, కాంగ్రెస్ పాలనలో ఏం జరిగిందో తేలిపోతుందని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ చర్చకు సిద్ధమా ? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ చేశారు. ఆ చర్చతో చెత్త ఎవరిదో ? సత్తా ఎవరిదో తేలిపోతుందన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓడిపోతామనే అసహనంతో ముఖ్యమంత్రి ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన నివేదికను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అనైతిక బంధం కొనసాగిస్తున్నాయని, రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీల ఉమ్మడి ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. మోదీతో రేవంత్‌రెడ్డిది ఫెవికాల్ బంధమన్నారు. సీబీఐ, ఈడీ తదితర సంస్థలను రాహుల్ గాంధీ విమర్శిస్తుంటే అవే సంస్థలను రేవంత్ నమ్ముతారని విమర్శించారు. ఏడాదిన్నర, రెండేళ్లలో రేవంత్ రెడ్డి బీజేపీలో చేరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ఉంటేనే ముస్లింలు ఉంటారంటూ సీఎం చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన కేటీఆర్.. కాంగ్రెస్ పుట్టక ముందు నుంచే దేశంలో ముస్లింలు ఉన్నారన్నారు. మైనార్టీలను అవమానించినందుకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. హైదరాబాద్‌ను ఎవరు ఎంత అభివృద్ధి చేశారో తేల్చేందుకు దమ్ముంటే చర్చకు రావాలని సీఎంకు కేటీఆర్ సవాల్ విసిరారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అసెంబ్లీ, గాంధీభవన్‌ల్లో ఎక్కడ చర్చ పెట్టినా తాను వస్తానని స్పష్టం చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో.. రెండేళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందో చర్చకు సిద్ధమా? అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఆ చర్చతో చెత్త ఎవరిదో, సత్తా ఎవరిదో తేలిపోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోతామనే అసహనంతో సీఎం ఏదేదో మాట్లాడుతున్నారని, ఆయన భాషలో అర్థమయ్యేటట్లు బదులిచ్చే సత్తా ఉన్నా.. తాము గౌరవంగానే మాట్లాడతామని చెప్పారు. ఇక, 2014 నుంచి 2023 వరకు తమ హయాంలో జూబ్లీహిల్స్‌లో ప్రజా సంక్షేమ, ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.5,328 కోట్లు వెచ్చించామని, 2,12,362 మంది లబ్ధిదారులు ఉన్నారని కేటీఆర్ వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో 42 ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించామని, వాటినే ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభిస్తోందన్నారు. హైదరాబాద్‌లో శానిటేషన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. కేసీఆర్ హైదరాబాద్‌ను క్లీన్‌సిటీగా మారిస్తే..ప్రస్తుత ప్రభుత్వం మురికి కూపంగా మార్చిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని, ఒక్క ఇల్లు కూడా కట్టని ప్రస్తుత ప్రభుత్వం హైడ్రాతో వేలాది ఇళ్లను కూల్చేసిందన్నారు. కాంగ్రెస్ బాధ తట్టుకోలేక ఎంతోమంది పారిశ్రామికవేత్తలు పారిపోయారని ఆరోపించారు.

నువ్వు మొగోనివైతే.. లైడిక్టెటర్ చర్చకు రా!

ఫార్ములా ఈ కేసులో గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చినా, చార్జ్‌షీట్‌లో విషయం లేక కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అంశాన్ని పక్కన పెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. ఆ విషయంలో.. దమ్మంటే ప్రభుత్వం తనను అరెస్ట్ చేయాలన్నారు. అలాగే, తాను లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధమని.. మొగోనివైతే నువ్వు కూడా లైడిటెక్టర్ టెస్టుకు రా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. హైదరాబాద్‌లో క్రైమ్ రేటు పెరగడం, పట్టపగలే హత్యలు జరుగుతుండడం ప్రభుత్వ వైఫల్యం అన్నారు. మహారాష్ట్ర పోలీసులు చర్లపల్లిలో వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుకున్నారంటే అంతకంటే అవమానం మరొకటి ఉంటుందా ? అని కేటీఆర్ ప్రశ్నించారు. గత రెండేళ్లలో ప్రభుత్వం ఏం చేసిందో చెప్పి.. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్రజలను ఓట్లు అడగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు హిందువులు ఇజ్జత్ కాదా?

- మజ్లిస్‌ను రేవంత్ భుజాలమీద వేసుకుని తిరుగుతున్నారు: కిషన్ రెడ్డి


బోరబండ సాయిబాబానగర్‌లో ప్రచారం చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/ఎర్రగడ్డ, బోరబండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ భవిష్యత్తును నిర్దేశించే ఈ ఉప ఎన్నికలో ప్రజలు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకూ జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచినా అభివృద్ధి చేయలేదని.. ఈసారి బిజేపీకి అవకాశం ఇవ్వాలని ఆయన ఓటర్లను కోరారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కేసీఆర్ హయాంలో మజ్లిస్ ఏ రకంగా వ్యవహరించిందో అందరికీ తెలుసని.. కాంగ్రెస్ అభ్యర్థి ఒకప్పటి మజ్లిస్ నాయకుడేనని, ఆయన గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేశారని, మజ్లిస్ నుంచి కాంగ్రెస్ అరువు తెచ్చుకుని టికెట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. "కాంగ్రెస్ పార్టీ ముస్లింల ఇజ్జత్" అనడమేమిటంటూ సీఎం రేవంత్‌పై కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "కాంగ్రెస్ పార్టీకి హిందువులు ఇజ్జత్ కాదా?" అని కిషన్ రెడ్డి నిలదీశారు. మజ్లిస్ పార్టీని రేవంత్ రెడ్డి భుజాల మీద వేసుకొని తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. "మీకు మేయర్.. మాకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే' అని మజ్లిస్‌తో కాంగ్రెస్ ఒప్పందం కుదుర్చుకుంది." అని ఆరోపించారు. దేశంపైన కొంచెం కూడా అభిమానం లేకుండా రేవంత్ రెడ్డి సైనికులను కించపరుస్తూ మాట్లాడడం ఎంతవరకూ సమంజసం అని ప్రశ్నించారు. కేసీఆర్ ఫాంహౌస్‌కు పోయినట్లు... రేవంత్ రెడ్డి సైతం ఫాంహౌస్‌కు వెళ్లాల్సిందేనని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు కోరుకుంటున్న మార్పు బీజేపీతోనే వస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ రెండు పార్టీలూ ఒక్కో ఓటుకు రూ.20-30 వేలు ఇస్తున్నాయని.. గెలిచిన తర్వాత ఆ డబ్బులను ప్రజల దగ్గరే వసూలు చేసుకుంటాయని, అలాంటి పార్టీలను గెలిపించవద్దని కిషన్ రెడ్డి సూచించారు. బుధవారం రాత్రి బీజేపీ కార్యకర్తలు బోరబండలో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మలుపులు ఉంటే ప్రమాదకరం

» ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మలుపులు ఉంటే ప్రమాదకరమని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్- చేవెళ్ల- బీజాపూర్ జాతీయ రహదారిపై అనేక చోట్ల మలుపులు ఉన్నాయని, వాటిని తొలగించి రహదారిని స్ట్రెయిట్‌గా (నేరుగా) నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. 'హైదరాబాద్- చేవెళ్ల- బీజాపూర్ జాతీయ రహదారి అలైన్‌మెంట్‌లో చాలా చోట్ల మలుపులు ఉన్నాయి. దేశంలో ఏ జాతీయ రహదారి అలైన్‌మెంట్ కూడా ఇలా లేదు. అందుకే అలైన్‌మెంట్ మార్చి మలుపులు ఉండకుండా నేరుగా ఉండేలా చేయాలి. అప్పుడు ప్రమాదాలకు ఆస్కారం ఉండదు' అని అన్నారు. వంకరటింకరగా ఉన్న అలైన్‌మెంట్‌ను మారిస్తే భూసేకరణ ఎక్కువగా అవసరం ఉండదని, దూరం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. హైవేకు సంబంధించి సేకరించిన భూమి కూడా మిగులుతుందని, దానిని రైతులకు తిరిగి ఇవ్వవచ్చని తెలిపారు. హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై మూడు ప్రాంతాల్లో డేంజర్ స్పాట్‌లు ఉన్నాయన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల తర్వాత, చేవెళ్ల ప్రాంత ఎమ్మెల్యేలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వద్దకు తీసుకు వెళ్తానని తెలిపారు.

రెవెన్యూ శాఖను తొలగిస్తే తప్ప దేశం బాగుపడదు: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చెరువులకు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) నిర్ణయించకపోవడం వల్ల చాలా సమస్యలు వస్తున్నాయని హైకోర్టు తెలిపింది. ఏది ఎఫ్‌టీఎల్.. ఏది పట్టా భూమి అనే విషయంలో రెవెన్యూ, నీటిపారుదల అధికారులకు సమన్వయం, అవగాహన లేదని పేర్కొంది. రెవెన్యూ శాఖను తొలగిస్తే తప్ప ఈ దేశం బాగుపడదంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం అడవిమల్లెల పరిధిలోని సర్వే నంబర్ 11, 12, 13, 29, 30, 31లోని తమ పట్టా భూమిని మిషన్ కాకతీయ పథకంలో చేర్చడాన్ని సవాల్ చేస్తూ బి.కృష్ణారెడ్డి తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. 'పిటిషనర్లు పేర్కొంటున్న సర్వే నంబర్ 29 పూర్తిగా చెరువు మధ్యలో ఉంది. చెరువు మధ్యలో పట్టాలు ఎలా ఇస్తారు? రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులకు ఎఫ్‌టీఎల్ నిర్ణయించని కారణంగానే ఇలాంటి సమస్యలు వస్తున్నాయి' అని కోర్టు వ్యాఖ్యానించింది. దీనిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేసింది.

పేద విద్యార్థులకు బండి సంజయ్ భరోసా

» మోదీ గిఫ్ట్ పేరుతో పరీక్ష ఫీజు చెల్లింపు

కరీంనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అండగా నిలబడ్డారు. సుమారు 12,292 మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను మోదీ గిఫ్ట్ పేరుతో తానే చెల్లిస్తానని సంజయ్ తెలిపారు. ఈ మేరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు. ఈ మొత్తాన్ని బండి సంజయ్ తన వేతనం నుంచి చెల్లించడానికి ముందుకొచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, జగిత్యాల, హన్మకొండ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ సాయం అందనుంది. గతంలో కూడా బండి సంజయ్ మోదీ గిఫ్ట్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలు, సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. పేద విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిల్స్, స్టీల్ వాటర్ బాటిల్స్‌ను కూడా పంపిణీ చేసేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేశారు.

యూజ్‌లెస్ శ్రీదేవసేన

» విద్యారంగంపై ఆమెకు అవగాహన లేదు
» ఆమెను వెంటనే బదిలీ చేయాలి
» ముఖ్యమంత్రికి సరైన సలహాలిచ్చే అధికారులే లేరు
» 8న ఎల్బీ స్టేడియంలో బహిరంగ సభ
» 50శాతం బకాయిలు ఇచ్చే వరకు సమ్మె
» ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు



మీడియాతో మాట్లాడుతున్న ఫాతి ప్రతినిధులు

హైదరాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): "మాకు రావాల్సిన బకాయిలు ఇవ్వాలని కోరితే సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన 'యూజ్‌లెస్ కాలేజెస్' అన్నారు. ప్రభుత్వానికి, కాలేజీ యాజమాన్యాలకు సంధానకర్తగా ఉండాల్సిన ఆమె.. మమ్మల్ని అవమానించారు. ఉన్నత విద్యారంగంపై ఆమెకు అవగాహనే లేదు. యూజ్‌లెస్ శ్రీదేవసేన" అని తెలంగాణ ప్రైవేటు కాలేజీల యాజమాన్య సంఘాల సమాఖ్య (ఫాతి) ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యాసంస్థలపై ఇలాంటి అభిప్రాయం ఉన్న అధికారిణి.. కళాశాల బాగోగులు ఎలా చూస్తారని మండిపడ్డారు. ఆమెను వెంటనే ఈ శాఖ నుంచి బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ చేపట్టిన కళాశాలల బంద్ మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఫతేమైదాన్ క్లబ్‌లో బుధవారం ఫాతి అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఫాతి అధ్యక్షుడు నిమ్మటూరి రమేశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో 50శాతం చెల్లించే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాలేజీల్లో సిబ్బంది తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్నారని, వారికి క్షమాపణ చేప్పేందుకు ఈనెల 8న ఎల్బీ స్టేడియంలో లక్ష మందితో తెలంగాణ అధ్యాపక సాంత్వన సభ నిర్వహించనున్నామని వెల్లడించారు. 11న 10లక్షల మంది విద్యార్థులతో సచివాలయానికి లాంగ్ మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. రీయింబర్స్‌మెంట్‌పై సలహాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నియమించిన కమిటీలో విషయ పరిజ్ఞానం లేని వారున్నారని, వారిని తొలగించాలని కోరారు. కమిటీ సూచనలు ఇచ్చేందుకు ఉద్దేశించిన 3నెలల గడువును నెల రోజులకు కుదించాలని డిమాండ్ చేశారు. ఫాతి ఉపాధ్యక్షుడు అలీజాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ కాలేజీల్లో నాణ్యమైన విద్య అందడం లేదని ప్రభుత్వం చెప్పడం అవమానించడమేనని అన్నారు. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాల్లో సత్తా చాటుతున్నారని గుర్తు చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వం రూ.24వేల కోట్లు కేటాయించినా.. వెయ్యి కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. ఫాతి ప్రధాన కార్యదర్శి బొజ్జ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగానికి సంబంధించి సీఎంకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చే అధికారులే లేరన్నారు. ఇది ఉన్నత విద్యారంగానికి ఇబ్బందికర పరిణామమన్నారు. అనంతరం 8న నిర్వహించనున్న సభకు సంబంధించిన పోస్టర్లను ఫాతి ప్రతినిధులు ఆవిష్కరించారు.

వేగానికేది కళ్లెం?

స్పీడ్ లాక్ లేకుండా దూసుకుపోతున్న భారీ వాహనాలు

» వాహన వేగం, లోడుపై రవాణా శాఖ ప్రత్యేక నజర్
» కర్నూలు, చేవెళ్ల ప్రమాదాల తర్వాత తనిఖీలు ముమ్మరం



వాహన రికార్డులు పరిశీలిస్తున్న అధికారుల

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించిన వేగం ప్రాణాలు తీస్తోంది. చేవెళ్ల సమీపంలో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదానికి కూడా టిప్పర్ అతివేగమే కారణమని అధికారుల విచారణలో తేలింది. ఇదే కాదు భారీ వాహనాలు పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్లడంతో గతంలోనూ అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ఎన్నో ప్రాణాలు పోయాయి. భారీ వాహనాల వాహన వేగ నియంత్రణకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నా.. చాలా వరకు అవి అమలు కావడం లేదు. అయితే, చేవెళ్ల, అంతకముందు ఏపీలోని కర్నూలులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ అధికారులను అప్రమత్తం చేసింది. దీంతో అధికారులు భారీ వాహనాల వేగంతోపాటు ఓవర్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనల ప్రకారం టిప్పర్ గరిష్ఠంగా గంటకు 60-80 కిలోమీటర్ల వేగం, లారీలు, ఇతర సరుకు రవాణా వాహనాల గరిష్ఠ వేగం గంటకు 80 కిమీలు, బస్సుల గరిష్ఠ వేగం గంటకు 90 కిమీలు మాత్రమే. అలాగే, ప్రతీ వాహనంలో స్పీడ్ గవర్నెన్స్ పరికరాలు కచ్చితంగా అమర్చి ఉండాలి. అయితే, చాలా వరకు భారీ వాహనాలు స్పీడ్ లాక్ లేకుండా పరిమితికి మించిన వేగంతో వెళుతున్నట్టు రవాణా శాఖ అధికారులు ఈ తనిఖీల్లో గుర్తించారు. సగానికిపైగా వాహనాల్లో స్పీడ్ గవర్నెన్స్ పరికరాలు లేనట్టు కనుగొన్నారు. అలాగే, ఫిట్‌నెస్ లేని వాహనాలు, ఓవర్ లోడ్‌తో వెళుతున్న వాహనాలను కూడా గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. నిజానికి, వాహన తనిఖీలు అనేది నిరంతర ప్రక్రియ అని రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి నవంబరు 3 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,15,321 కేసులు నమోదు చేశామని చెప్పారు. విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నాగోల్‌లో బుధవారం చేపట్టిన తనిఖీల్లో అధిక లోడుతో ప్రయాణిస్తున్న 3 వాహనాలను అధికారులు సీజ్ చేశారు. ఓ టిప్పర్‌లో 5.6 టన్నుల ఇసుక, మరో టిప్పర్‌లో 7.5 టన్నుల ఇటుకలు, ఇంకో వాహనంలో 4.2 టన్నుల కంకర తీసుకెళ్తుండగా అడ్డుకున్నామని రవాణాశాఖ సంయుక్త కమిషనర్ రమేష్ చిదుర తెలిపారు.

స్పీడ్ లాక్ ఉల్లంఘిస్తే మూడింతల జరిమానా : మంత్రి పొన్నం

అధిక వేగమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని తేలుతున్న నేపథ్యంలో వాహనాలు స్పీడ్ లాక్‌ను ఉల్లంఘిస్తే జరిమానా మూడింతలు విధించాలని అధికారులను ఆదేశించామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇసుక, కంకర, డస్ట్, ఇటుకలు తరలించే సమయంలో లోడుపై టార్పాలిన్ కవర్ కప్పాలని అవగాహన కల్పించాలని అధికారులకు సూచించామన్నారు.

గుంతను పూడ్చిన అధికారులు



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

చేవెళ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో 19 మంది ప్రాణాలు పోవడానికి కారణమైన గుంతను అధికారులు బుధవారం పూడ్చివేశారు. 'ఇంత జరిగినా గుంత పూడ్చలే' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో జాతీయ రహదారి అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డు కాంట్రాక్టర్‌తో చేవెళ్ల, మొయినాబాద్, మన్నెగూడ వరకు ఏర్పడిన గుంతలను కూడా రెడీమిక్స్ కంకర, సిమెంట్‌తో గుంతలను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.



చేవెళ్ల వద్ద హైదరాబాద్-బీజాపూర్ రహదారి పక్కన చదును చేస్తున్న దృశ్యం

ఎట్టకేలకు రోడ్డు విస్తరణ షురూ

హైదరాబాద్-బీజాపూర్ హైవేలో 46 కి.మీ. మేర విస్తరణ

చేవెళ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిలో తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు ప్రమాదకరంగా మారిన 46 కి.మీ. మేర విస్తరణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ రహదారిలో మీర్జాగూడ వద్ద సోమవారం ఆర్టీసీ బస్సును కంకర టిప్పర్ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 19 మంది మృతిచెందగా 34 మంది గాయపడిన విషయం తెలిసిందే. రోడ్డు విస్తరణ జరగకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఇరుకైన మార్గంలో నిత్యం ఎక్కడో అక్కడ ప్రమాదాలు జరుగుతుండడంతో రాకాసి రహదారిగా పేరు పొందింది. తాజాగా ఘోర ప్రమాదంతో స్థానికుల నుంచి విమర్శలు రావడంతో అధికారులు రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యేందుకు చర్యలు తీసుకున్నారు. నిర్మాణ పనులు దక్కించుకున్న మేఘా సంస్థ పోలీసు అకాడమీ నుంచి మొయినాబాద్, చేవెళ్ల, మన్నెగూడ వరకు 20 యంత్రాలతో పనులు ప్రారంభించింది. బీటీ రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లను తొలగించి, చదును చేస్తున్నారు. దీంతో రోడ్డు విశాలంగా కనిపిస్తోంది.

పదేళ్ల క్రితమే మొదలైనా..

ఈ రహదారి విస్తరణకు ఆమోదం లభించి పదేళ్లైనా నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ. మేర నాలుగు లేన్లుగా రహదారి విస్తరణకు కేంద్రం రూ.956 కోట్లు మంజూరు చేసింది. ఈ పనుల టెండరును 'మేఘా' ఇన్‌ఫ్రా సంస్థ రూ.786 కోట్లకు దక్కించుకుంది. భూ సేకరణను దాదాపు పూర్తి చేసి కొన్నిచోట్ల పనులు మొదలుపెట్టారు. అయితే రోడ్డు పక్కన ఉన్న వృక్షాలను తొలగిస్తుండడంపై పర్యావరణ ప్రేమికులు జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడంతో పనులు ఆగిపోయాయి. ఇటీవల 765 మర్రి వృక్షాలను రక్షించేలా రహదారి అలైన్‌మెంట్ మార్పు చేసి మరో 150 వృక్షాలను వేరేచోటుకు తరలించేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో 'సేవ్ బన్‌యాన్స్ ఆఫ్ చేవెళ్ల' సంస్థ కేసు ఉపసంహరించుకుంది. దీంతో ఎన్జీటీ ఇటీవల స్టే ఎత్తివేసి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.